www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 3-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 4 | వరంగల్

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: షష్ఠి రా.9.42 తదుపరి సప్తమి; నక్షత్రం: రోహిణి ఉ.7.02, మృగశిర తె. 5.51; వర్జ్యం: మ.12.21-మ.1.52; దుర్ముహూర్తం: ఉ.10.16-ఉ.11.05, మ.3.09-మ.3.58; అమృతఘడియలు: రా.9.29-రా.11.00, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం:6.25

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాతి గుండె తల్లి

అమీన్‌పూర్ ఘటనలో దుర్మార్గానికి ఒడిగట్టింది కన్నతల్లే

చిన్ననాటి స్నేహితుడితో కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం

భర్తను వదిలేసి ప్రియుడిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయం

పిల్లలను అడ్డుతొలగించుకుంటేనే పెళ్లి అని ప్రియుడి షరతు

ముక్కు, నోరు అదిమి ముగ్గురు పిల్లల్ని హత్యచేసిన రజిత

10 ఆమెతో పాటు ప్రియుడు శివకుమార్ అరెస్టు.. రిమాండ్



రజిత

హత్యకు గురైన పిల్లలు



సీఎం వ్యాఖ్యలు పదో షెడ్యూల్‌ను

ఎగతాళి చేయడమే

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఉప ఎన్నికలు రావంటూ సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం ధ్వజం

అసెంబ్లీలో నేతల వ్యాఖ్యలకు పవిత్రత ఉంటుందని వ్యాఖ్య

మళ్లీ అలాంటి వ్యాఖ్యలు చేయొద్దని చెప్పాలంటూ సూచన

అనర్హత పిటిషన్లపై స్పీకర్ 4 ఏళ్లపాటు చర్య తీసుకోకున్నా

న్యాయస్థానాలు చేతులు కట్టుకు కూర్చోవాలా అని ఆగ్రహం

ఆర్టికల్ 142 ప్రకారం తాము చర్యలు తీసుకోవచ్చని వెల్లడి

సభాపతి నిర్ణయంపై సమీక్ష చేసే అధికారం కోర్టుకుంది

కానీ ఈ కేసులో స్పీకర్ ఏ నిర్ణయమూ తీసుకోలే: రోహత్గీ

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నేడూ విచారణ

ఒకవేళ స్పీకర్ అసలు ఏ నిర్ణయమూ తీసుకోకుంటే.. రాజ్యాంగ సంరక్షకులుగా ఉన్న ఈ దేశ కోర్టులు నిస్సహాయంగా ఉండిపోవాల్సిందేనా? ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టే. స్పీకర్ మా అభ్యర్థనకు స్పందించకుంటే ఆర్టికల్ 142 ప్రకారం చర్యలకు ఉపక్రమించే అధికారం మాకు ఉంటుంది. గతంలో ఒక స్పీకర్‌ను కోర్టుకు పిలిపించామని మరిచిపోవద్దు.

- సుప్రీంకోర్టు ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో ఏం జరిగిందో ఇప్పుడూ అదే జరుగుతుందని.. రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను సుప్రీం కోర్టు తప్పుపట్టింది. నిజంగానే నిండు సభలో సీఎం ఆ వ్యాఖ్యలు చేసి ఉంటే.. రాజ్యాంగంలోని (ప్రజాప్రతినిధుల ఫిరాయింపులకు సంబంధించిన) 10వ షెడ్యూలును అపహాస్యం చేయడం కిందికే వస్తుందని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన మూడు వేర్వేరు పిటిషన్లపై బుధవారం సుప్రీం ధర్మాసనం విచారణ జరిపింది. బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్‌రెడ్డి తరఫున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ ఆర్యామ సుందరం.. మార్చి 26న అసెంబ్లీలో స్పీకర్ సాక్షిగా సీఎం చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహత్గీ ఈ సమయంలో జోక్యం చేసుకుని.. జరుగుతున్న విచారణ అసెంబ్లీ ప్రొసీడింగ్స్

మిగతా 14వ పేజీలో...

మోదీ దిగి రావాలి

42% బీసీ రిజర్వేషన్లకు అనుమతించాలి.. లేదంటే ప్రధాని గద్దె దిగాలి

ఉద్యమం దేశమంతా కార్చిచ్చులా వ్యాపిస్తుంది

బీసీల ఆగ్రహ జ్వాలలకు బీజేపీ మసి అవుతుంది

దేశాన్ని జాగృతపరుస్తాం.. అన్ని పార్టీల్ని ఏకం చేస్తాం

దిగిరాకపోతే.. గ్రామాల్లో మీ గద్దెలు కూలుతాయ్

అధికారం ఉందని ఆధిపత్యం చెలాయిస్తే ఊరుకోం

బీసీ ముసుగులో ఎక్కువకాలం ప్రభుత్వాన్ని ఏలలేరు

రిజర్వేషన్లకు అనుమతిస్తే సభ పెట్టి సన్మానం చేస్తాం

లేదంటే ఎర్రకోటపై జెండా ఎగరేసి సాధించుకుంటాం

బండి సంజయ్ ప్రాణాలొద్దు.. రిజర్వేషన్లు ఇస్తే చాలు

ఢిల్లీ బీసీ పోరుగర్జన సభలో సీఎం రేవంత్‌రెడ్డి



ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన 'బీసీ పోరు గర్జన'లో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం, మహేశ్‌గౌడ్, అంజన్‌కుమార్, అనిల్, సినీ నటుడు సుమన్, బీసీ సంఘాల నేతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే బీసీల ఆగ్రహ జ్వాలలకు బీజేపీ మసి అవుతుందని హెచ్చరించారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు అనుమతి ఇవ్వకపోతే.. ఇది దేశమంతా కార్చిచ్చులా వ్యాపిస్తుందని, నిప్పురవ్వయి రగులుతుందని అన్నారు. "దేశం నలుమూలలా జాగృతం చేస్తాం. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను, సంఘాలను ఏకం చేస్తాం. మీరు ఢిల్లీ గద్దె మీద ఎలా ఉంటారో చూస్తాం. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వనందుకు తండ్రీ కొడుకుల ఉద్యోగాలు ఊడగొట్టినం. మీరు బీసీల రిజర్వేషన్లు ఇవ్వకపోతే చూస్తూ ఊరుకోం. మీరు మా డిమాండ్‌కు దిగి అయినా రావాలి. లేదంటే గద్దె దిగి అయినా పోవాలి. బీసీ ముసుగులో మీరు ఎక్కువకాలం ప్రభుత్వాన్ని ఏలలేరు" అని రేవంత్‌రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్లను దేశవ్యాప్తంగా అమలు చేస్తారో లేదో తమకు అవసరం లేదని, కానీ.. తెలంగాణలో అనుమతి ఇవ్వకపోతే మాత్రం ఎర్రకోటపై జెండా ఎగరేసి సాధించుకుంటామని ప్రకటించారు. విద్య, ఉద్యోగాలతోపాటు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన 'బీసీ పోరుగర్జన' సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. తమ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా కులగణన చేపట్టి కులాల లెక్కలు తేలుస్తామంటూ ప్రజలకు మాట ఇచ్చారని, దానిని తాము తెలంగాణలో అమలు చేశామని చెప్పారు. రాహుల్‌గాంధీ మాట ఇస్తే.. దానిని

మిగతా 13వ పేజీలో...

హెచ్‌సీయూలో అంగుళం కూడా స్వాధీనం చేసుకోలేదు

న్యాయపోరుతో భూమిని కాపాడాం

సాఫ్ట్‌వేర్ హబ్‌గా మార్చి లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తాం

బీఆర్ఎస్.. బిల్లీరావుతో కుమ్మక్కై భూమిని కాజేయాలనుకుంది

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 12



శాంతికి మేం సిద్ధం!

ఆపరేషన్ కగార్ నిలిపేస్తే.. కాల్పుల విరమణ

కగార్ ఓ నరమేధం.. 400 మంది హత్య

అమానుష చిత్రహింసలు పెట్టి, మహిళలపై గ్యాంగ్‌రేప్ చేసి చంపుతున్నారు

సొంత ప్రజలపై సైన్యం.. రాజ్యాంగవ్యతిరేకం

కార్పొరేట్లకు వనరుల అప్పగింత, దోపిడీ సుస్థిరం.. ఇవే 'హిందూరాష్ట్ర' లక్ష్యాలు

బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు 2

కేంద్రం, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలే దోషులు

మావోయిస్టు పార్టీ బహిరంగ ప్రకటన

ముందు తుపాకులు వీడండి

నక్సలైట్ల ప్రకటనపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం

చెట్ల నరికివేత ఆపండి

గురువారం దాకా కంచ గచ్చిబౌలిలో ఎలాంటి పనులు వద్దు

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. నేడు మళ్లీ విచారణ

ఒకే చోట 125 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు ఉంటే అడవే

వాల్టా చట్టం ప్రకారం 3 మీటర్ల కంటే ఎత్తున్న ఒక్క చెట్టును కొట్టేయాలన్నా అధికారుల అనుమతి తీసుకోవాల్సిందే

ప్రభుత్వ భూమైనా.. ప్రైవేటు అయినా నిబంధనలు వర్తిస్తాయి

అడవిలో చెట్లు కొట్టేయాలంటే నిపుణుల కమిటీ వేయాల్సిందే

కమిటీ వేయకుండా ప్రభుత్వం సుప్రీం తీర్పును ఉల్లంఘించింది

హైకోర్టులో పిటిషనర్ల తరఫు లాయర్ల వాదన

అది ప్రభుత్వ భూమే.. పరిశ్రమల కోసం ఉద్దేశించిందే

కంచ గచ్చిబౌలి.. అటవీ భూమి అని ఏ రికార్డుల్లోనూ లేదు

పాములు, ముంగీసలు, నెమళ్లు ఉంటే అడవి అవుతుందా?

అలాగైతే హైదరాబాద్‌లో చాలా ప్రాంతం అడవే

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదన

'ఐఎంజీ భారత' తీర్పులో కంచ గచ్చిబౌలి భూమి స్వభావం ఏంటనేది ఉందా.. అడ్వొకేట్ జనరల్‌ను ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో ఉన్న 400 ఎకరాల భూముల్లో ఉన్న చెట్ల నరికివేతను ఆపేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం మధ్యాహ్నం ఇదే అంశంపై తాము మళ్లీ విచారణ చేపడతామని.. అప్పటివరకు ఈ భూముల్లో ఎలాంటి పనులూ చేపట్టవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములను టీజీఐఐసీకి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 54ను కొట్టేయాలని, సదరు భూముల్లో చెట్ల నరికివేత, చదును చేసే పనులను వెంటనే ఆపాలని విశ్రాంత శాస్త్రవేత్త బాబూరావు, వట ఫౌండేషన్ వేర్వేరుగా దాఖలు చేసిన

మిగతా 12వ పేజీలో...

హెచ్‌సీయూలో లాఠీచార్జి!

విద్యార్థులు, ప్రొఫెసర్లపై లాఠీ ఝుళిపించిన పోలీసులు

30 మందికి గాయాలు

వేలం నిర్ణయాన్ని రద్దు చేయాలి

లేకుంటే ఆందోళన ఉధృతం

విద్యార్థి సంఘాల హెచ్చరిక 12

వర్సిటీలకు వందల ఎకరాలెందుకు?

ఇదేం మహారాజుల కాలం కాదు

గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్



మూసీ బఫర్ జోన్‌లో నిర్మాణాలపై

నిషేధం

50-100 మీటర్లలోపు కొత్త నిర్మాణాలకు మాస్టర్ ప్లాన్ ఖరారయ్యే వరకు అనుమతి లేదు

రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించాలన్నా అధికారుల కమిటీ ఆమోదం ఉండాలి.. ప్రభుత్వం ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మూసీ, ఈసా నదుల వెంట అక్రమ నిర్మాణాలను కట్టడి చేసేందుకు ఉపక్రమించింది. రెండు నదుల వెంబడి బఫర్ జోన్ 50 మీటర్ల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఆదేశాలు జారీ చేసింది. నది నుంచి 50 నుంచి 100 మీటర్ల పరిధిలో నిర్మాణాలపైనా ఆంక్షలు విధించింది. మూసీ, ఈసా నదుల సమగ్ర మాస్టర్ ప్లాన్ ఖరారయ్యే వరకు లేదా డీటీసీపీ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఎంఆర్‌డీసీఎల్ అధికారులతో కూడిన కమిటీ

మిగతా 14వ పేజీలో...



ప్రభుత్వమే ఫైనల్

పాలన చేయాల్సింది కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమే.. కోర్టులు కాదు

పార్లమెంటుకు, ప్రజలకు అదే జవాబుదారీ

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ 2

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కుంట్లూరులో అ'క్రమబద్ధీకరణ' పై కదలిన 'రెవెన్యూ'

ప్రభుత్వ భూమిని పరిశీలించిన యంత్రాంగం.. అక్రమ నిర్మాణాలపై ఆరా

నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్న తహసీల్దార్ 14

వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఓకే

అనుకూలంగా 226 ఓట్లు.. వ్యతిరేకంగా 163

ప్రతీ సవరణ మీద ఓటింగ్‌కు పట్టుబడిన విపక్షాలు

అర్ధరాత్రి దాటాక అన్ని సవరణలపై ఓటింగ్‌తో ఆమోదం

వక్ఫ్ బిల్లు పేరును 'ఉమీద్'గా మార్చిన కేంద్రం

ప్రస్తుత చట్టంలోని సెక్షన్ 40 అత్యంత క్రూరమైనది

దాంతో ఏ భూమినైనా తమదేనని వక్ఫ్ బోర్డు ప్రకటించవచ్చు

అలాంటి దారుణమైన సెక్షన్‌ను రద్దు చేశాం

లేదంటే పార్లమెంటు కూడా వక్ఫ్ ఆస్తే అంటారు!

జేపీసీ చేసిన అనేక సిఫారసులను పొందుపర్చాం

పేద ముస్లింల కోసం వక్ఫ్ ఆస్తులను వినియోగించాలి

బిల్లుపై చర్చలో మైనారిటీ వ్యవహారాల మంత్రి రిజిజు

బిల్లు రాజ్యాంగ విరుద్ధం: కాంగ్రెస్

ముస్లింలకు న్యాయం చేసేందుకే బిల్లు: అమిత్ షా


బిల్లు ప్రతులను చించివేసిన మజ్లిస్ ఎంపీ ఒవైసీ



లోక్‌సభలో కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి రిజిజు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: వక్ఫ్ సవరణ బిల్లు-2024ను లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఆందోళనకు దిగాయి. వారి నిరసనల నడుమ బుధవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. వక్ఫ్ బిల్లు పేరును 'యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్ (యూఎంఈఈడీ-ఉమీద్)'గా మార్చినట్లు వెల్లడించారు. సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ) చేసిన అనేక సిఫారసులను కూడా బిల్లులో పొందుపర్చినట్లు తెలిపారు. జేపీసీ సిఫారసులను బిల్లులో చేర్చలేదన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని

మిగతా 2వ పేజీలో...



విస్తరణకు విరామం!

ఇంకా నిర్ణయానికి రాని కాంగ్రెస్ అధిష్ఠానం

వక్ఫ్ బిల్లుపై ఏఐసీసీ బిజీ బిజీ!

మంత్రివర్గ విస్తరణపై ఈ నెల రెండో వారంలో నిర్ణయం!

ఢిల్లీకి ఆశావహులు.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలకు బాసటగా జానారెడ్డి

తమకు చోటు కల్పించాలని మాదిగ, లంబాడా వర్గం నేతల డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ ఎపిసోడ్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం చిన్న విరామం ఇచ్చిందా? వక్ఫ్ బిల్లుపైన, సంస్థాగత వ్యవహారాల్లోనూ బిజీగా ఉన్న ఏఐసీసీ పెద్దలు.. నిర్ణయాన్ని మరో వారం పాటు వాయిదా వేశారా? ఈనెల రెండో వారంలో క్యాబినెట్ విస్తరణపైన నిర్ణయం వెలువడనుందా? ఈ ప్రశ్నలకు కాంగ్రెస్ పార్టీ వర్గాలు.. అవుననే సమాధానం ఇస్తున్నాయి. వాస్తవానికి మంత్రివర్గ విస్తరణపైన గత నెల 24న ఢిల్లీలో అధిష్ఠానం పెద్దలతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల తుది దఫా చర్చలు ముగిశాయి. మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పునకు సంబంధించి ఉమ్మడి సమావేశంలోనూ, విడివిడిగానూ నేతలు తమ అభిప్రాయాలను అధిష్ఠానానికి చెప్పారు. ఈ దఫా సమీకరణలను బట్టి నలుగురు లేదా ఐదుగురితో మంత్రివర్గాన్ని విస్తరించాలన్న అవగాహనకూ వచ్చారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, టీజేఎస్ అధినేత కోదండరాం తదితర పేర్లపైన పరిశీలన చేశారు. అయితే ఇందులో రాజగోపాల్‌రెడ్డి, కోదండరాంలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీనీ పరిగణనలోకి తీసుకుని చర్చించారు. బీసీ సామాజిక వర్గంలో పార్టీ ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్, విజయశాంతి పేర్లపైన చర్చ

మిగతా 13వ పేజీలో...

పాలన చేయాల్సింది కోర్టులు కాదు.. కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమే

» పార్లమెంటుకు, ప్రజలకు అదే జవాబుదారీ: ధన్‌ఖడ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ప్రజాస్వామ్యంలో పరిపాలన చేయాల్సింది కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమేనని.. న్యాయస్థానాలు కాదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టం చేశారు. పార్లమెంటుకు, ప్రజలకు కార్యనిర్వాహక వ్యవస్థే జవాబుదారీగా పేర్కొన్నారు. బుధవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా జాతీయ అర్హత-ప్రవేశ పరీక్ష (నీట్)ను వికేంద్రీకరించాలంటూ డీఎంకే సభ్యురాలు కనిమొళి ఎన్‌వీఎన్ సోము చేసిన డిమాండ్‌పై కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. ఇది డీఎంకే భాగస్వామిగా ఉన్న యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానమని.. నీట్‌ను కేంద్రీకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ జోక్యం చేసుకున్నారు. 'ప్రభుత్వమే ఫైనల్. ప్రభుత్వం తన కార్యనిర్వాహక అధికారాన్ని కోర్టుతో కలిసి పంచుకోగలదా? ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ మాత్రమే పాలన చేయాలి. ఎందుకంటే అదే పార్లమెంటుకు, ప్రజలకు జవాబుదారీ. దేశాన్ని పాలించేందుకు ప్రజలు దానిని ఎన్నుకుంటారు. అందుచేత ఈ అంశంపై దృష్టి సారించండి' అని సూచించారు.

అంగన్వాడీల వేతనాన్ని రెట్టింపు చేయండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవ వేతనం రెట్టింపు చేయాలని, వారి కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రానికి పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసు చేసింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ అధ్యక్షతన విద్య, మహిళలు, శిశు, యువజన, క్రీడల స్థాయీ సంఘం ఈ మేరకు ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖకు ఈ నివేదిక సమర్పించినట్లు కమిటీ ఛైర్మన్ దిగ్విజయ్ సింగ్ బుధవారం 'ఎక్స్'లో వెల్లడించారు. 'ఈ ఏడాది చివరినాటికి అంగన్వాడీలలో ఖాళీగా ఉన్న దాదాపు 2.13 లక్షల పోస్టులను భర్తీ చేయాలి' అని కమిటీ సూచించినట్లు దిగ్విజయ్ వెల్లడించారు. గర్భిణీలకు అందించే మొత్తాన్ని రూ.5 వేలు నుంచి కనీసం రూ.6 వేలకు పెంచాలని సూచించినట్లు వెల్లడించారు.

ఎస్సీ, ఓబీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పెంచండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: షెడ్యూలు కులాలు, ఓబీసీ, ఈబీసీ కులాలకు చెందిన విద్యార్థులకు మంజూరు చేసే ఉపకార వేతనాన్ని పెంచాలని పార్లమెంటరీ స్థాయి సంఘం ఒకటి కేంద్రానికి సూచించింది. ఉపకార వేతన పథకాలనూ సమీక్షించాలని కోరింది. సామాజిక న్యాయం, సాధికారతపై పార్లమెంటరీ స్థాయి సంఘం ఈమేరకు కేంద్రానికి సూచనలు చేసింది. ఉపకార వేతనాల మంజూరులో ఆలస్యాన్ని నివారించాలని తెలిపింది. లోక్‌సభ ముందుంచిన ఆ నివేదికలో.. ఏటా ప్రతి విద్యార్థికి ఇస్తున్న ఉపకార వేతనం వారి చదువులకయ్యే ఖర్చులకు సరిపోదని పేర్కొంది. ప్రతి పథకంలో మంజూరు చేసే ఉపకార వేతనాలను కాలానుగుణంగా సమీక్షించాలని కోరింది. అప్పుడే అవి విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొంది.

అరెస్టుల్లో పోలీసులు హద్దులు దాటొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: అరెస్టుల విషయంలో పోలీసులు హద్దులు దాటొద్దని సుప్రీంకోర్టు మరోమారు హెచ్చరించింది. రాజ్యాంగం కల్పించిన హక్కులు నిందితులకు ఉంటాయని, అరెస్టు విషయంలోనూ గౌరవమర్యాదలను పాటించాలని హితవు పలికింది. హరియాణాలో.. వరకట్న వేధింపుల కేసులో అరెస్టయిన ఓ బాధితుడి పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. హరియాణా పోలీసులు తనను అరెస్టు చేసే సమయంలో.. పోలీస్‌స్టేషన్‌లో తనపై దాడి చేశారని బాధితుడు పేర్కొన్నారు. "అరెస్టు సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలను ఈ కోర్టు ఎన్నో సందర్భాల్లో జారీ చేసింది. దాన్ని కింది స్థాయి అధికారులకు వివరించాల్సిన బాధ్యత డీజీపీదే" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్నేశ్‌కుమార్, తదితర కేసుల తీర్పులను తాజాగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలకు పంపింది.

అమెరికా ఉత్పత్తులపై ఇజ్రాయెల్ సుంకం రద్దు

జెరూసలేం, ఏప్రిల్ 2: ప్రతీకార సుంకాల విధింపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారిక ప్రకటన చేయనున్న వేళ ఇజ్రాయెల్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా నుంచి తమ దేశానికి అయ్యే అన్ని దిగుమతులపై వసూలు చేసే సుంకాలను పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని, ఆర్థిక శాఖ కార్యాలయాలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. ఈ నిర్ణయం ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, ఇజ్రాయెల్ పౌరుల ఖర్చులను తగ్గిస్తుందని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి. నిజానికి, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తుల్లో 99% వాటిపై ఇజ్రాయెల్ ఇప్పటికే ఎలాంటి సుంకాలు వసూలు చేయడం లేదు. కేవలం వ్యవసాయ ఉత్పత్తులపై మాత్రమే సుంకాలు విధిస్తోంది.

నిత్యానంద క్షేమం..'కైలాస' వెబ్‌సైట్ వెల్లడి

చెన్నై, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు స్వామి నిత్యానంద జీవించే ఉన్నారని ఆయన అధికారిక వెబ్‌సైట్ 'కైలాస' ప్రకటించింది. మార్చి 30వ తేదీన ఆయన ఉగాది వేడుకలు కూడా జరుపుకొన్నట్టు పేర్కొంది. నిత్యానంద సజీవ సమాధి అయ్యారంటూ ఆయన మేనల్లుడు సుందరేశ్వరన్ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రకటనను కైలాస వెబ్‌సైట్ తీవ్రంగా ఖండించింది. నిత్యానందను అపఖ్యాతి పాల్జేసేందుకు, దురుద్దేశపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న నిత్యానంద 2020లో దేశం నుంచి పారిపోయి పసిఫిక్ దీవుల్లో 'కైలాస' పేరుతో ఓ దీవిని దేశంగా ప్రకటించుకున్న విషయం తెలిసిందే.

గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో 57 మంది మృతి

జెరుసలెమ్, ఏప్రిల్2: గాజాలో ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో 57 మంది మృతి చెందారు. జబాలియా శరణార్థి శిబిరంలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్లినిక్‌పై ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడుల్లో పలువురు చిన్నారులు సహా 22 మందికిపైగా చనిపోయారు. ఖాన్ యూనిస్‌లోని ఓ భవనంపై జరిపిన దాడుల్లో 30 మందికి పైగా మృతి చెందారు. గాజాలో ఇప్పటికే బఫర్ జోన్ కింద కొంత భూభాగాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్న ఇజ్రాయెల్ మరింత భూభాగం కోసం యత్నిస్తోంది. ఇప్పటికే రఫాను ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం స్థానికులకు ఆదేశాలు జారీ చేసింది. బెయిట్ హనూన్, లహియా ప్రాంతాలను కూడా వదిలి వెళ్లాలని స్థానికులకు సూచించింది. హమాస్‌ను బహిష్కరించి వారి వద్ద ఉన్న బందీలను విడిచిపెట్టడమే.. దాడులు ఆపేందుకు ఏకైక మార్గమని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ గాజా వాసులకు స్పష్టం చేశారు.

పశ్చిమ తీరంలో 2,500 కిలోల డ్రగ్స్ జప్తు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: దేశంలో మరోసారి భారీ డ్రగ్స్ ముఠా గుట్టురట్టైంది. ఇండియన్ నేవీ స్పెషల్ ఆపరేషన్‌లో భాగంగా 2,500 కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. భారత నావికాదళానికి చెందిన ఫ్రంట్‌లైన్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తర్కాష్ నౌక ఈ ఆపరేషన్‌లో కీలకపాత్ర పోషించింది. గత నెల 31న భారత పశ్చిమ హిందూ మహాసముద్రంలో అనుమానాస్పద కదలికలపై భారత నౌకాదళానికి సమాచారం అందిందని నేవీ అధికారులు వెల్లడించారు. పీ8ఐ అనే సముద్ర నిఘా విమానాన్ని రంగంలోకి దించి, ముంబైలోని మారిటైమ్ ఆపరేషన్ సెంటర్ సమన్వయంతో ఐఎన్ఎస్ తర్కాష్ ఓ అనుమానాస్పద నౌకను అడ్డుకున్నట్లు తెలిపారు. నౌకాదళ ప్రత్యేక బృందంతో కలిసి సముద్ర కమాండోలు అనుమానిత నౌకలో తనిఖీ చేయగా మాదకద్రవ్యాల ప్యాకెట్లను గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. వీరి తనిఖీల్లో మొత్తం 2,500 కిలోలకు పైగా మత్తు పదార్థాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇందులో 2,386 కిలోల హషిష్, 121 కిలోల హెరాయిన్ ఉందన్నారు. ఈ నేపథ్యంలో అనుమానిత నౌకను ఐఎన్ఎస్ తర్కాష్ నియంత్రణలోకి తీసుకున్నట్లు, డ్రగ్స్ అక్రమ రవాణా గురించిన సమాచారాన్ని షిప్ సిబ్బందిని ప్రశ్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం!

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు గుప్పించారు. బిల్లుపై అర్ధరాత్రి వరకూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. అనంతరం మూజువాణీ ఓటుతో 'ఉమీద్'ను ఆమోదించేందుకు స్పీకర్ ప్రయత్నించారు. అందుకు విపక్షాలు అభ్యంతరం తెలపడంతో ఓటింగ్ జరిపారు. అనుకూలంగా 226, వ్యతిరేకంగా 163 ఓట్లు వచ్చాయి. విపక్ష సభ్యులు తాము ప్రతిపాదించిన ప్రతి సవరణపైనా ఓటింగ్ జరగాలని పట్టుబట్టారు. అన్ని సవరణలపై ఓటింగ్ జరపడంతో ఆమోదం లభించేసరికి అర్ధరాత్రి దాటింది. బిల్లుపై చర్చ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. ఈ బిల్లు మతానికి సంబంధించినది కాదని, కేవలం ఆస్తుల విషయాలకు సంబంధించినదేనని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లులోని అత్యంత క్రూరమైన సెక్షన్ 40 రద్దు కానుందన్నారు. ఈ సెక్షన్ కారణంగా ఏ భూమినైనా తమదేనని ప్రకటించుకునే హక్కు వక్ఫ్ బోర్డు, ట్రిబ్యునల్‌కు ఉందని.. దీన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇంతటి దారుణమైన సెక్షన్‌ను తాము తొలగించామని చెప్పారు. కొందరు ప్రతిపక్ష నేతలు చెబుతున్నట్లుగా ముస్లిం వర్గాలకు చెందిన ఏ భూమినీ తాము లాగేసుకోబోమని స్పష్టం చేశారు. "పేద ముస్లింల కోసం వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి అధికారి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం" అని రిజిజు స్పష్టం చేశారు. "బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. తాజా బిల్లును పరిశీలించిన జేపీసీకి అభినందనలు. ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు" అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ అన్నారు. దానికి స్పందనగానే రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీని ఉపయోగించుకునేందుకు ఈ బిల్లు తోడ్పడుతుందని, వక్ఫ్ ఆస్తులన్నీ డిజిటల్ పోర్టల్‌లో ఉంటాయని, ఎవరూ ఆక్రమించేందుకు ఆస్కారం ఉండదని రిజిజు చెప్పారు. బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.



వక్ఫ్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా యూపీలోని మీరట్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల కవాతు

దౌర్జన్యపూరితం: కాంగ్రెస్

వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బిల్లును వ్యతిరేకించారు. కేంద్రం దౌర్జన్యపూరితంగా బిల్లును తెస్తోందని ఆరోపించారు. సభలో ప్రవేశపెట్టే బిల్లుకు సవరణలు ప్రతిపాదించే హక్కు సభ్యులకు ఉంటుందన్నారు. సవరణలకు కనీస సమయం ఇవ్వకుండా హడావుడిగా ప్రవేశపెట్టారని ఆక్షేపించారు. మోదీ సర్కారు ఆరెస్సెస్ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. బిల్లు కేవలం పాలనాపరమైన మార్పులకు సంబంధించినది కాదని.. మైనారిటీ వర్గాలను అవమానించడం, భారత సమాజాన్ని విభజించడమేనని చెప్పారు. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిప్పికొట్టారు. "జేపీసీ వేయాలన్నదే మీరు. కమిటీ సూచించిన మార్పులుచేర్పులను అంగీకరించకపోతే జేపీసీని ఎందుకు ఏర్పాటు చేయమన్నారు" అని ప్రశ్నించారు. వక్ఫ్ భూముల విషయంలో అవినీతిని అడ్డుకొని, పేద ముస్లింల భూమిని కాపాడడమే ఈ బిల్లు ఉద్దేశమని తెలిపారు. వక్ఫ్ అంటే అరబిక్‌లో అల్లా పేరుతో దానం అని అర్థమని, అది దాతృత్వ కార్యక్రమని చెప్పారు. మీది కాని భూమిని దానం చేయడాన్ని దాతృత్వమని అనరని గుర్తుచేశారు.

అమిత్ షా, అఖిలేశ్ వ్యంగ్యాస్త్రాలు

వక్ఫ్ సవరణ బిల్లుపై లోక్‌సభలో చర్చ సందర్భంగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడారు. "ప్రపంచంలో అతిపెద్ద పార్టీ తన అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతోంది" అని బీజేపీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. "అఖిలేశ్ నవ్వుతూ ఓ విషయం చెప్పారు. నేను కూడా అలాగే సమాధానం ఇస్తా. కొన్ని పార్టీల నాయకత్వం ఐదుగురి చేతుల్లోనే ఉంటుంది. వారి నుంచే అధ్యక్షుడిని నియమించుకుంటారు. కానీ, మేం 12-13 కోట్ల మంది పార్టీ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలి. అందుకు సమయం పడుతుంది. మీకు అలాంటిదేం అక్కర్లేదు. ఎందుకంటే మరో 25 ఏళ్లు మీరే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారు" అని షా బదులిచ్చారు.

దేశంలో వక్ఫ్ బోర్డు నిర్వహణలోని మొత్తం స్థిరాస్తులు: 8,72,324

వాటిలో ముఖ్యమైన ఆస్తుల వివరాలు

1) శ్మశానాలు	1,50,569
2) దుకాణాలు	1,13,193
3) వ్యవసాయ భూములు	1,40,803
4) మసీదులు	1,19,280
5) ఇళ్లు	92,517
6) ప్లాట్లు	64,975
7) దర్గాలు	33,502

ముస్లింలపై యుద్ధం ప్రారంభించిన మోదీ సర్కారు: ఒవైసీ

వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును ముస్లింలపై దాడిగా అభివర్ణించారు. మోదీ ప్రభుత్వం మసీదులు, దర్గాలు, మదర్సాలు, ముస్లింల స్వేచ్ఛపై యుద్ధాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని విమర్శించారు. వక్ఫ్ బిల్లు రాజ్యాంగంలోని 14వ అధికరణాన్ని ఉల్లంఘిస్తోందన్నారు. ఆక్రమణదారులే యజమానులు అయిపోతారని, ముస్లిమేతరులు వక్ఫ్‌బోర్డు పాలనలో భాగస్వాములవుతారని ఆరోపించారు. ఆలయాలు, మసీదుల పేరిట బీజేపీ దేశంలో వివాదాలు సృష్టించాలని చూస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన బిల్లు ప్రతులను చించివేశారు.

లోకం తీరు



కోర్టులో సవాలు చేస్తాం

» ముస్లిం పర్సనల్ లా బోర్డు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: వక్ఫ్ సవరణ బిల్లును కోర్టులో సవాలు చేస్తామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు(ఏఐఎంపీఎల్‌బీ) ప్రకటించింది. ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో ఏఐఎంపీఎల్‌బీ విలేకరుల సమావేశం నిర్వహించింది. ఏఐఎంపీఎల్‌బీ సభ్యుడు ఎండీ అబీద్ మాట్లాడుతూ ఆ 'నల్ల చట్టానికి' వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలు కూడా నిర్వహిస్తామన్నారు. ఈ బిల్లును ముస్లింల ఆస్తులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంగా అభివర్ణించారు. 'ఈ పోరాటంలో మనం ఓడిపోయామని భావించొద్దు. మనం ఇప్పుడే ప్రారంభించాం. ఇది దేశాన్ని కాపాడేందుకు చేస్తున్న పోరాటం. ఎందుకంటే భారత దేశ మౌలిక స్వభావానికే ముప్పుగా ప్రతిపాదిత చట్టం ఉంది' అన్నారు. మనస్సాక్షిగల పౌరులందరూ ఈ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. బిల్లును ఉపసంహరించుకునే వరకూ విశ్రమించేది లేదని తేల్చిచెప్పారు. రైతులు చేసినట్టే తామూ దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని, అవసరమైతే రోడ్లను దిగ్బంధిస్తామని ఏఐఎంపీఎల్‌బీ ఉపాధ్యక్షుడు అలీ మొహిసిన్ చెప్పారు.

ఉపసంహరించుకోండి: స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ (సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. "మైనారిటీల హక్కుల పరిరక్షణలో తమిళనాడు ముందంజలో ఉంది. ప్రతి పౌరుడికీ తమ మతాన్ని అనుసరించే హక్కును భారత రాజ్యాంగం ప్రసాదించింది. ఈ హక్కును కాపాడడం, పరిరక్షించడం ప్రజలచే ఎన్నికైన ప్రభుత్వాల విధి. అయితే, ప్రస్తుత వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించేలా ఉంది" అన్నారు. డీలిమిటేషన్ చుట్టూ అలముకున్న ఆందోళనలపై మెమొరాండం సమర్పించేందుకు, వివిధ పార్టీలకు చెందిన ఎంపీలతో సహా తాను కూడా వచ్చి చర్చించేందుకు అనువుగా అవకాశం ఇవ్వాలని స్టాలిన్ ప్రధానికి విజ్ఞప్తి చేశారు.



సింధు, మౌల్య, జ్యోతి (ఫైల్)

అత్త, మరదలు, కూతురును కాల్చి చంపి వ్యక్తి ఆత్మహత్య

» వదిలేసి వెళ్లిన భార్య గురించి ప్రశ్నిస్తుండడంతో మనస్తాపం

» కర్ణాటక రాష్ట్రం చిక్కమగళూరులో దారుణం



రత్నాకర్ (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భార్య వదిలేసి వెళ్లిన విషయాన్ని గ్రామస్థులు తరచూ ప్రస్తావించడం, పాఠశాలలో కూతురిని 'మీ అమ్మ ఏమైంది..?' అని తోటివిద్యార్థులు ప్రశ్నిస్తుండడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఓ వ్యక్తి కూతురు, అత్త, మరదలుని తుపాకీతో కాల్చి చంపేశాడు. ఆ తరువాత అదే తుపాకీతో తానూ కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో మరదలి భర్త బుల్లెట్ గాయాలతో బతికి బయటపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం చిక్కమగళూరు జిల్లాలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. రత్నాకర్(40) అనే వ్యక్తి కడబగెరెలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా రెండేళ్ల క్రితం ఆయనను భార్య వదిలి వెళ్లిపోయింది. రత్నాకర్, అతని కూతురు మౌల్యతో పాటు అతని అత్త జ్యోతి కూడా ఉంటున్నారు. కాగా, భార్య వెళ్లిపోయిన విషయం గురించి ఇటీవల గ్రామస్థులు తరచూ రత్నాకర్ వద్ద ప్రస్తావించారు. రత్నాకర్ తట్టుకోలేకపోయాడు. తనను మోసగించారని అత్త, మరదలు, ఆమె భర్తతో మంగళవారం రాత్రి గొడవపడ్డాడు. నాటు తుపాకీతో అత్త జ్యోతి(50), కూతురు మౌల్య(6), మరదలు సింధు(24)ను కాల్చి చంపాడు. తర్వాత అదే తుపాకీతో రత్నాకర్ కాల్చేసుకున్నాడు.

రన్యారావ్‌కు విడాకులు ఇస్తా

» మీడియాతో ఆమె భర్త జతిన్

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పరప్పన అగ్రహార జైలులో గడుపుతున్న నటి రన్యారావ్‌కు విడాకులు ఇవ్వాలని ఆమె భర్త జతిన్ హుక్కేరి నిర్ణయించుకున్నారు. ఆమెకు విడాకుల నోటీసు పంపుతున్నానని బెంగళూరులో బుధవారం మీడియాకు తెలిపారు. 2024 అక్టోబరు 6న ఓ బ్రోకర్ ద్వారా రన్యారావ్‌ను కలిశానని, అక్టోబరు 23న నిశ్చితార్థం జరిగిందని, నవంబరు 27న నగరంలోని ఓ హోటల్‌లో పెళ్లి చేసుకున్నామని ఆయన వివరించారు. పెళ్లి జరిగిన నెలరోజులకే మనస్పర్థలు వచ్చాయని, తరచూ ఆమె దుబాయ్‌కు వెళ్లి వచ్చేవారని తెలిపారు. పెళ్లి జరిగినప్పటి నుంచి ఏదో ఒక కారణంతో తనను దూరం పెడుతున్నట్టు పేర్కొన్నారు. అందుకే రన్యారావ్‌కు విడాకులిస్తానన్నారు.

శాంతికి మేం సిద్ధం!

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేస్తే తక్షణం కాల్పుల విరమణ ప్రకటిస్తాం

» ప్రభుత్వాలకు మావోయిస్టు పార్టీ ప్రతిపాదన


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
కేంద్ర కమిటీ
తేది: 28.3.2025.

శాంతి చర్చలపై మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో కొనసాగిస్తున్న నరమేధాన్ని నిలిపివేస్తే.. శాంతిచర్చలకు, కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిశా, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేస్తున్న హత్యాకాండలను నిలిపివేయాలని, బస్తర్‌లోని సాయుధ బలగాలను బ్యారక్‌లకే పరిమితం చేయాలని, కొత్త క్యాంపుల ఏర్పాటును ఆపాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట గత నెల 28వ తేదీన విడుదల చేసిన బహిరంగ ప్రకటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మార్చి 24వ తేదీన హైదరాబాద్‌లో 'కేంద్ర ప్రభుత్వం- మావోయిస్టు పార్టీ బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతిచర్చలు జరపాలి' అన్న అంశంపై 'శాంతిచర్చల కమిటీ' నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని స్వాగతిస్తున్నామని అభయ్ పేర్కొన్నారు. శాంతి చర్చలకు తాము తొలి నుంచీ సిద్ధంగా ఉన్నామన్నారు. 'గత ఏడాది జనవరిలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం, విప్లవోద్యమం ఉనికిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆపరేషన్ కగార్ పేరిట ప్రజలపై ప్రతీఘాతక యుద్ధాన్ని ప్రారంభించాయి. ప్రజలను మోసగించడానికి ఛత్తీస్‌గడ్ హోంమంత్రి విజయ్‌శర్మ.. మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని ప్రకటించారు. దీనిపై మా పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి వికల్ప్ స్పందిస్తూ.. చర్చలకు తాము కూడా సిద్ధమని రెండుసార్లు తెలిపారు. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. పైగా, గత 15 నెలలుగా కగార్ పేరిట ఆదివాసీలపై, ప్రజలపై యుద్ధం చేస్తున్నాయి' అని అభయ్ వివరించారు. ఛత్తీస్‌గడ్‌లో జరుపుతున్న నరమేధం కారణంగా.. ఇప్పటివరకూ మావోయిస్టు పార్టీకి చెందిన 400 మందికి పైగా వివిధ స్థాయిల నాయకులు, కార్యకర్తలు, సభ్యులు హత్యకు గురయ్యాయరని తెలిపారు. వీరిలో మూడొంతుల మంది ఆదివాసీలేనన్నారు. తమ పార్టీకి చెందిన వేలాదిమందిని అరెస్టు చేశాన్నారు.

పథకం ప్రకారమే నరమేధం

'కార్డన్ అండ్ కిల్' (చుట్టుముట్టడం, చంపివేయటం) అనే పద్ధతి ప్రకారం మారణహోమం జరుపుతున్నారని, పట్టుబడిన వారిని అత్యంత అమానుష పద్ధతుల్లో చిత్రహింసలు పెట్టి చంపుతున్నారని, మహిళా కామ్రేడ్స్‌పై సామూహిక అత్యాచారాలు జరిపి హత్య చేస్తున్నారని అభయ్ పేర్కొన్నారు. అందుకే ఈ యుద్ధాన్ని తాము నరమేధంగా చెబుతున్నామన్నారు. ఈ యుద్ధంలో భద్రతా బలగాలు పాల్గొంటున్నాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వాస్తవానికి భారతసైన్యాన్ని మోహరించారని తెలిపారు. ఆ పోరాటాన్ని అణచివేసి.. భూమిని, ప్రకృతి వనరులను కార్పొరేట్ కంపెనీల అధిపతులకు కట్టబెట్టటం కోసం ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ జరుపుతున్నాయని పేర్కొన్నారు.

నియంతృత్వమే 'హిందూరాష్ట్ర' లక్ష్యం

సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల, భూస్వాముల దోపిడీని సుస్థిరం చేయటమే 'హిందూరాష్ట్రం' లక్ష్యమన్నారు. భూముల్ని, వనరుల్ని, ప్రభుత్వరంగ సంస్థల్ని కార్పొరేట్లకు అప్పగించటం, మతమైనారిటీలపై వివక్షను రాజ్యాంగబద్ధం చేయటం, సమాఖ్య వ్యవస్థను నిర్మూలించి నియంతృత్వ ప్రభుత్వాన్ని నెలకొల్పటం కోసమే ఆపరేషన్ కగార్ జరుపుతున్నారని అభయ్ ఆరోపించారు. శాంతిచర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని శాంతిచర్చల కమిటీకి, ప్రజామేధావులకు, హక్కుల సంఘాలకు అభయ్ విజ్ఞప్తి చేశారు.

తుపాకులు వీడాలన్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం

చింతూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేస్తూ మావోయిస్టులు రాసిన లేఖపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం స్పందించింది. మావోయిస్టులు తుపాకులను వీడాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ ఓ ప్రకటన చేశారు. ఇప్పటికే లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం, ఉపాధి, ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తుపాకులు వీడితేనే చర్చలకు అర్థముంటుందని అభిప్రాయపడ్డారు. అంతేకానీ, సమాంతర పాలన చేయాలనుకుంటే చర్చలకు ఫలితం ఉండదన్నారు. ఇందుకు మావోయిస్టులు సిద్ధంగా ఉంటే.. ఓ కమిటీని ఏర్పాటు చేసుకుని, వివరాలను అందజేయాలని సూచించారు.

దేశాలు, రంగాలవారీగా సుంకాలు!

» ప్రతీకార సుంకాలపై వైట్‌హౌస్ వర్గాల వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: తమదేశంపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాలన్నింటిపైనా ఏప్రిల్ 2న ప్రతీకార సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నెలరోజులుగా హెచ్చరిస్తూ వస్తున్న నేపథ్యంలో.. ప్రపంచదేశాలన్నీ బుధవారం ఆయన చేసే ప్రకటన కోసం మునివేళ్లపై ఎదురుచూశాయి! మొత్తం అన్ని దేశాల దిగుమతులపైనా గంపగుత్తగా 20% సుంకం విధించే అవకాశం ఉందని కొన్ని కథనాలు రాగా.. తాము విధించబోయే సుంకాలు దేశాలు, రంగాలవారీగా ఉంటాయని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించినట్లు అమెరికన్ వార్తా సంస్థ 'స్కై న్యూస్' ఒక కథనంలో వెల్లడించింది. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో) వైట్‌హౌస్‌లోని రోజ్‌గార్డెన్‌లో నిర్వహించే ఒక కార్యక్రమంలో.. ట్రంప్ ప్రతీకార సుంకాలపై ప్రకటన చేస్తారని, ఆ క్షణం నుంచే అవి అమల్లోకి వస్తాయని ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతీకార సుంకాల ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో.. వాటిపై పర్యవేక్షణకు, ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుని, ప్రభావాన్ని అంచనా వేసేందుకు భారతదేశం ఒక కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఇతరదేశాలపై ఈ సుంకాల ప్రభావం.. వాటివల్ల భారత్‌కు ఏవైనా ప్రయోజనాలు కలిగే అవకాశం ఉందా అనే అంశాలను కూడా అధికారులు అక్కడి నుంచి అంచనా వేయనున్నారు.

కలకత్తా హైకోర్టు చెత్తకుప్ప కాదు

జస్టిస్ దినేశ్ శర్మ బదిలీపై లాయర్ల నిరసన

కోల్‌కతా, ఏప్రిల్ 2: తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని, రిటైర్మెంట్‌కు దగ్గర పడిన న్యాయమూర్తులను పంపించడానికి కోల్‌కతా హైకోర్టు చెత్తకుప్ప ఏమీ కాదని హైకోర్టుకు చెందిన మూడు న్యాయవాద సంఘాలు తీవ్ర వ్యాఖ్యలు చేశాయి. ఢిల్లీ హైకోర్టుకు చెందిన జస్టిస్ దినేశ్ కుమార్ శర్మను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయడంపై తీవ్ర వ్యతిరేకత ప్రకటించాయి. ఆయన ప్రమాణ స్వీకారోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు హైకోర్టు సీజే జస్టిస్ టీఎస్ శివజ్ఞానంకు లేఖ రాశాయి. జస్టిస్ వర్మకు న్యాయపరమైన విధులు అప్పగించవద్దని, ఆయనకు కేసులు కేటాయిస్తే కోర్టుకు హాజరు కాబోమని లాయర్లు హెచ్చరించారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుకు నిరసనగా హైకోర్టు న్యాయవాదులు మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 వరకూ కోర్టు విధులను బహిష్కరించారు. కొలీజియం మార్చి 27న చేసిన సిఫారసును పునఃసమీక్షించి, వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



సర్వాయి పాపన్నకు సీఎం రేవంత్ నివాళి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నిరంకుశ రాచరికాన్ని వ్యతిరేకించిన బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. బుధవారం సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని సీఎం నివాసంలో పాపన్న చిత్రపటానికి రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వందల ఏళ్ల క్రితమే రాజకీయ, సామాజిక సమానత్వానికి సబ్బండ వర్గాలను ఏకం చేసి పోరాడిన యోధుడు పాపన్న అని తెలిపారు. ఎంపీలు మల్లు రవి, కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, రఘురాం రెడ్డి, వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్ కూడా సర్వాయి పాపన్నకు నివాళులర్పించారు.

రైతులకు మేలు చేస్తే ఓర్వలేకున్నరు

- కల్వకుంట్ల కుటుంబంపై మంత్రి తుమ్మల ధ్వజం
- రాష్ట్రంలో సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగింది
- పంట ఉత్పత్తులను మద్దతుధరతో కొంటున్నాం
- పామాయిల్‌కు ఏడాదిలో 8500 పెరిగిన ధర
- సన్నాలకు బోనస్‌తో రైతులకు మేలని వ్యాఖ్య

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగిందని, కనీస మద్దతు ధరకు పంట ఉత్పత్తుల కొనుగోలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సన్నాల సాగు వద్దని, వరి వేస్తే ఉరి వేసుకున్నట్లని ప్రకటించిన రోజులు పోయి.. సన్నాలకు బోనస్ ఇచ్చి, పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోనస్ అమలుతో రాష్ట్రంలో సన్నాల సాగు 60శాతానికి పెరిగిందని, రైతులకు మేలు జరిగిందని తెలిపారు. పీడీఎస్‌లో సన్నాలు పంపిణీ చేసి దేశానికే తలమానికంగా రాష్ట్రాన్ని నిలబెట్టినట్లు తెలిపారు. రైతులకు ఏడాదిలో తమ ప్రభుత్వం రూ.34,667కోట్లు చెల్లిచండం చూసి.. కల్వకుంట్ల కుటుంబం ఓర్వలేకపోతున్నదని ధ్వజమెత్తారు. గతంలో రూ.లక్ష రుణమాఫీ చేయలేని వారు.. ఇప్పుడు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన తమను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుబంధు పేరుతో రూ.5వేలు ఇచ్చి, వివిధ సబ్సిడీ పథకాల కింద రైతులకు దక్కాల్సిన



రూ.15 వేలకు ఎగనామం పెట్టారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఆ పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. రైతుభరోసాను రూ.12 వేలకు పెంచి... రెండు నెలల్లోనే రూ. 5057.77 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొన్నారు. గతంలో పామాయిల్ సాగును పట్టించుకోలేదని, ఇష్టారీతిన కంపెనీలకు అనుమతులిచ్చి సాగును తగ్గించేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏడాదిలో గెలల ధర రూ.8,500పైగా పెరిగిందని తెలిపారు. రైతుబీమా పథకంలో చేరిన రైతులకు ప్రీమియం కూడా ప్రభుత్వమే భరిస్తున్నదని వివరించారు. బీఆర్ఎస్ నేతలు విమర్శించినంత మాత్రాన రైతులు నిజాలు తెలుసుకోకుండా ఉండరన్నారు. ఇప్పటికైనా కల్లబొల్లి కబుర్లు చెప్పడం మానేయాలని హితవు పలికారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



వంగ మధు(ఫైల్)

ఇల్లందకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన వంగ మధు(28) అనే కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుకు చిన్న వయస్సులోనే తల్లి చనిపోగా, తండ్రి ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఇతడు గ్రామంలో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాడు. ఈ క్రమంలో మొక్కజొన్న దిగుబడి లాభసాటిగా రాకపోగా, సుమారు రూ. 1.50 లక్షల వరకు నష్టం వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన మధు ఆదివారం ఇల్లందకుంట శివారులోని ఎర్ర గుట్టల సమీపంలో పురుగుల మందు తాగాడు. వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు.

పడుతూ..లేస్తూ..

వరుస ప్రమాదాలకు గురైన పాస్టర్ ప్రవీణ్ కుమార్





చిల్లకల్లు టోల్‌గేట్ సమీపంలో బుల్లెట్‌పై నుంచి పడిపోయిన ప్రవీణ్.. పైకి లేపుతున్న వాహనదారులు

- ఇప్పటికే కీసర టోల్‌గేట్, రామవరప్పాడు రింగ్ వద్ద ఘటనల గుర్తింపు
- చిల్లకల్లు టోల్‌గేట్‌కు ముందే మరో ప్రమాదం.. వెలుగులోకి మరో సీసీ ఫుటేజ్
- లారీ ట్యాంకర్‌ను ఓవర్‌టేక్ చేస్తూ అదుపుతప్పి పడిపోయిన ప్రవీణ్

విజయవాడ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ పడుతూ లేస్తూ వరుస ప్రమాదాలకు గురైనట్టు సీసీటీవీ కెమెరాల ఫుటేజీలు తెలియజేస్తున్నాయి. ఇప్పటికే కీసర టోల్‌గేట్, విజయవాడలోని రామవరప్పాడు రింగ్ వద్ద ఆయన బుల్లెట్‌పై ప్రయాణిస్తూ అదుపు తప్పి పడిపోయిన ఘటనలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ రెండు ఘటనలకు ముందు చిల్లకల్లు టోల్‌గేట్ సమీపంలోనూ ఆయన బుల్లెట్ నడుపుతూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయిన మరో సీసీటీవీ కెమెరా ఫుటేజీ తాజాగా వెలుగులోకి వచ్చింది. మార్చి 24న ఆయన హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై బయలుదేరారు. తెలంగాణ సరిహద్దు దాటాక ఎన్టీఆర్‌జిల్లాలో కీసర టోల్‌గేట్ వద్ద బుల్లెట్ అదుపుతప్పి పడిపోయింది. అక్కడ ఆయనకు ప్రాథమిక వైద్యం చేసిన అంబులెన్స్ సిబ్బంది ఈ ప్రమాదానికి ముందు మరో ప్రమాదానికి ఆయన గురైనట్టు తెలిపారు. ఆ మేరకు చిల్లకల్లు టోల్‌గేట్ దాటడానికి ముందే జరిగిన ప్రమాదానికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీ తాజాగా విడుదలైంది. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు తెలంగాణ సరిహద్దు దాటాక చిలకల్లు టోల్‌గేటులోకి ప్రవేశిస్తాయి. చిల్లకల్లు టోల్‌గేట్‌కు చేరుకోవడానికి ముందే జగ్గయ్యపేటలోని ఇండస్ట్రియల్ కారిడార్ వద్ద ఉన్న వై జంక్షన్‌లో ప్రవీణ్ ప్రమాదానికి గురైనట్టు పోలీసులు గుర్తించారు. ముందు వెళ్తున్న లారీ ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేయబోయి ప్రవీణ్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఆ వెనుకే వస్తున్న బస్సును డ్రైవర్ వెంటనే పక్కకు తిప్పడంతో ప్రవీణ్‌కు పెనుప్రమాదం తప్పింది. అయితే, ప్రవీణ్ లేవలేక కాసేపు అలాగే కూర్చుండిపోయారు. వాహనదారులు సాయం చేసేందుకు రాగా, ప్రవీణ్ మెల్లగా లేచి నిల్చున్నారు. ముగ్గురు వ్యక్తులు బుల్లెట్‌ను లేపి రోడ్డు పక్కన స్టాండ్ వేసి నిలిపారు. అనంతరం తూలుతూనే బుల్లెట్ ఎక్కిన ప్రవీణ్ దానిని స్టార్ట్ చేయడానికి కొద్దిసేపు నానా తంటాలు పడిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి. ఇక్కడే కుడి చేయిపై గాయమైనట్టు తెలుస్తోంది. ఇది జరిగిన తర్వాత ఆయన కీసర టోల్‌గేట్ సమీపంలో మరోసారి అదుపుతప్పి పడిపోయారని, విజయవాడ రామవరప్పాడు రింగ్ సమీపంలోనూ ఇంకోసారి అదుపుతప్పి పడిపోయారని అక్కడి సీసీ కెమెరాల ఫుటేజీల్లో వెల్లడైంది.

ప్రభుత్వ దర్యాప్తుపై నమ్మకముంది

పాస్టర్ ప్రవీణ్ భార్య జెస్సికా, సోదరుడు కిరణ్

అమరావతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణాన్ని రాజకీయ, మతపరమైన ప్రయోజనాలకు వాడుకోవడం ఆపి వేయాలని ఆయన సతీమణి జెస్సికా పగడాల, సోదరుడు కిరణ్ కోరారు. ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం జరుపుతున్న దర్యాప్తు పట్ల తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. బుధవారం వారు వేర్వేరుగా దీనిపై వీడియో ప్రకటన విడుదల చేశారు. "ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సత్వరం స్పందించి పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. దీనికి మేం ధన్యవాదాలు చెబుతున్నాం. అయితే... అత్యుత్సాహంతో సొంత దర్యాప్తు చేస్తున్న వారందరికీ నా విన్నపం! మీ సొంత దర్యాప్తును ఆపండి. ఇది... ప్రవీణ్ ప్రతిష్ఠను దెబ్బతీస్తోంది. కొందరు యూట్యూబర్లు, బ్లాగర్లు ప్రవీణ్ మరణంపై తప్పుడు ప్రచారం వ్యాప్తి చేస్తున్నారు. మరికొందరేమో మతపరంగా, రాజకీయంగా వాడుకుంటున్నారు. మేం ప్రభుత్వ దర్యాప్తును పూర్తిగా విశ్వసిస్తున్నాం. దయచేసి ఎవరూ మత సామరస్యాన్ని చెరిపివేయవద్దు." అని కిరణ్ పేర్కొన్నారు. ప్రవీణ్ సతీమణి జెస్సికా మాట్లాడుతూ.. "ప్రవీణ్ మంచి భర్త, మంచి తండ్రి! ఆయన భౌతికంగా లేరని తెలిశాక... మేం అనుభవిస్తున్న బాధను అందరూ అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం వేగంగా స్పందించి, పూర్తిస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. ప్రభుత్వ దర్యాప్తుపై మాకు నమ్మకముంది. దయచేసి ఎవరూ మత సామరస్యాన్ని దెబ్బతీయవద్దు. నా భర్త మత సామరస్యాన్నే కోరుకున్నారు. దానిని దెబ్బతీయాలనే ఉద్దేశం ఆయనకు ఎన్నడూ లేదు" అని అన్నారు.



ఐఓసీఎల్‌తో ఒప్పందం చేసుకుంటున్న ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

ఆర్టీసీ తార్నాక ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కేర్ యూనిట్ విస్తరణ

- పడకల సంఖ్య 12కు పెంపు.. ఐఓసీఎల్ సాయం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ కేర్ యూనిట్‌ను విస్తరించాలని యాజమాన్యం నిర్ణయించింది. ప్రస్తుతం ఈ యూనిట్‌లో 4 పడకలుండగా వాటికి అదనంగా 8 పడకల్ని సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ యూనిట్ విస్తరణకు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద నిధులు కేటాయించాలని ఆర్టీసీ ప్రతిపాదనలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) అంగీకరించింది. కోటి రూపాయలు సాయం చేసేందుకు ముందుకొచ్చింది. నిర్మాన్ డాట్ ఓఆర్‌జీ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ యూనిట్‌ను ఐఓసీఎల్ విస్తరించనుంది. ఆర్టీసీ ఉద్యోగులకు సీపీఆర్‌పై శిక్షణకు ప్రత్యేకకేంద్రాల ఏర్పాటుకూ సహకరించనుంది. హైదరాబాద్ బస్ భవన్‌లో బుధవారం సజ్జనార్ సమక్షంలో ఒప్పందం జరిగింది. ఐఓసీఎల్ ప్రతినిధులు ఎస్‌సీ మెస్రాం, పి. కైలాష్ కాంత్, వీవీఎస్ చక్రవర్తి, నిర్మాన్ డాట్ ఓఆర్‌జీ సీఓఓ పుల్లా అనురాధతో పాటు తార్నాక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, ఆర్టీసీలో పదవీ విరమణ తర్వాత కాంట్రాక్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అయిన విశ్రాంత ఐపీఎస్ డా. రవీందర్ నుంచి ఓఎస్డీలు, తదితర విభాగాల్లో పనిచేస్తున్న 20 మందిని తొలగించారు.

ముగిసిన రేణుక అంత్యక్రియలు

- కడవెండిలో అంతిమయాత్రకు భారీగా హాజరైన జనం
- విప్లవ, ప్రజా, పౌర సంఘాలు, రాజకీయ పార్టీల నేతల నివాళులు
- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్..

దేవరుప్పుల/చర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు గుమ్మడవెల్లి రేణుక అలియాస్ చైతు అలియాస్ భాను అంత్యక్రియలు సొంతూరు జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండిలో ముగిశాయి. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన రేణుక మృతదేహాన్ని కడసారి చూసేందుకు పలు విప్లవ, ప్రజా, పౌర హక్కుల సంఘాలు, రాజకీయ పార్టీల నేతలతో పాటు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. మంగళవారం దంతెవాడ నుంచి అంబులెన్స్‌లో రేణుక మృతదేహాన్ని తీసుకుని బయల్దేరిన కుటుంబసభ్యులు అర్ధరాత్రి దాటాక స్వగ్రామానికి చేరుకున్నారు. రేణుక పెదనాన్న లక్ష్మీనర్సు ఇంటి వద్ద ఆమె మృతదేహాన్ని చూసి తండ్రి సోమయ్య, సోదరులు జీవీకే ప్రసాద్ అలియాస్ ఉసెండి, రాజశేఖర్‌తో పాటు గ్రామస్థులు కంటతడి పెట్టుకున్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్, నవ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకులు గాదె ఇన్నయ్య, మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, సీపీఐ నేత సీహెచ్ రాజారెడ్డి, సీపీఎం నేత సింగారపు రమేశ్, గద్దర్ కూతురు వెన్నెల తదితరులు రేణుకకు నివాళులర్పించారు. కళాకారుల డప్పు చప్పుళ్లు, కోలాటం, విప్లవకారులు, ప్రజాసంఘాల నేతల ఆటపాటలు, నినాదాలతో రేణుక అంతియ యాత్ర సాగింది. గ్రామ శివారులోని వాగు వద్ద రేణుక అంత్యక్రియలు జరపగా.. ఆమె సోదరుడు ప్రసాద్ రేణుక చితికి నిప్పంటించారు. కాగా, దండకారణ్యంలో సంపదను దోచి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని కేంద్రం చూస్తోందని విప్లవ, ప్రజా, పౌర హక్కు ల సంఘాల నేతలు మండిపడ్డారు. రేణుక శరీరంపై గాయాలున్నాయని, చిత్రహింసలు పెట్టి చంపేశారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలని వారు డిమాండ్ చేశారు.

రేణుక ఎన్‌కౌంటర్ బూటకం..

మావోయిస్టు నేత రేణుక అలియాస్ భానును పోలీసులే ఇంట్లో నుంచి తీసుకెళ్లి హత్య చేశారంటూ మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ బుధవారం ఓ లేఖలో



రేణుక అంతిమయాత్రలో ఆపరేషన్ కగార్ నిలిపేయాలంటూ బ్యానర్‌తో పలు సంఘాల నేతలు

పేర్కొంది. 'రేణుక అనారోగ్యం కారణంగా బీజాపూర్ జిల్లా బెల్నార్‌లోని ఓ ఇంట్లో ఒంటరిగా ఉంటున్న విషయం తెలుసుకుని మార్చి 31 తెల్లవారు జామున పోలీసు బలగాలు ఆ ఇంటిని చుట్టుముట్టి ఆమెను అరెస్టు చేశాయి. ఛత్తీస్‌గఢ్, తెలంగాణకు చెందిన ఇంటెలిజెన్స్ అధికారులు ఉదయం ఇంద్రావతి నది ఒడ్డుకు ఆమెను తీసుకెళ్లి హత్య చేశారు. రేణుకతో తుపాకీ దొరికిందని చెప్పడం కూడా అబద్ధం' అని మావోయిస్టులు ఆ లేఖలో పేర్కొన్నారు.



వ్యవసాయ క్షేత్రంలో పట్టుబడిన స్పిరిట్ డ్రమ్ములు

చండూరు కేంద్రంగా నకిలీ మద్యం దందా!

- ఇద్దరి నుంచి 80 లీటర్ల స్పిరిట్ పట్టివేత
- వ్యవసాయ క్షేత్రంలో భారీగా స్వాధీనం?

చండూరు, నాంపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చండూరులో కల్తీ మద్యం దందా గుట్టును టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ పోలీసులు రట్టు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఓ వ్యవసాయ క్షేత్రంలో భారీగా స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌వోటీ పోలీసుల మేరకు.. చండూరుకు చెందిన ఎర్రజెల్ల రమేశ్ వృత్తి రీత్యా పండ్ల వ్యాపారి కాగా, తన వ్యవసాయ క్షేత్రంలో కోళ్ల ఫారం నిర్వహిస్తున్నాడు. కనగల్ మండలం జి.ఎడవెల్లి గ్రామానికి చెందిన బొమ్మరబోయిన భార్గవ్ చేపల చెరువును నిర్వహిస్తున్నాడు. అయితే భార్గవ్ నకిలీ మద్యం తయారు చేస్తున్నట్లు ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం రావటంతో మంగళవారం రాత్రి పోలీసులు ఆయన ఇంట్లో తనిఖీలు చేసి 20 లీటర్ల స్పిరిట్‌ను గుర్తించారు. విచారణలో రమేశ్ గురించి చెప్పటంతో అతడి నివాసంలో తనిఖీ చేసి మరో 60 లీటర్ల స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించటంతో చండూరు మండలం గుండ్రపల్లిలో నకిలీ మద్యం తయారుచేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎస్‌వోటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి బుధవారం గుండ్రపల్లి శివారులోని రమేశ్ వ్యవసాయ క్షేత్రంలో తనిఖీ చేశారు. అక్కడ 10 అడుగుల మేర గుంతలు తవ్వి స్పిరిట్ డ్రమ్ములు, డబ్బాలను భద్రపర్చినట్లు గుర్తించారు. అందులో మద్యం తయారీకి ఉపయోగించే సుమారు 1,500 లీటర్ల స్పిరిట్‌ను గుర్తించినట్లు సమాచారం. కల్తీ మద్యాన్ని పలు బ్రాండ్ల సీసాల్లో నింపి ఇక్కడి నుంచే వైన్స్, బెల్ట్ షాపులకు తరలిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

గ్రామ పాలనాధికారుల విధివిధానాలు ఖరారు

- జీపీవో జాబ్ చార్ట్ విడుదల చేసిన సీసీఎల్ఏ

హైదరాబాద్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): త్వరలో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సేవలను అందించేందుకు ప్రభుత్వం నియమించనున్న 10,954 మంది గ్రామ పాలనాధికారుల (జీపీవో) జాబ్ చార్ట్‌ను భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) బుధవారం విడుదల చేశారు. దీని ప్రకారం గ్రామ స్థాయి రెవెన్యూ రికార్డుల నిర్వహణ, వివిధ రకాల ధ్రువపత్రాల జారీపై విచారణలు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, కాలువలు, నీటి వనరుల ఆక్రమణలపై విచారణ చేయడంతోపాటు భూ సర్వేలో సహాయపడటం, భూ వివాదాలపై విచారణలు వీరిపనిగా పేర్కొన్నారు. అత్యవసర సేవలు, సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను గుర్తించడం, ఎన్నికల విధులు, గ్రామస్థాయి, క్లస్టర్, మండల స్థాయిలో ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవడం కూడా వీరి విధి నిర్వహణలో భాగంగా ఉన్నాయి. ఇవికాక ప్రభుత్వం, సీసీఎల్ఏ, కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ ఆదేశాల ప్రకారం ఏ పని అయినా చేయాల్సి ఉంటుంది.

మాజీ వీఆర్వో, వీఆర్ఏల ఐచ్ఛికాలు కోరిన సీసీఎల్ఏ

10,954 మంది జీపీవోల నియామకానికి అనుమతిస్తూ ఇటీవల ఉత్తర్వులివ్వగా.. గతంలో రెవెన్యూ శాఖలో వీఆర్వో, వీఆర్ఏలుగా పని చేసిన వారి నుంచి ఐచ్ఛికాలు కోరుతూ బుధవారం సీసీఎల్ఏ ప్రకటన చేసింది. జీపీవో పోస్టులో నియామకానికి అభ్యర్థి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడై ఉండాలని సూచించింది. ఒకవేళ డిగ్రీ లేకుంటే ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో కనీసం ఐదేళ్లు రెవెన్యూ శాఖలో వీఆర్వో, వీఆర్ఏగా పని చేసి ఉండాలని, అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 16లోగా గూగుల్‌ఫాంలో దరఖాస్తులు పంపాలని కోరింది. రెవెన్యూ అంశాలపై పరీక్ష నిర్వహించి అర్హులైన అభ్యర్థులను జీపీవోలుగా ఎంపిక చేయనున్నారు.

ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టుకు భారత వాయుసేన గ్రీన్ సిగ్నల్

- తెలంగాణ ప్రభుత్వానికి లేఖ
- ప్రధానికి కోమటిరెడ్డి కృతజ్ఞతలు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో నిర్మించతలపెట్టిన విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వానికి భారత వాయుసేన(ఇండియన్ ఎయిర్‌ఫోర్స్) మంగళవారం లేఖను పంపింది. ఆదిలాబాద్ జిల్లాలో విమానాశ్రయాన్ని నిర్మించేందుకు అనుమతులు ఇవ్వాలంటూ తెలంగాణ ప్రభుత్వం 2024 డిసెంబరు 18న భారత వాయుసేనకు లేఖ రాసింది. దానిపై పరిశీలన జరిపిన వాయుసేన తాజాగా విమానాశ్రయ నిర్మాణానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. విమానాశ్రయంతో పాటు ఎయిర్‌ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా ఒక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది. పౌర విమానాల రాకపోకలకు అనువుగా రన్‌వేను నిర్మించడం, టెర్మినల్ ఏర్పాటు, ఎయిర్‌క్రాఫ్ట్ (విమానాల పార్కింగ్, ఇతర విమానయాన కార్యకలాపాలకు ఉపయోగించే నిర్దిష్ట ప్రాంతం) వంటి మౌలిక వసతులను కల్పించాలని లేఖలో పేర్కొంది. కాగా ఇప్పటికే వరంగల్ జిల్లాలోని మామునూరులో విమానాశ్రయానికి ఇటీవలే కేంద్రం అనుమతినివ్వగా, తాజాగా మరో ఎయిర్‌పోర్టుకు అనుమతినిచ్చింది.

ప్రభుత్వ కృషికి దక్కిన ఫలితం..

"ఆదిలాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణానికి భారత వాయుసేన నుంచి అనుమతులు సాధించడం ఆనందంగా ఉంది. ఆదిలాబాద్‌లో భవిష్యత్తులో వాయుసేన శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పేందుకు కృషి చేస్తాం. తెలంగాణలో విమానాశ్రయాల నిర్మాణానికి సహకరిస్తున్న ప్రధాని మోదీ, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు, రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు అండగా నిలబడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు."

- ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చైనాతో మైత్రి

భారత్-చైనా దౌత్యసంబంధాలకు డెబ్బైఐదేళ్ళు పూర్తయిన సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఏనుగు–డ్రాగన్ తరహాలో ఇరుదేశాల సంబంధాలు ఎదగాలనీ, బలోపేతం కావాలని అనడమే కాక, శాంతియుతంగా ఉండేందుకు మార్గాలను అన్వేషించుకోవాలని, సంప్రదింపులను, సమన్వయాన్ని పెంచుకోవాలని, కలసి పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. రెండు దేశాలూ పురాతన నాగరికతలనీ, అభివృద్ధిచెందుతున్నవనీ, ఆధునికీకరణలో కీలకదశలో ఉన్నాయని ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి కూడా సానుకూల వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్రపతి, ప్రధాని సైతం తమ సందేశాల్లో సత్సంబంధాలను ఆకాంక్షించారు. పరస్పర విశ్వాసాన్ని కలిగించే చర్యలు, నమ్మకమైన నడవడిక సంబంధాలను బలోపేతం చేస్తాయన్నారు. భారత్-చైనా బంధం కేవలం ఈ రెండుదేశాల సుస్థిరాభివృద్ధికి మాత్రమే కాక, మిగతా ప్రపంచం క్షేమానికీ, సంక్షేమానికీ అవసరమని ఉభయదేశాల నేతలు ఈ సందేశాల్లో అభిప్రాయపడ్డారు. ఈ డెబ్బైఐదేళ్ళ సందర్భాన్ని ఒక అవకాశంగా, ఆధారంగా స్వీకరించి, ఉజ్వల భవిష్యత్ నిర్మాణానికి పునరంకితం కావాలని, పరస్పరం సహకరించుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కాస్తంత తేడాలు ఉండవచ్చును కానీ, సందర్భానుసారం ఈ మంచిమాటలు చెప్పుకోవడంలో భారత్-చైనా నాయకులు ఒకరికొకరు తీసిపోలేదు.

చైనా కాన్సుల్ జనరల్ కోల్‌కతాలో జరిగిన ఒక కార్యక్రమంలో భారత్ ఆర్థికప్రగతిని మెచ్చుకున్న విషయం మీడియా ప్రముఖంగా ప్రస్తావించింది. హిందీ చీనీ భాయ్‌భాయ్ అంటూ ఆయన భారత్ సాధించిన విజయాలను ప్రస్తావించి మెచ్చుకున్నారు. గతంలోనూ చైనా ప్రశంసలు కురిపించడం, ఆ తరువాత పూర్తిభిన్నంగా దుశ్చర్యలకు పాల్పడటం తెలిసిందే. చైనాను నమ్మలేం, ఓ కన్నువేసి ఉంచాల్సిందే అన్న హెచ్చరిక విశ్లేషకుల నుంచి వినిపిస్తూనే ఉంటుంది. ఉభయ దేశాల దౌత్యసంబంధాలకు డెబ్బయ్ ఏళ్లయిన సందర్భంలో 2020 ఏప్రిల్ 1న ఇలాగే అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చైనా అధ్యక్షుడితో శుభాకాంక్షలు పంచుకోవడం, సత్సంబంధాలు కాంక్షించడం, ఉభయులూ సంకల్పాలు చెప్పుకోవడం, ఆ తరువాత, వరుస సరిహద్దు చొరబాట్లు, గాల్వాన్ తరహా ఘాతుకాలతో సంబంధాలు పూర్తిగా అడుగంటిపోవడం తెలిసిందే. ఐదేళ్ళ తరువాత ఇరుదేశాల నాయకులు మళ్ళీ ఈ ఏప్రిల్ 1 సందర్భాన్ని గుర్తుచేసుకోవడం విశేషం. 1950 ఏప్రిల్ 1న కమ్యూనిస్టుపార్టీ నేతృత్వంలోని పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాతో దౌత్యసంబంధాలు నెలకొల్పుకున్న దాదాపు దశాబ్దం వరకూ వ్యవహారం భాయిభాయిగానే ఉంది. కానీ, సరిహద్దులు సరిగ్గాలేని ఈ రెండుదేశాల మధ్యా 1962లో జరిగిన యుద్ధం పరిస్థితులను ఒక్కసారిగా తలకిందులు చేసింది. అనంతరకాలంలో అవిశ్వాసం ఎంత హెచ్చినా, ఏవో కొన్ని ఒప్పందాలో, అవగాహనలో, అవసరాలో కారణంగా దశాబ్దాల పాటు సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నదీ నిజమే. అయితే, ఇటీవలి కాలంలో అమెరికాతో మన సాన్నిహిత్యం ఆయుధాల కొనుగోలు దాటి ఆలింగనాల వరకూ హెచ్చడంతో సరిహద్దుల్లో చైనా చొరబడటమూ, అడపాదడపా మనలను కవ్వించడమూ పెరిగింది. ఎవరి ఏలుబడిలో చైనా మన భూభాగాన్ని ఎక్కువగా దురాక్రమించిందన్న విమర్శలనూ, వాదోపవాదాలను రాజకీయపక్షాలకు వదిలేస్తే, మొన్నటివరకూ ఉన్న ఉద్రిక్తపరిస్థితి ఇప్పుడు కాస్తంత కరిగి గాడినపడుతున్న వాతావరణమైతే కనిపిస్తోంది.

భారత్ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటామని, వాణిజ్యం పెంచుకుంటామని, అన్ని రంగాల్లో సహకరిస్తామని చైనా దౌత్యప్రతినిధులు ప్రస్తుత సందర్భంలో హామీలు కురిపిస్తున్నారు. భారతీయ సంస్థలకు స్వాగతం పలుకుతున్నారు. ఈ అమిత ప్రేమ వెనుక ట్రంప్ టారిఫ్ కత్తి ప్రధానంగా పనిచేస్తుండవచ్చు. సుంకాల ప్రతీకారాలు ఉధృతమవుతున్న తరుణంలో ఇలా కొన్ని మంచి మాటలు వినబడటం సహజం. చైనా విషయంలో ట్రంప్ వాణిజ్య యుద్ధానికి మాత్రమే పరిమితం కాబోరనీ, యూరప్‌తో తెగదెంపులు చేసుకొని, రష్యాతో చేయికలిపి, చైనాను ఢీకొట్టేందుకు ఆయన వేగంగా అడుగులువేస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. చైనా దూకుడుకు కళ్ళెం వేయడానికి ఈ ప్రాంతంలో అమెరికా పక్షాన వ్యవహరించాల్సి వచ్చినప్పటికీ, ట్రంప్‌ను పూర్తిగా నమ్మి, చైనాతో సంబంధాలు సమూలంగా నాశనం చేసుకోవాల్సిన అవసరమైతే లేదు. పరిస్థితులు కాస్తంత గాడినపడుతున్న తరుణంలో ఉభయదేశాల మధ్యా ఒక సరికొత్త ఆరంభానికి అవకాశం లేకపోలేదు.

ఎన్‌జేఏసీ పునరుద్ధరణ డిమాండ్ సరైనదేనా?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల సంచులు బయటపడడంతో న్యాయవ్యవస్థ భ్రష్టుపట్టి పోతున్నదనే ఆందోళన అంతటా వ్యక్తమైంది. ఈ ఉదంతంపై సుప్రీంకోర్టు నియమించిన ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ పరిణామాన్ని ఆసరా చేసుకుని ఉన్నత న్యాయమూర్తుల నియామకాలపై పార్లమెంటు నెలకొల్పిన ఎన్‌జేఏసీ జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను 2015లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేయకుండా ఉంటే బాగుండేదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈయన, అప్పటి న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు కలిసి కొలీజియం పైన, న్యాయమూర్తుల నియామకాల్లో సుప్రీంకోర్టు పెత్తనం మీద తరచూ విరుచుకుపడుతూ ఉండేవారు. అందులో గౌరవహీన పదజాలాన్ని కూడా ఉపయోగించేవారు. కొందరు రిటైర్డ్ జడ్జీలు ఇండియా వ్యతిరేక గ్యాంగ్‌గా కూడి భారత న్యాయవ్యవస్థ ప్రతిపక్షంగా వ్యవహరించేలా చేయడానికి ప్రయత్నిస్తున్నారని కూడా రిజిజు అన్నారు. కేంద్రన్యాయ శాఖ మంత్రి ఒకరు న్యాయవ్యవస్థ మీదకు ఇంతటి సూది మొన రాయిని విసరడం ఎప్పుడూ చూడలేదు. న్యాయవ్యవస్థపై రిజిజు ప్రేలాపనలు జుగుప్సాకరంగా ఉండడంతో ఆయనను ఆ శాఖ నుంచి తప్పించారు. జగదీప్ ధన్‌ఖడ్ అయితే వీలైనప్పుడల్లా న్యాయవ్యవస్థ కంటే పార్లమెంటు ఉన్నతమైనదని అంటూ, పార్లమెంటు రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన ఎన్‌జేఏసీని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేయడాన్ని ఇప్పటికీ తప్పుపడుతున్నారు.

ఎన్‌జేఏసీ బిల్లుకు 2014లో ప్రధాని మోదీ ప్రభుత్వం పార్లమెంటు ఆమోదం పొందింది. రాజ్యాంగంలో 124ఎ(3) అనే కొత్త సెక్షన్ చేర్చడం ద్వారా ఈ బిల్లును పార్లమెంటు చట్టంగా చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కూడా ఉండే ఆరుగురు సభ్యుల కమిటీని ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం ఈ చట్టం అవతరించింది. అయితే ఇద్దరు బయటి ప్రముఖులను కూడా ఈ కమిటీలో చేర్చడం వివాదాస్పదమయింది. న్యాయమూర్తుల నియామకంలో న్యాయవ్యవస్థ పాత్రను నామమాత్రం చేస్తున్నదనే కారణంపై ఎన్‌జేఏసీ చట్టాన్ని ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం 4:1 మెజారిటీ తీర్పుతో 2015 అక్టోబర్ 6న రద్దు చేసింది.

రాష్ట్రపతి సీజేఐని సంప్రదించి ఉన్నత న్యాయమూర్తులను నియమించాలని రాజ్యాంగ అధికరణ 124(2) స్పష్టం చేస్తున్నది. ఎన్‌జేఏసీలో ఇందుకు బొత్తిగా సందు లేకుండా చేశారు. సీజేఐని సంప్రదించడమంటే కేవలం వారికి తెలియజేయడం కాదని, వారి సమ్మతిని తీసుకోవడం కిందికి వస్తుందనే నిర్వచనం వెల్లడయింది. జస్టిస్ వర్మ ఇంటిలో నోట్ల కట్టల ఉదంతాన్ని సాకుగా చేసుకొని వెనువెంటనే ఉపరాష్ట్రపతి ఎన్‌జేఏసీ ప్రస్తావన తేవడం సమంజసంగా లేదు. నోట్ల కట్టల ఘటనపై రాజ్యసభలోని వివిధ పార్టీల సభా నేతలతో సమావేశానికి ముందే ధన్‌ఖడ్ ఎన్‌జేఏసీ ప్రస్తావన చేయడం ఆయన బీజేపీ పక్షపాతాన్నే చాటింది. అరుదుగా ఏ స్థాయిలోని వ్యక్తి అయినా అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి పాల్పడే అవకాశం లేకపోలేదు. దేశంలో ఇటువంటివి మామూలు అయిపోలేదు గాని ప్రముఖులను అప్రతిష్ఠపాలు చేసిన ఘటనలు జరగకపోలేదు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1971 మే లో ఆమె, ఆమె సెక్రటరీ పి.ఎన్. హక్సర్ స్వయంగా ఫోన్లో ఆదేశించారనుకుని ఢిల్లీ పార్లమెంటు స్ట్రీట్ స్టేట్ బ్యాంకు చీఫ్ క్యాషియర్ వి.పి. మల్హోత్రా బ్యాంకు నగదు నుంచి 60 లక్షల రూపాయల కట్టలు తీసి రుస్తుం సోహ్రాబ్ నగర్వాలా అనే ఆయనకు ఇచ్చాడు. ఆ మొత్తానికి చెక్కు కోసం ప్రధాని ఇంటికి వెళ్లి ఆయన భంగపడడం, పోలీసులు దర్యాప్తు చేసి నగర్వాలా నుంచి 6 వేల రూపాయలు మినహా మిగతా బ్యాంకు సొమ్మును వసూలు చేయడం సంచలనం సృష్టించింది.



నోట్ల కట్టల ఘటనపై రాజ్యసభలోని వివిధ పార్టీల సభా నేతలతో సమావేశానికి ముందే జగదీప్ ధన్‌ఖడ్ ఎన్‌జేఏసీ ప్రస్తావన చేయడం ఆయన బీజేపీ పక్షపాతాన్నే చాటింది. కొలీజియంలో లోపాలు ఉన్నమాట వాస్తవం. అందుచేత పార్లమెంటు రాజ్యాంగ సవరణ ద్వారా తెచ్చిన ఎన్‌జేఏసీ గొప్పదనడం విజ్ఞతాయుతం కానే కాదు.

ప్రధాని మోదీ స్వయంగా ఆదానీ వాణిజ్య ప్రయోజనాలకు తోడ్పడుతూ ఆయనకు ఉక్కు కవచంలా ఉపయోగపడుతున్నారనే విమర్శ తెలిసిందే. దీనిలోని నిజానిజాలను ఆయన పార్లమెంటుకు తెలియజేయాలన్న డిమాండు నిష్ఫలం అయిపోయిన సంగతీ ఎరుకే. కింది స్థాయి న్యాయ వ్యవస్థలో ఒకటీ అరా అప్రతిష్ఠాకర ఘటనలు చోటుచేసున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బెయిల్ మంజూరుకు లంచం తీసుకుని నగుబాటై ఆత్మహత్యకు పాల్పడిన మేజిస్ట్రేట్ ఉదంతం జ్ఞాపకాల తెర మీదినుంచి ఇంకా తొలగిపోలేదు. అతిజుగుప్సాకరమైన గుజరాత్ మారణహోమ దోషులను ఆ రాష్ట్ర ప్రభుత్వమే ముందస్తుగా విడుదల చేయడం, వారికి బయట బ్రహ్మాండమైన స్వాగతం లభించడం తెలిసిందే.

వ్యక్తులు సమష్టి మేలు కోసం ఏర్పరచుకున్నవే వ్యవస్థలు. అందులోని మెజారిటీ సభ్యులు గాని, వాటి నిష్పాక్షికతను కాపాడవలసిన వాటి పాలకులు గాని స్వార్థం కోసం వాటిని బలి తీసుకోనంతకాలం అవి వాటి విధిని సవ్యంగా నిర్వర్తిస్తూనే ఉంటాయి. ఆందోళన చెందవలసిన పని లేదు. దేశ రాజ్యాంగం పైన బొత్తిగా గౌరవం లేని కాషాయ పాలకుల హయాంలో ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలైన స్వతంత్ర సంస్థల వెన్నెముకలు విరిగిపోయాయన్న అభిప్రాయం గట్టిపడింది. ముఖ్య నిర్ణయాలు తీసుకునే పదవుల్లోనివారు రిటైర్ అయిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే నజరానాలకు ఆశపడకుండా ఉండడం ఒకప్పటి నీతిగా ఉండేది. ఇప్పుడా నీతి ఊరూ పేరూ లేకుండా కొట్టుకుపోయింది.

ఇక్కడ ఒక తాజా వార్తను ప్రస్తావించుకోవాలి. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలతో సహా ప్రతిపక్ష ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అనేకమంది మీద మనీ లాండరింగ్ వ్యతిరేక కేసులు బిగించి వేధించిన చరిత్ర కలిగి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన సంజయ్ కుమార్ మిశ్రా (65)ను ప్రభుత్వ కార్యదర్శి హోదాలో ప్రధాని ఆర్థిక సలహా మండలి పూర్తికాల సభ్యునిగా ఇటీవలే నియమించారు. ఈడీగా ఈయన పదవీ కాలాన్ని అనేకసార్లు పొడిగించారు. 2018లో పదవీస్వీకారం చేసిన మిశ్రా పదవీ కాలాన్ని అదే పనిగా పొడిగిస్తూ పోవడాన్ని ప్రతిపక్షాలు సవాలు చేస్తూ వచ్చాయి. ఈ పరిస్థితుల్లో పదవీ కాలాన్ని ఇంకా పొడిగించడానికి సుప్రీంకోర్టు అనుమతించకపోవడంతో 2023 సెప్టెంబర్‌లో మిశ్రా ఆ పదవి నుంచి తప్పుకోక తప్పలేదు. ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని లేకుండా చేసి కేంద్ర ఎన్నికల సంఘం చేత మోదీ ప్రభుత్వం ఊడిగం చేయించుకుంటున్నదనే విమర్శ తెలిసిందే. అత్యంత ముఖ్యమైన అయోధ్య వివాదం విచారణకు, రాఫెల్ యుద్ధ విమానాల కేసుకు సారథ్యం వహించి తీర్పులు ప్రకటించిన సీజేఐ రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేసిన వెంటనే రాజ్యసభ సభ్యులయ్యారు. రంజన్ లైంగికంగా వేధించారని సుప్రీంకోర్టులో పని చేసిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన కేసు విచారణను తిన్నగా నడవనీయకుండా చేసి గొగోయి అందులో నుంచి బయటపడ్డారని అనుకున్నారు.

ఇటువంటి ఉదంతాలను ప్రస్తావించి జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల ఉదంతాన్ని చిన్నదిగా చేసి చూపడం, అటువంటివి మామూలే అనిపించేలా చేయడం ఈ వ్యాసకర్త ఉద్దేశం ఎంత మాత్రం కాదు. కొలీజియంలో లోపాలు ఉన్నమాట వాస్తవం. అందుచేత పార్లమెంటు రాజ్యాంగ సవరణ ద్వారా తెచ్చిన ఎన్‌జేఏసీ గొప్పదనడం విజ్ఞతాయుతం కానే కాదు. ఎన్‌జేఏసీ ద్వారా కేంద్రంలోని బీజేపీ పాలకులు తమకు విధేయులైన, హిందుత్వ, ఆరెస్సెస్ అనుకూలురైన వారిని న్యాయమూర్తులుగా నియమింప జేసుకోవాలని సంకల్పించారు. న్యాయ వ్యవస్థ విషయంలో రాజ్యాంగం, దాని మౌలిక స్వరూపం మీద తమకు గల సమగ్ర అవగాహన వల్ల కొలీజియం విధానమే ఉత్తమమైందని సుప్రీంకోర్టు భావిస్తున్నది. ఎన్‌జేఏసీ రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని కాలరాస్తుందని భావించింది. ఇండియాలో పౌర సమాజం పరిణత స్థాయికి చేరుకోనందున న్యాయమూర్తుల నియామక ప్రక్రియను ఇతర ప్రభుత్వ అంగాల జోక్యానికి అతీతంగా ఉంచడం ద్వారా మాత్రమే దేశ పౌరుల హక్కులను కాపాడగలమని ఎన్‌జేఏసీపై విచారణ జరిపి రాజ్యాంగం 99వ సవరణను కొట్టివేసిన అయిదుగురు జడ్జీల ధర్మాసనానికి అధ్యక్షత వహించిన జస్టిస్ కేహర్ అభిప్రాయపడ్డారు.

జడ్జీలే జడ్జీలను నియమించే కొలీజియం విధానం కూడా లోపరహితమైనది కాదని ధర్మాసనం చేసిన వ్యాఖ్య ఈ సందర్భంగా గమనించాలి. అందుచేత న్యాయ నియామకాల విధానాన్ని మెరుగుపరచవలసిన అవసరం ఉందని కూడా ఈ ధర్మాసనం తేల్చి చెప్పింది. న్యాయ వ్యవస్థ, ప్రభుత్వం కలిసి కూర్చుని రాజ్యాంగ మౌలికతకు, దాని పరిపూర్ణ స్ఫూర్తికి అనుగుణమైన కొత్త వ్యవస్థను నెలకొల్పుకోవాల్సిన గట్టి అవసరం ఉంది. సంకుచితమైన స్వార్థ దృష్టికి అతీతంగా ఈ పని జరగాలి.


▪ గార శ్రీరామమూర్తి
సీనియర్ పాత్రికేయులు

ఎదురీది గెలిచిన విజేత

ఈ దేశంలో బహుజనులకు జీవితం వడ్డించిన విస్తరి కాదు. ఏ రంగంలోనైనా ఎదురీత తప్పదు. అలాంటి ఎన్నో అడ్డంకులను ఎదురీది గెలిచిన విజేత ఆచార్య తుమ్మల రామకృష్ణ. వెనుకబడిన కులాల్లో మరింత వెనుకబడిన మంగలి కులంలో పుట్టిన ఆణిముత్యం. జీవితంలో ఊహించడానికి కూడా సాధ్యపడని ఎన్నో మైలురాళ్లను అవలీలగా సాధించి చూపిన ధీశాలి. కథా రచయితగా, సాహితీవేత్తగా, ఆచార్యుడిగా అసామాన్యమైన పాత్రను పోషించారు. భారతీయ సామాజిక స్వరూపం తెలిసిన రచయితగా సాహిత్యంలో అస్తిత్వ పరివేదనను వినిపించాడు.

రాయలసీమలోని చిత్తూరు జిల్లా సోమల మండలం ఆవులపల్లె గ్రామంలో జన్మించారు తుమ్మల. పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న నాదస్వర కళను తన కుటుంబం కూడా అందిపుచ్చుకుంది. దానిని కాదనుకొని తుమ్మల మాత్రం చదువుల బాట పట్టి, చదువే లోకంగా ఎదిగి వచ్చారు. 1988లో వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్య జి.ఎస్.రెడ్డి పర్యవేక్షణలో 'తెలుగులో హాస్య నవలలు' అంశంపై పీహెచ్‌డీ పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1989లో కర్నూలు పీజీ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగ జీవితాన్ని మొదలుపెట్టారు. సాధారణంగా అట్టడుగు సమూహాల నుండి వచ్చిన వారిలో ఎక్కువమంది ఒక భద్రజీవితం లభించాక మూలాలను మరిచిపోతారు. తుమ్మల అలా కాదు. అందుకు ఆయన జీవితాచరణే సాక్ష్యం. రాప్తాడు గోపాలకృష్ణ, శ్రీనివాసమూర్తితో కలిసి 'పల్లెమంగలి కథలు', 'ఫ్యాక్షన్ కథలు' వెలువరించారు. అప్పట్లో ఈ పల్లెమంగలి కథలు పెను సంచలనాన్నే రేపాయి. రాయలసీమ ప్రాంతం నుంచి కులవృత్తికి సంబంధించిన తొలి కథా సంపుటిగా పల్లెమంగలి కథలు నిలిచిపోయాయి.

నివాళి



తుమ్మల రామకృష్ణకు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని నిలబడే ధైర్యం తన నేపథ్యమే నేర్పింది. సామాజికంగా ఆయన అనేక అగ్రవర్ణ కుల అహంకారాలను దాటుకొని వచ్చారు. తనను తక్కువ చూపు చూసిన సమాజం చేత శెభాష్ అనిపించుకునే స్థాయికి ఎదిగారు. జీవితపు ప్రతీ మలుపులోను ఆటుపోట్లను తట్టుకొని నిలబడ్డారు.

తాను రాసిన పలు కథల్ని 'మట్టి పొయ్యి కథలు'గా ప్రచురించారు తుమ్మల. గ్లోబలైజేషన్ విధ్వంసం వల్ల పల్లెల్లో వచ్చిన మార్పులు, మనుషుల సంఘర్షణనే ఈ కథలకు ఇతివృత్తం. మరోవైపు కర్నూలు కేంద్రంగా 'కథా సమయం' వంటి వేదికలు నిర్వహిస్తూ నిరంతరం సాహితీ చర్చలు కొనసాగించారు. తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న అనేకమంది రచనలను లోతుగా అధ్యయనం చేశారు తుమ్మల. రష్యన్ కథా రచయితల రచనలనూ విస్తృతంగా చదివారు. ముఖ్యంగా వచన కవిత్వం, వచన రచనల పట్ల ఆయనకు అమితమైన అభిమానం. తన ఉపన్యాసాల్లో గురజాడ, చాసో, కొడవటిగంటి కుటుంబరావు, చలం, కేతు విశ్వనాథరెడ్డి, కొలకలూరి ఇనాక్, అల్లం రాజయ్య, బీఎస్ రాములు వంటి రచయితల రచనలను అలవోకగా ప్రస్తావించేవారు. తోటి రచయితలతో గాఢమైన స్నేహను బంధాన్ని పెంపొందించుకునేవారు. అందుకే, యావత్ తెలుగు నేలమీద తుమ్మలకు ఎందరో సాహితీ ఆత్మీయులు అనతికాలంలోనే ఏర్పడ్డారు. అట్లా ఆయన కర్నూలు సాహితీ మిత్రులతో కలిసి 'కథా సమయం', 'హైంద్రావతి కథలు' కూడా ప్రచురించారు. ఆ తరువాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఆచార్యుడిగా వచ్చారు.

తెలుగు శాఖలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే రచనా వ్యాసాంగాన్ని కొనసాగించారు. ముఖ్యంగా శాఖాధ్యక్షుడిగా ఉన్న కాలంలో 'పరిచయం', 'బహుముఖం', 'అభిముఖం', 'అవగాహన' వంటి విలువైన సాహిత్య సంకలనాలను తీసుకొచ్చారు. ఇక రచయితగా చాలా విరామం తరువాత 'తెల్లకాకులు' కథను రచించారు. దీనిపై పదుల సంఖ్యలో స్పందనలు, సమీక్షలు వెలువడ్డాయి. వాటిని 'ఎక్కడివి తెల్లకాకులు?' పేరుతో ఆయన విద్యార్థులు పుస్తకంగా సంకలనం చేశారు. ఆచార్య తుమ్మల వద్ద యాభైమందికి పైగా విద్యార్థులు పరిశోధనలు చేశారు. అందులో 20మంది పీహెచ్‌డీ పరిశోధకులు, మరో 34మంది ఎంఫిల్ స్కాలర్లు ఉన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ధిక్కార గొంతుకల్ని వినిపించిన అస్తిత్వవాదాలపై ఆచార్య తుమ్మల విలువైన పరిశోధనలు చేయించారు. ఇక వృత్తికథలపై మరోసారి 'అడపం', 'రేవు' వంటి చారిత్రిక కథా సంకలనాలను వెలువరించారు. అలాగే ఉమ్మడి రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాలకు పాఠ్య ప్రణాళిక సంఘం సభ్యులుగా సేవలను అందించారు. తరగతి వెలుపల సైతం ఒక మంచి టీచర్‌గా జీవించారు. పాఠం ప్రిపేర్ కాకుండా ఏనాడు ఆయన క్లాస్‌కు వచ్చిందే లేదు. హాస్యచతురతతో విద్యార్థులతో స్నేహంగా మెలగడం ఆయనలోని మరో మంచి లక్షణం. తరువాత తాను పుట్టిన చిత్తూరు జిల్లాలోని కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా ఎంపికయ్యారు. ఇట్లా ఆయన అకడమిక్స్‌లో అత్యున్నత పదవిని అందిపుచ్చుకోవడం వెనకాల ఆయన మహాసంకల్పమే కారణం.

కర్నూలు నుండి సెంట్రల్ యూనివర్సిటీకి మారే క్రమంలో రోడ్డు ప్రమాదంలో సహచరిని కోల్పోయినప్పుడు ఆయన ఎంతో మానసిక సంఘర్షణ ఎదుర్కొన్నారు. తుమ్మలకు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని నిలబడే ధైర్యం తన నేపథ్యమే నేర్పింది. సామాజికంగా ఆయన అనేక అగ్రవర్ణ కుల అహంకారాలను దాటుకొని వచ్చారు. తనను తక్కువ చూపు చూసిన సమాజం చేత శెభాష్ అనిపించుకునే స్థాయికి ఎదిగి చూపించారు. జీవితపు ప్రతీ మలుపులోను ఆటుపోట్లను తట్టుకొని సార్థక జీవితాన్ని జీవించి చూపించారు.

• డాక్టర్ పసునూరి రవీందర్

దేశ ప్రగతికి హేతువాదం కీలకం

ఏ సమాజం అయినా హేతువాదాన్ని పుణికిపుచ్చుకున్నప్పుడు అక్కడ సామాజిక సుస్థిరత వస్తుంది, అభివృద్ధి పరుగులు పెడుతుంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు ఈ దిశగానే పయనిస్తున్నాయి. అందుకే ఆ దేశ ప్రజల జీవన ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. ఇందుకు ప్రత్యక్ష తార్కాణం అమెరికా. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చి స్థిరపడిన ప్రజలు, విభిన్న మతాలు, సంస్కృతుల కలబోతగా ఉన్న అమెరికా నేడు అగ్రరాజ్యంగా ఎదగడానికి హేతువాద సిద్ధాంతాలు కీలకం. యూరోప్ దేశాలు సైతం ఇదే తోవలో వెళ్తున్నాయి. దీనికి భిన్నంగా మతం ఆధారంగా ప్రజలను పాలిస్తున్న పాలస్తీనా, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల దుస్థితిని మనం చూస్తూనే ఉన్నాం.

ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్యంగా మనం చెప్పుకుంటున్న మన దేశంలో ప్రభుత్వాలు ఎలా ఏర్పడుతున్నాయి అనేది చర్చించాల్సిన అంశం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి 50 ఏళ్లలో నవరత్న కంపెనీలు, ఐఐటీలు, బ్యాంకుల జాతీయీకరణ, పెద్దా చిన్నా ప్రాజెక్టులు, రైల్వేలు, గనులు... ఇలా అనేక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి నమోదైంది. ఆ కాలంలో దేశంలో ఎన్నికల ప్రస్థానం హేతువాదం అనే అంశం చుట్టూ తిరిగింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు, జనతా పార్టీలు ఏనాడూ మతవాదం వైపు తొంగిచూడలేదు. 90వ దశకం నుండి మతవాదాన్ని తెరపైకి తెచ్చిన ఆరెస్సెస్, బీజేపీలు దాన్ని మరింత బలపర్చుకుంటూ వచ్చాయి. ఈ తర్వాత కొనసాగిన ఎన్నికల్లో క్రమంగా అభివృద్ధి, ఆలోచన, ప్రశ్నవంటి ప్రజోపయోగ ఎజెండాలు పక్కదారి పట్టినాయి.

మతవాదం ప్రవచించే పార్టీలకు ప్రజలు తాత్కాలికంగా అధికారాన్ని ఇవ్వొచ్చు కానీ ఆ పార్టీలతో ఏర్పడిన ప్రభుత్వాలు దేశ ప్రజల జీవన ప్రమాణాలను వృద్ధి చేయలేవు. బీజేపీ మతవాదాన్నే ఎన్నికల ఎజెండాగా తీసుకొని, తమ సంస్థల్ని బలంగా నిర్మించుకున్నది. ఎప్పుడు సాధారణ ఎన్నికలు వచ్చినా బీజేపీ ఒక మతానికి, కాంగ్రెస్ మరో మతానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయని ఒక ప్రణాళికతో కూడిన ప్రాపగండా గత కొన్ని ఎన్నికల్లో మనం చూస్తున్నాం. దీంతో ఎన్నికల సమయంలో సమాజంలో చర్చకు రావలసిన అంశాలు మరుగునపడుతున్నాయి.

ప్రజల్ని ఈ మతవాద ఎజెండా నుండి హేతువాద ఎజెండా వైపు తేవడానికి ఎంతో కృషి చేయాలి. ఈ అంశంలో రాజకీయ పార్టీల సహకారం అంతంత మాత్రమే. ఒక పార్టీ మతవాదంతో బలాన్ని నిర్మించుకుంటే.. మరికొన్ని పార్టీలు ప్రాంతీయ, అస్తిత్వ వాదాలతో ఎదిగాయి. ప్రాంతీయ వాదంలో ప్రశ్న, ఆలోచన, అభివృద్ధి ఆకాంక్షలు కొంత ఉత్పన్నమవుతాయి. ఇవి అంత ప్రమాదం కాకపోయినా దేశ సమగ్రత, అభివృద్ధి కోసం ప్రాంతీయ పార్టీలు కూడా హేతువాద పునాది వైపు మళ్ళాల్సి ఉంటుంది. భారత ఎన్నికల ఎజెండాలో హేతువాదం ప్రభవించాలి అంటే పౌరసమాజమే అత్యంత కృషి చేయాలి. ప్రజల మత విశ్వాసాలతో రాజకీయం చేయడం ద్వారా వచ్చే విజయాలతో దేశం ముందుకు పోలేదు.

– బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి
సీఈవో, టిసాట్ నెట్‌వర్క్

ధనిక రాష్ట్రంలో 84శాతం పేదలా?

తెలంగాణ ధనిక రాష్ట్రమని, తలసరి ఆదాయం లెక్కన దేశంలో మొదటిస్థానంలో ఉందని మన నాయకులు గొప్పగా చెపుతుంటారు. అయితే ఇంతవరకు 90 లక్షల రేషన్ కార్డులు మంజూరు కాగా, కొత్తగా ఇంకా 10 లక్షల కార్డులు ఇవ్వబోతున్నారు. ప్రభుత్వం ప్రకారం తెలంగాణలో 84శాతం జనాభాకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం సరఫరా ఉగాదినాడు ఆరంభమైంది. ఈ లెక్కన రాష్ట్ర జనాభాలో 84శాతం మంది పేదవారే.

స్వాతంత్ర్యం వచ్చి దేశ విభజన జరిగినప్పుడు పంజాబ్ రాష్ట్రంలో మంచి పంటలు పండే భూములు పాకిస్తాన్‌కు వెళ్లాయి. దానితో దేశంలో తిండిగింజల కొరత ఏర్పడింది. మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ భాక్రానంగల్ వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టులు నిర్మించడంతో ఆహారధాన్యాల దిగుబడి పెరిగింది. అయినా, పెరుగుతున్న జనాభాకు అది సరిపోక ఆహార కొరత నెలకొంది. అప్పటి పరిస్థితుల్లో పేదలకు ఆహారభద్రత కల్పించడానికి 1955లో ప్రజాపంపిణీ వ్యవస్థ ఏర్పాటు చేసి, పేదలకు రేషన్‌కార్డుల ద్వారా సబ్సిడీపై ఆహారధాన్యాలు పంపిణీ చేశారు. అయితే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగినా, పేదలకు ఆహార ధాన్యాలు సరిగా అందలేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం 2013లో ప్రజలకు ఆహారధాన్యాలు సబ్సిడీపై అందించడానికి నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (జాతీయ ఆహార భద్రత చట్టం) తీసుకొచ్చింది. దీనితో రాష్ట్రాలకు కావలసిన ఆహారధాన్యాలు, కిరోసిన్ వంటివి కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్నది.

తెలంగాణ ఏర్పడ్డాక, రాష్ట్రానికి ప్రతినెలా ఒక లక్ష ఆరువేల టన్నుల బియ్యం, 4,300 టన్నుల గోధుమలు, 5 వేల టన్నుల చక్కెర వంటివి కేంద్రం ఇచ్చింది. 2015 ఏప్రిల్ నుంచి కేంద్రం ఇచ్చిన బియ్యం, గోధుమలకు అదనంగా రాష్ట్రం మరో 56 వేల టన్నుల బియ్యం, 8 వేల టన్నుల గోధుమలు ప్రతి నెల ప్రజా పంపిణీ వ్యవస్థకు అందజేసింది. అదీకాక కేంద్రం ఇచ్చే కార్డు ఉన్న కుటుంబంలో ప్రతి వ్యక్తికి 5 కిలోల బియ్యం ఇవ్వగా, రాష్ట్రం ఇంకో కిలో బియ్యం తన వంతు వాటాగా కలిపి ఆరు కిలోలు ఇస్తున్నది. ఈ చర్య రాజకీయ లబ్ధి కోసం తీసుకున్నదే కాని, నిజంగా అవసరం ఉన్నదా అని చూడలేదు.

కరోనా సమయం నుంచి కేంద్ర ప్రభుత్వం దేశంలోని 80 కోట్ల కుటుంబాలకు ఉచితంగా ఆహారధాన్యాలు సరఫరా చేస్తున్నది. అందులో భాగంగా తెలంగాణలో కేంద్రం తరపున 55 లక్షల కార్డుల ద్వారా కోటి 92 లక్షల జనాభాకు ఉచితంగా రేషన్ అందజేస్తున్నది. దీనికి అదనంగా రాష్ట్రం 35లక్షల రేషన్ కార్డుల ద్వారా 90 లక్షల మందికి రేషన్ అందజేస్తున్నది. అంటే మొత్తం 90 లక్షల రేషన్ కార్డులతో సుమారు 2కోట్ల 82లక్షల మందికి రేషన్ అందిస్తున్నారు. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంకో 10 లక్షలు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నది. దానితో రాష్ట్రంలో మొత్తంగా ఒక కోటి రేషన్ కార్డులతో సుమారు 3.12 కోట్ల జనాభాకు రేషన్ ఇస్తున్నారు. ఇంతకు పూర్వం దొడ్డు బియ్యం ఇవ్వగా, ఉగాది నుంచి సన్నబియ్యం ఇస్తున్నారు.

దేశంలో నీతీఆయోగ్ లెక్కల ప్రకారం జనాభాలో 3.74శాతం ప్రజలు అతి పేదలుగా ఉన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా ఏ లెక్కన చూసినా 20శాతం లోపే. అటువంటి పరిస్థితిలో ఉచితంగా సన్నబియ్యం 84శాతం ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందజేయడమంటే ప్రజాధనాన్ని వృథాచేయడమే. బోగస్ రేషన్ కార్డులు తొలగించినా కేంద్రం ఇచ్చే ఆహారధాన్యాలు సుమారు 2 కోట్ల మందికి అంటే జనాభాలో 50శాతం మందికి సరిపోతాయి. అదనంగా రాష్ట్రం ప్రజాపంపిణీ వ్యవస్థపై ఏ విధమైన ఖర్చు చేయాల్సిన పని లేదు.



తెలంగాణలోని 84శాతం జనాభాకు ఒక కోటి రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం ఇవ్వడం ద్వారా రాష్ట్ర ఖజానాపై పెనుభారం పడుతుంది. ఇది ప్రజలను సోమరిపోతులుగా మారుస్తుంది. రాజకీయ లబ్ధికై ప్రజాధనాన్ని ఖర్చు చేయడాన్ని ప్రజలు సమర్థించరు.

గత సంవత్సరం ప్రజాపంపిణీ వ్యవస్థ కొరకు 3 వేల కోట్లు ఖర్చు అయింది. ఇప్పుడు సన్నబియ్యం ఇస్తున్నారు కాబట్టి ఈ ఖర్చు 5 వేల కోట్ల వరకు చేరవచ్చు. రేషన్ కార్డు కొరకు అర్హత మొదట్లో గ్రామీణ ప్రాంతాలలో 2.5 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట, అలాగే పట్టణ ప్రాంతాలలో సాలీనా ఆదాయం 1.5 లక్షల లోపుగా నిర్ణయించగా; దానిని 3.5 ఎకరాల మాగాణి, 7.5 ఎకరాల మెట్టకు పెంచారు. అలాగే పట్టణ ప్రాంతాలలో సాలీనా ఆదాయం 2 లక్షలకు పెంచారు. ప్రభుత్వ, ప్రైవేటు, పొరుగుసేవ ఉద్యోగులు, సెల్ఫ్ ఎంప్లాయిడ్ వ్యక్తులు, ప్రభుత్వ పెన్షన్‌దారులు వంటివారు రేషన్ కార్డు పొందడానికి అనర్హులు. నేడు తెలంగాణలో 90శాతం ఇళ్ళలో టీవీ, మోటారు సైకిల్ వంటివి ఉన్నాయి. పట్టణ ప్రాంతాలలో సేవారంగం, పొరుగు సేవలలో చాలామంది ఉపాధి పొందుతున్నారు.

ఈ మధ్య సుప్రీంకోర్టు... ప్రభుత్వాలు ఉచితాల పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తూ ప్రజలను సోమరిపోతులుగా చేస్తున్నది అన్నది. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాదులో స్థానికులు పనిచేయకపోవడంతో చాలామంది కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు. అంటే సుప్రీంకోర్టు వారు చెప్పింది తెలంగాణకు వర్తిస్తుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బోగస్ రేషన్ కార్డులు ఏరివేసి, రాష్ట్ర జనాభాలో 50శాతం జనాభాకు మాత్రమే రేషన్ అందేటట్లు చర్యలు తీసుకోవాలి. తెలంగాణలోని 84శాతం జనాభాకు కోటి రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం ఇవ్వడమంటే రాష్ట్ర ఖజానాపై పెనుభారం పడుతుంది. ప్రజలను సోమరిపోతులుగా మారుస్తుంది. ప్రస్తుతం కేంద్రం కోటి 92 లక్షల మందికి ఉచితంగా ఇచ్చే బియ్యం సరిపోతుంది. నేడు బియ్యం కన్నా పప్పు దినుసులు, వంట నూనె కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఈ రెండూ కూడ తక్కువ ధరలో ఈ 50శాతం జనాభాకు ఇచ్చినా మేలే. ప్రభుత్వం ప్రజల ధనానికి ఒక కస్టోడియన్ మాత్రమే. రాజకీయ లబ్ధికై ప్రజాధనాన్ని ఖర్చు చేయడాన్ని ప్రజలు సమర్థించరు.

◆ యం. పద్మనాభరెడ్డి
అధ్యక్షులు, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

కాంతారావు పేరిట నంది అవార్డు

నల్లగొండ జిల్లా, కోదాడలోని గుడిబండ గ్రామంలో 1925, నవంబర్ 15న జన్మించారు కాంతారావు. శతజయంతి ఉత్సవాల తరుణంలో ఆయన పేరుపై నంది అవార్డు ఇవ్వడం సముచితంగా ఉంటుంది. ఆయన 250కి పైగా చిత్రాల నటుడు, జానపద కథా నాయకుడు, కత్తివీరుడు, ఎన్టీఆర్–ఏయన్నార్‌లతో సమానంగా నటించి, పారితోషికం తీసుకున్నవాడు, బహుముఖ ప్రజ్ఞాశాలి.

చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో తల్లితో కలిసి ఖమ్మం చేరుకున్నాడు. అక్కడే హైస్కూల్ వరకు చదువుకున్నాడు. అప్పట్లోనే నాటకాలు వేయడం ఆరంభించాడు. అప్పుడే సురభి వాళ్లు కాంతారావును తమ సంస్థలోకి ఆహ్వానించారు. ఆయనతో కృష్ణుడు, రాముడు, అర్జునుడు, నారదుడు వంటి పాత్రలు వేయించారు. దీంతో ఆయనలో కళాతృష్ణ పెరిగింది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో ఆయన నాటకాలు వేస్తూ తిరిగారు. ఆ తరువాత సొంతంగా నాటక సంస్థను స్థాపించి నాటకాలు వేశారు. 1950లో మద్రాసులో నాటకాలు వేస్తూ దర్శక, నిర్మాత హెచ్.ఎం. రెడ్డి కంట్లో పడ్డారు. చిన్న చిన్న పాత్రలు వేస్తూ 1953లో 'ప్రతిజ్ఞ' చిత్రంతో హీరో అయ్యారు. అప్పటి నుంచి పలు పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలు చేశారు. నారద పాత్రతో ప్రత్యేక స్థానం సంపాదించారు.

కాంతారావు తెలంగాణ బిడ్డ. ఆయనకు తగిన గుర్తింపు రాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి బిరుదులూ ఇవ్వలేదు. గద్దర్ రెండు సినిమాలలో రెండు, మూడు పాటలు పాడారు, స్టేజిపై ఆడి పాడారు. కానీ గొప్ప నటుడు, విభిన్న పాత్రలు పోషించిన కాంతారావు పేరుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డు ఇవ్వడం సముచితంగా ఉంటుంది.

– అందేపాక నరహరి

కనీస నిల్వ చార్జీలు తీసెయ్యాలి

ప్రస్తుతం సేవింగ్స్ అకౌంట్‌లో ఉన్న నగదుకు వచ్చే వడ్డీ కన్నా వివిధ రకాల చార్జీల పేరుతో బ్యాంకులు తీసుకునే మొత్తం అధికంగా ఉంటోంది. అలాగే నగదు తీయాలన్నా వేయాలన్నా కూడా చార్జీలు వేస్తున్నారు. ఇప్పుడు ఖాతాలో కనీస నిల్వ ఐదువేల రూపాయలు ఉండాలంటున్నారు. లేకపోతే జరిమానా వేస్తారట. ఇది అన్ని రకాలుగా ప్రజలని ఇబ్బందులకు గురి చేస్తున్నది. ప్రజల డబ్బును బ్యాంకులు సేవింగ్స్ రూపంలో తీసుకుని ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీ ఇచ్చి, అధిక వడ్డీలకి పెట్టుబడిదారులకు ఇస్తూ మనుగడ సాగిస్తున్నాయి. కాబట్టి కనీస నిల్వ లేకపోతే చార్జీలు విధించడాన్ని బ్యాంకులు మానుకోవాలి.

– నార్నె వెంకటసుబ్బయ్య



అంగన్వాడీలకు 'అద్దె' కష్టాలు

- కిరాయి ఇళ్లలో కష్టతరంగా అంగన్వాడి కేంద్రాలు
- తక్కువ అద్దె చెల్లింపుతో టీచర్లకు సమస్యలు
- అదికూడా ఆర్నెళ్లకోసారి ఇస్తుండడంతో భారం
- ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్న యజమానులు
- చాలీచాలని వసతులు, ఇరుకు గదుల్లోనే నిర్వహణ
- టాయిలెట్లు లేక టీచర్లు, హెల్పర్లు, విద్యార్థుల అవస్థలు
- శాశ్వత భవనాలపై దృష్టి సారించని రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు అద్దె చెల్లింపు అంశం సమస్యగా పరిణమించింది. ఒక విధంగా అద్దెకు ఇవ్వడానికే యజమానులు వెనకాడుతున్నారు. ప్రతీ నెల అద్దె చెల్లింపు క్రమంగా జరగాలని యాజమానులు స్పష్టం చేయగా.. ప్రభుత్వం ఏడాదిలో ఆర్నెళ్లకోసారి అద్దె నిధులు మంజూరు చేస్తుండడంతో యజమానులు భవనాలను ఖాళీ చేయాల్సిందిగా అంగన్వాడీ టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వం అద్దె రూపంలో కేంద్రానికి రూ.3 వేలు మాత్రమే చెల్లించడం కూడా మరో సమస్యగా మారింది. ఇంత తక్కువ ధరలో అద్దెకు భవనాలు దొరకడం లేదు. ఇక పట్టణాలు, నగరాల్లో అయితే గగనంగా మారిందని అంగన్వాడీ టీచర్లు చెబుతున్నారు.

తక్కువగా కిరాయి చెల్లింపు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాల భవనాల్లోనే అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తుండగా.. మిగతా చోట్ల అద్దె భవనాల్లోనే కేంద్రాల నిర్వహణ సాగుతోంది. అద్దె చెల్లించడానికి ఒక ఎస్ఎఫ్‌టీకి రూ.6 చొప్పున చెల్లిస్తోంది. వరంగల్ నగరంలో అయితే రూ.6వేలకు మించి అద్దె చెల్లించకుండా నిర్దేశించింది. ఈ రూ.6 వేలల్లోనే కేంద్రం అద్దెకు తీసుకోవడానికి అనుమతి ఇచ్చింది. అయితే ప్రభుత్వం నిర్దేశించిన రూ.ఆరు వేలను కూడా చెల్లించకుండా కేవలం రూ.3 వేలలోపే అద్దెకు తీసుకునే అనధికార నిర్ణయంతో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ టీచర్లకు భారంగా మారింది. ఇంత తక్కువ ధరలో కనీసం విశాలమైన ఒక్క గది దొరకడం ఇబ్బందిగా పరిణమించింది. ప్రీ స్కూల్ పిల్లలకు విద్యాభ్యాసం, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేత, సమావేశల నిర్వహణ తదితర కార్యక్రమాలు ఒకే గదిలో నిర్వహించడం కష్టంగా పరిణమించింది. కనీసం మూడు గదులతో ఉన్న భవనం అయితేనే నిర్వహణకు సౌకర్యంగా ఉంటుందని టీచర్లు చెబుతున్నారు. మూడు భవనాల కేంద్రానికి కనీసం రూ.10 వేలకు తగ్గకుండా నగరంలో అద్దె ఉంటోంది. ఈ మేరకు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కేంద్రాల నిర్వహణ సమస్యగా మారింది.

ఇరుకు గదులు.. వసతుల కరువు

కేవలం రూ.3వేల నుంచి రూ.6 వేల లోపే అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అద్దె చెల్లి స్తోంది. ఈ క్రమంలో విశాలమైన భవనాలు అద్దెకు లభించడం గగనంగా మారింది. కొన్ని భవనాలైతే ఒకే గదిలో నిర్వహించే దుస్థితి నెలకొంది. ఇక అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాలతో నిర్వహణ జరుగుతోంది. టాయిలెట్లు లేకపోవడం, విద్యుత్ సమస్య, తాగునీటి కరువు.. ఇలా అరకొర సౌకర్యాల నడుమ కేంద్రాల నిర్వహణ సాగుతోంది. టాయిలెట్లు, నీటి సౌకర్యం లేకపోవడం వల్ల టీచర్లు, హెల్పర్లతో పాటు కేంద్రానికి వచ్చే గర్భిణులు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణాల వల్ల 0-6 ఏళ్ల వయస్సు గల పిల్లలకు కేంద్రాలకు రావడానికి అయిష్టత చూపుతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను పంపించడంలో ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా కేంద్రాల నిర్వహణ ఫలితాల సాధనలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

యజమానుల ససేమిరా..

అద్దె సక్రమ చెల్లింపు లేకపోవడంతో అంగన్వాడీ కేంద్రాలను ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి చేస్తున్నారు. ఇక ఇరుకు గదులు, శుభ్రత లేకపోవడం కారణంగా నిర్వహణ కేంద్రాల్లో ఆహార నిల్వలతో ఎలుకలు, ఇతర అపరిశుభ్రత పరిస్థితులు ఏర్పడడంతో ఖాళీ చేయాలని కొందరు యజమానులు టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారు. అద్దె పెంచుతామని, లేకుంటే ఖాళీ చేయాలని స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాలు టీచర్లకు సమస్యలను సృష్టిస్తోంది. ఖాళీ చేసి మరో భవనం వెతుక్కుందామంటే అంగన్వాడీ కేంద్రాలకు ఇవ్వడానికి యజమానులు సుముఖంగా ఉండడం లేదు. ఈ సమస్యలతో కేంద్రాల నిర్వహణ క్లిష్టతరంగా మారింది.

ఆర్నెళ్లకోసారి చెల్లింపు..

ఇచ్చే రూ.3వేల అద్దె కూడా ప్రభుత్వం నెల వారిగా క్రమంగా చెల్లించడం లేదు. 6నుంచి 8నెలల తరువాత అద్దె డబ్బులు జారీ అవుతున్నాయి. ఈ క్రమంలో అంగన్వాడీ టీచర్లు తమ వేతనాల నుంచే అద్దె చెల్లించాల్సి వస్తోంది. వచ్చే రూ.13,800 వేతనంలో రూ.3000 అద్దెకే చెలించాల్సి రావడంతో టీచర్లకు ఆర్థిక సమస్యలను సృష్టిస్తోంది.

శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలి

హనుమకొండ జిల్లాలో 788 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 293 అద్దె భవనాలే ఉన్నాయి. కేంద్రాల కోసం ప్రభుత్వం శాశ్వత భవనాల నిర్మాణాన్ని చేపట్టాలనే డిమాండ్‌ను టీచర్లు చేస్తున్నారు. నిర్మాణం సాధ్యం కాని విషయంలో అద్దెను పెంచాలని కోరుతున్నారు. కనీసం మూడు గదుల భవనమైతే కేంద్రం నిర్వహణకు సౌకర్యంగా ఉంటుందనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి.



ఎరుపెక్కిన కడవెండి

కడవెండిలో రేణుక చితికి నిప్పంటిస్తున్న సోదరుడు జీవీకే ప్రసాద్

మావోయిస్టు నేత రేణుక అలియాస్ చైతుకు కన్నీటి వీడ్కోలు

- అంతిమయాత్రకు భారీగా హాజరైన జనం
- స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు
- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలంటూ విప్లవకారుల డిమాండ్

6

రాజ్యాంగాన్ని మార్చాలనడం బీజేపీ దిగజారుడుతనం

- రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కృషి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కాజీపేటలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడే రాజ్యాంగాన్ని మార్చాలనడం బీజేపీ దిగజారుడుతనమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. కాజీపేటలో బుధవారం రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా 'జైబాపు, జై భీమ్, జై సంవిధాన్' పేరుతో యాత్ర చౌరస్తా మీదుగా జూబ్లీమార్కెట్ నుంచి చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేద్కర్, మహాత్మాగాంధీల వారసత్వం, విలువలను కాపాడటానికి దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ సందేశంతో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఈ పాదయాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పాదయాత్రలో రాజ్యాంగం వల్ల కలిగే లాభాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తామని చెప్పారు. రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ అందరికీ సమాన హక్కులు కల్పించారన్నారు. రాజ్యాంగ నిర్మాత ఆలోచనా విధానాన్ని కాపాడుకుంటూ 'జై భీమ్, జై బాపు, జై సంవిధాన్' నినాదంతో అందరూ భాగస్వాములై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రలో స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి, తోట వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, అబూబక్కర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాకాంత్‌రెడ్డి, జై సంవిధాన్ ఇన్‌చార్జి పులి అనిల్ కుమార్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు అంకూస్, డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, పి.ఆంజనేయులు, పోగుల సంతోష్, నాయిని లక్ష్మారెడ్డి, సిరిల్ లారెన్స్, ఎం.డి. రఫీ, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేతన వెతలు!



- ఏడాదిగా జీతాల్లేక ధరణి ఆపరేటర్ల పస్తులు
- ఏజెన్సీ రద్దుతో టీజీటీఎస్‌కు అటాచ్
- ప్రభుత్వం నుంచి నేరుగా చెల్లింపు ప్రతిపాదన
- ఆదేశాలు రాక వేతనాలు ఆగిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 78మంది ఆపరేటర్లు.. రూ.కోటికి పైగా బకాయి
- బాధలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం

7



ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ నిర్వహణకు భూమి పూజ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

7

రజతోత్సవ సభతో రాజకీయాల్లో పెను మార్పులు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎల్కతుర్తిలో సభ నిర్వహణ పనులు ప్రారంభం
- హాజరైన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులు

ముగిసిన టెన్త్ పరీక్షలు

- ఏప్రిల్ చివరి వారంలో ఫలితాల వెల్లడి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 21న ప్రారంభమైన వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి పరీక్ష కావడంతో హాస్టళ్ల వద్ద తల్లిదండ్రుల సందడి నెలకొంది. మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష ముగిసిన తర్వాత పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు బాధాతప్త హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు. ఇక హాస్టళ్ల నుంచి విద్యార్థులను వారి ఇండ్లకు తీసుకెళుతున్న తల్లిదండ్రులు వారి సామగ్రిని ద్విచక్రవాహనాలపై తీసుకెళ్లారు. హనుమకొండ బస్టాండ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా మారింది. వరంగల్ జిల్లాలో పది పరీక్షల్లో మొత్తంగా 99.84 శాతం మంది విద్యార్థులు హాజరుకాగా, హనుమకొండ జిల్లాలో 99.95 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన పోలీసు, వైద్య, ఆరోగ్యశాఖ, ఇతరత్రా అన్ని ప్రభుత్వ శాఖల ప్రతినిధులకు పరీక్షల విధుల్లో భాగస్వాములైన వివిధ శాఖల సిబ్బందికి డీఈవోలు ఎం.జ్ఞానేశ్వర్, డి.వాసంతి కృతజ్ఞతలు తెలిపారు.

'ఎల్ఆర్ఎస్' గడువు పొడిగింపు

- 25 శాతం రాయితీతో ఏప్రిల్ 30 వరకు చెల్లించవచ్చు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 148 మున్సిపాలిటీలకు ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీం) ఫీజులో 25 శాతం రాయితీతో భూయజమానులు, రియల్టర్లు చెల్లింపులు జరుపవచ్చని రాష్ట్ర మున్సిపల్ విభాగం ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న మాదిరిగానే ఫీజులు చెల్లించకుండా ఉన్న వారు ఈ నెల (ఏప్రిల్ 30) వరకు 25 శాతం రిబేట్ ఫీజుతో చెల్లింపులు జరుపవచ్చని వెల్లడించారు. కాగా, గురువారం నుంచి గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 12 హెల్ప్‌డెస్కులు ఈ నెల 30 వరకు పని చేస్తాయని ప్రజలు బల్దియా కార్యాలయంతో పాటు హెల్ప్‌డెస్కుల వద్ద రాయితీతో కూడిన ఫీజును చెల్లించవచ్చని బల్దియా అధికారులు వెల్లడించారు.

జీహెచ్‌ఎంసీలో చెత్తతో అద్భుతాలు

- కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య
- హైదరాబాద్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టడీ టూర్
- రాంపూర్‌లో అమలు చేసేందుకు అధికారుల యోచన



హైదరాబాద్‌లో డంపింగ్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో చెత్తతో అద్భుతాలు సృష్టిస్తున్నారని వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్యలు పేర్కొన్నారు. హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్యలతో పాటు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సందర్శించారు. హైదరాబాద్‌లో అమలువుతున్న ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతి, చెత్త నుంచి విద్యుత్ తయారీ, చెత్త తరలింపు ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను పరిశీలించారు. అనతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై చెత్త శుద్ధీకరణపై లోతైన అధ్యయనం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్యలు సంయుక్తంగా మాట్లాడుతూ.. చెత్త నుంచి విద్యుత్, గ్యాస్ తయారు చేస్తున్న విధానం చాలా బాగుందని, వరంగల్‌లో కూడా త్వరలో ఈ పద్ధతిని అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టడీ టూర్ నిర్వహించడం చాలా బాగుందని అన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వరంగల్ రాంపూర్ డంపింగ్ యార్డ్‌ను హైదరాబాద్ తరహాలో ఉపయోగించి చెత్త నుంచి విద్యుత్, గ్యాస్ ఉత్పత్తి చేస్తామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ఈ శుక్రవారం రాంకీ ప్రతినిధులను రాంపూర్‌కు పిలిచి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, రాంకీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖ ఇంటి ముట్టడి

- హెచ్‌సీయూలో లాఠీచార్జ్‌కు నిరసన
- గేటు వద్ద బైఠాయించి విద్యార్థి సంఘాల ధర్నా

రాంనగర్/హనుమకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల కోసం పోరాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసనగా హనుమకొండలోని రాంనగర్‌లో రాష్ట్ర అటవీ పర్యవరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇంటిని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి నివాసం గేటు వద్ద విద్యార్థి సంఘాల నాయకులు బైఠాయించారు. కొండా సురేఖ, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతి రేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. సమాచారం అందుకున్న సుబేదారి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అక్కడి నుంచి స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపు మంత్రి నివాసం వద్ద పోలీసులకు, విద్యార్థి నాయకులకు తోపులాట జరిగింది.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ భూములను కార్పొరేట్, పెట్టుబడుదారులకు అప్పగించే విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. పర్యావరణాన్ని దెబ్బతీసే చర్యలను మానుకోవాలన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే భూములను వేలం వేసే పద్ధతిని మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బి.నరసింహరావ, మర్రి మహేశ్, మొగిలి వెంకట్‌రెడ్డి బాషబోయిన సంతోష్, మాలోత్ రాజేశ్, మంద నరేశ్, కుమ్మరి సాయినాద్, ఎల్త్రారి సాయికుమార్, శివనాస్తిక్, శివ, వంశీ, సాయి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను అరెస్టు చేస్తున్న సుబేదారి పోలీసులు



ఏనుమాముల మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

మార్కెట్‌కు పోటెత్తిన ఎర్రబంగారం

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం భారీగా మిర్చి అమ్మకానికి వచ్చింది. నాలుగు రోజుల సెలవుల అనంతరం మార్కెట్ పునఃప్రారంభం కావడంతో సుమారు 70 వేల మిర్చి బస్తాలు వచ్చాయి. దీంతో మార్కెట్ అంతా ఎటు చూసినా మిర్చి బస్తాలలో ఎర్ర తివాచీ పరిచినట్లు కనిపించింది. కాగా, తేజ రకం మిర్చి క్వింటాకు గరిష్ఠంగా రూ.12,800లు, వండర్‌హాట్ రూ.13,000లు, యూఎస్-341 రూ.11,500లు, డీడీ రకం మిర్చి రూ.12,500లు, దీపిక రూ.13,000లు, దేశీ రకం మిర్చి రూ.28,000లు సింగిల్‌పట్టీ రకం మిర్చికి రూ.28,011లు ధర పలికింది. అయితే ధరలు తక్కువగా ఉన్నాయంటూ రైతులు మిర్చిని కోల్డ్ స్టోరేజీలకు తరలించారు.

రాష్ట్ర వినియోగదారుల మండలిలో రంజిత్‌క చోటు



రావుల రంజిత్ కుమార్

హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వినియోగదారుల రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రావుల రంజిత్ కుమార్ నియమితులయ్యారు. కన్స్యూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జాతీయ కమిటీ అధ్యక్షురాలు ప్రీతి పాండ్య తెలంగాణ రాష్ట్ర కమిటీని బుధవారం ప్రకటించారు. అందులో వరంగల్ నుంచి రంజిత్ కుమార్‌కు చోటు దక్కింది. రంజిత్ 20 ఏళ్లుగా వినియోగదారుల చైతన్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నందుకు గుర్తింపుగా ఆయనకు ఈ అవకాశం దక్కింది.

పోయిన బంగారు గొలుసు అందజేత

గంట వ్యవధిలోనే ఛేదించిన సుబేదారి పోలీసులు



మహిళలకు పోగొట్టుకున్న బంగారు గొలుసును అందిస్తున్న సుబేదారి పోలీసులు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మహిళ బంగారు గొలుసు పోగా.. గంటలోనే పోలీసులు వెతికి ఇచ్చారు. గోకుల్‌నగర్‌కు చెందిన సహేరాబేగం అనే మహిళ ఉదయం నిత్యావసర వస్తువుల కోసం ఇంటి నుంచి కిరాణం షాపునకు వెళ్లి వస్తుండ గా మెడలో ఉన్న 30గ్రాముల బంగారు గొలుసు కనిపించకుండా పోయింది. దీంతో వెంటనే స్థానిక సుబేదారి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సుబేదారి సీఐ పి.సత్యనారాయణ రెడ్డి, ఎస్సై సుమన్, క్రైం కానిస్టేబుల్ మారెపల్లి ప్రభాకర్ వెంటనే స్పందించి చాకచక్యంతో వెతికి సహేరా బేగంకు గంట వ్యవధిలోనే అందజేశారు. పోలీసులు తెలిపారు. గొలుసు వెతికి ఇవ్వడంలో ప్రతిభ కనబర్చిన క్రైం కానిస్టేబుల్ మారెపల్లి ప్రభాకర్‌ను సీఐ పి.సత్యనారాయణ రెడ్డి అభినందించారు.

ఎరుపెక్కిన కడవెండి

- మావోయిస్టు నేత రేణుక అలియాస్ చైతుకు కన్నీటి వీడ్కోలు
- అంతిమయాత్రకు భారీగా హాజరైన జనం
- స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు
- ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలంటూ విప్లవకారుల డిమాండ్



కడవెండిలో రేణుక మృతి దేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రావు

దేవరుప్పుల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు గుమ్మడవెల్లి రేణుక అలియాస్ చైతు అలియాస్ భాను అలియాస్ సరస్వతి అంత్యక్రియలు బుధవారం ఆమె ఆమె స్వగ్రామమైన జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండిలో పూర్తయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన అంతిమయాత్రకు భారీగా పలు విప్లవ సంఘాలు, పార్టీల నాయకులు, అభిమానులు, సానుభూతిపరులు, ప్రజలు హాజరవడంతో కడవెండి గ్రామం మరోసారి ఎరుపెక్కింది. 1999లో కొయ్యూరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సంతోష్‌రెడ్డి అలియాస్ మహేష్ అంత్యక్రియల సందర్భంగా గ్రామమంతా ఎర్రజెండాలతో ఎరుపెక్కగా.. మళ్లీ ఇన్నేళ్లకు రేణుక అంత్యక్రియల సందర్భంగా మరోసారి ఎరుపెక్కింది. మంగళవారం దంతెవాడ నుంచి అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకుని బయల్దేరిన కుటుంబసభ్యులు అర్ధరాత్రి దాటాక స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రేణుక పెదనాన్న లక్ష్మీనర్సు, తండ్రి సోమయ్య, సోదరులు జీవీకె ప్రసాద్, రాజశేఖర్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులు,బంధుమిత్రులంతా నివాళులర్పించారు. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ మాజీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, నవ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకులు గాదె ఇన్నయ్య, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ మాజీ సభ్యులు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, జనగామ మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నేత సీహెచ్ రాజారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుల సింగారపు రమేష్, గద్దర్ కుమారుడు సూర్యం, వెన్నెల, రెడ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌కన్నా, పౌరహక్కుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, ప్రముఖ కవి, రచయిత జ్వాలాముఖి, అమరుల బంధు మిత్రుల సంఘం ప్రతినిధులు పద్మకుమారి, అంజమ్మ, లక్ష్మీ, శ్రీకాంతాచారి తండ్రి వెంకటాచారి, పీపుల్స్‌వార్, మావోయిస్టు మాజీ నేతలు రేణుక మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రేణుక పెదనాన్న లక్ష్మీనర్సు ఇంటి నుంచి రేణుక మృతదేహంతో ప్రారంభమైన అంతిమయాత్ర సాయంత్రం 4గంటల వరకు సాగింది. గ్రామస్థుల డప్పు చప్పుళ్లు, కోలాటం, విప్లవకారులు, ప్రజాసంఘాల నాయకుల ఆటపాటలతో గ్రామం మారుమోగింది. రేణుక అంత్యక్రియలకు సుమారు 3వేల నుంచి 4వేల మంది హాజరైనట్టు అంచనా. గ్రామ శివారులోని వాగు వద్ద రేణుక అంత్యక్రియలు జరుపగా ఆమె సోదరుడు జీవీకె ప్రసాద్ అలియాస్ ఉసెండి రేణుక చితికి నిప్పంటించారు.

తెలుగులో తోట శారదకు డాక్టరేట్



శారద

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకురాలు తోట శారద డాక్టరేట్ సాధించింది. ఈ మేరకు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల శారదకు డాక్టరేట్ ప్రకటించారు. 'ఐతా చంద్రయ్య సమగ్ర సాహిత్య పరిశీలన' అనే అంశంపై చేసిన పరిశోధన గ్రంథానికి శారదకు డాక్టరేట్ లభించింది. హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు జె.రమేశ్ పర్యవేక్షణలో శారద డాక్టరేట్ పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన శారద జాతీయ స్థాయి ఫెల్లోషిప్ సాధించింది.



సమావేశంలో మాట్లాడుతున్న గైనేని రాజన్

13న హైదరాబాద్‌లో మున్నూరుకాపుల సమావేశం

న్యూశాయంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13వ తేదీన హైదరాబాద్‌లోని జలవిహార్‌లో మున్నూరుకాపుల సమావేశం ఏర్పాటు చేసినట్లు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గైనేని రాజన్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్లు, అధ్యక్షుల సమావేశం జరిగిది. ఈ సమావేశంలో గైనేని రాజన్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మున్నూరుకాపు ప్రజాప్రతినిధులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన మన హక్కులను కాపాడేందుకు సంఘ బాధ్యులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని, గ్రామస్థాయి సంఘాల కమిటీల ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రతీ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో సమావేశానికి తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు పెంటయ్య, కనుకుంట్ల రవికుమార్, మధుసూదన్, సంపత్, సారంగపాణి, కుమారస్వామి, శ్రీధర్, సత్యనారాయణ, గోపన్న, పరమేశ్వర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ లిస్ట్‌లో రోహిణి ఆస్పత్రి

చికిత్స కోసం వెళ్లిన పేద రోగులకు అన్యాయం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిధులు పొందేందుకు గాను హనుమకొండ సుబేదారిలోని రోహిణి మెడికేర్ ప్రయివేట్ లిమిటెడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకులు ఆర్‌సీ నెంబరు 2529/సీఈఏ సెల్/2025ని విడుదల చేసింది. గతంలో సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల వ్యవహారంలో రాష్ట్రంలోని పలు ఆస్పత్రులలో తప్పుడు, అనుమానాస్పద బిల్లులు సమర్పించి కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణ జరిపించింది. హనుమకొండ జిల్లాలోని రోహిణి మెడికేర్ ప్రయివేట్ లిమిటెడ్ నకిలీ బిల్లులు అందించి మోసానికి పాల్పడినట్లు సీఐడీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. వెంటనే రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ సదరు ఆస్పత్రిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రద్దు చేయాలని, జరిమానా కూడా విధించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర సంచాలకులు ఆదేశం మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోకపోవడంతో పేద రోగులు ఆర్థికంగా నష్టపోయారు.

ఇదిలా వుండగా, హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బయ్యగాని శ్రీనివాస్ ఇటీవల వారం రోజులపాటు రోహిణి ఆస్పత్రిలో చికిత్స పొందారు. రూ.2 లక్షలకు పైగా బిల్లును రోహిణి ఆస్పత్రికి కట్టారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా, ఆ ఆస్పత్రి బ్లాక్‌లిస్టులో ఉన్నట్లు తేలిందని, కనీసం దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ గిరిజనుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి అత్యవసర సేవల కోసం రోహిణి ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యశ్రీ సేవలు వర్తించవని స్పష్టం చేసి నగదు కట్టించుకున్నారని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. రూ.1 లక్షా 50వేలు అప్పు చేసి మరి ఫీజు చెల్లించామని, తీరా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేస్తే బ్లాక్‌లిస్టులో ఉండటంతో దరఖాస్తునే స్వీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది రోహిణి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వందల రోగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలుస్తోంది.

సీఎం దృష్టికి తీసుకెళతాం..

సీఎం రిలీఫ్‌ఫండ్ జాబితాలో తమ ఆస్పత్రిని బ్లాక్ లిస్టులో పెట్టిన మాట వాస్తవమే. తమ ఆస్పత్రి పేరుతో మహబూబాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు తప్పుడు బిల్లులు సమర్పించి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి నిధులు పొందారు. ఈ వ్యవహారంతో మా ఆస్పత్రికి ఎలాంటి సంబంధం లేదు. కేవలం తమ పేరు వాడుకోవడం వల్లనే తమను బ్లాక్ లిస్టులో చేర్చారు. ఈ మొత్తం వ్యవహారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాం. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది. తిరిగి సీఎం రిలీఫ్‌ఫండ్ జాబితాలో చోటు దక్కుతుంది.

- డాక్టర్ సుధాకర్‌రెడ్డి, రోహిణి ఆస్పత్రి సూపరింటెండెంట్

పేదల హృదయాల్లో చిరస్థాయిగా రేవంత్‌రెడ్డి

- ఎన్టీఆర్‌లా ఆయననూ గుర్తుంచుకుంటారు..
- సన్నబియ్యం పంపిణీపై బీజేపీ చెప్పేవి అబద్ధాలు
- దమ్ముంటే దేశవ్యాప్తంగా అమలు చేసి చూపాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పంపిణీ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, ఎన్టీఆర్ తరహాలో ఆయన్ను చిరకాలం గుర్తుంచుకుంటారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ కలెక్టరేట్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌ఘడ్, చిల్పూరు, రఘునాథపల్లి మండలాలకు చెందిన కార్డుదారులకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఆయన సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. గతంలో రూ.2 కిలో బియ్యం ఇచ్చిన ఎన్టీఆర్‌ను ప్రతీ పేదలు ఇప్పటికీ మరిచిపోలేదని, అదే మాదిరిగా ఇప్పుడు సన్నబియ్యం ఇస్తున్న రేవంత్ రెడ్డిని కూడా మరిచిపోరన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. దొడ్డుబియ్యాన్ని పేదలు వినియోగించుకోకపోవడంతో దేశాలు దాటి అక్రమ రవాణా జరుగుతోందని, దీంతో ప్రజా పంపిణీ వ్యవస్థ ఉద్దేశ్యం నెరవేరడం లేదని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ వల్ల పెద్దవాళ్లు, పేదవాళ్లు అందరూ సమానంగా తినబోతున్నారని అన్నారు. సన్నబియ్యం పంపిణీతో అక్రమ రవాణా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 90 లక్షలకు కార్డులకు గానూ 2.81 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. దరఖాస్తులు చేసుకున్న మరో 10 లక్షల మందికి కార్డులను అందిస్తామని తెలిపారు.

మొత్తంగా కోటి కార్డులకు సంబంధించి 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందుతాయన్నారు. సన్నబియ్యాన్ని తామే ఇస్తున్నామంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీకి రూ. 13,500 కోట్లు కాగా ఇందులో రాష్ట్ర వాటా రూ. 8000 కోట్లు, కేంద్రం వాటా రూ. 5500 కోట్లు అని స్పష్టం చేశారు. బీజేపీకి పేదలకు ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీని చేపట్టాలని సవాల్ విసిరారు. బీజేపీ నేతలు చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సన్నబియ్యానికి కూడా కిలో రూ. 25 ఆశచూపి ఎవరైనా పక్కదారి పట్టించే అవకాశం ఉందని, ఈ విషయంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఆర్డీవోలు డీఎస్ వెంకన్న, గోపీరామ్, ఇంఛార్జ్ డీఎస్‌వో ఇర్ఫాన్, సివిల్ సప్లై డీఎం హథీరామ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కేయూలో రిటైర్డు ఉద్యోగులపై తొలగింపు కత్తి

విధులకు రావొద్దంటూ మౌఖిక ఆదేశాలు జారీ

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో రిటైర్డుమెంట్ పొంది మళ్లీ తాత్కాలిక పద్ధతుల్లో వర్సిటీ ద్వారా వేతనం తీసుకుంటూ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల తొలగింపు ప్రక్రియను ఉన్నతాధి కారులు వేగవంతం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అన్ని విభాగాల్లో రిటైరై మళ్లీ పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించింది. రిటైర్డుమెంట్ పొంది విధుల నిర్వహించే వారందరినీ వెంటనే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి అన్ని శాఖాలకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో వర్సిటీలో పని చేస్తున్న రిటైర్డుమెంట్ పొంది ఉద్యోగులను విధులకు రావొద్దంటూ వర్సిటీ ఉన్నతాధికారులు సంబంధిత విభాగాల ఇన్‌చార్జ్‌లతో బుధవారం మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. గురువారం అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

నిర్వాహకురాలితో పాటు నలుగురు విటులు అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోస్టల్‌కాలనీలో ఓ మహిళ నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు చేసి నిర్వాహకురాలితో పాటు నలు గురు విటులను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. పోస్టల్‌కాలనీలో కొంతకా లంగా ఓమహిళ..ఇంటిని కిరాయితీసుకొని ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తోంది. పక్కా సమాచారంతో బుధవారం దాడులు జరిపగా వేలేరు మండలం షోడశపల్లికి చెందిన నిర్వాహకురాలు తిమ్మాపురం లలితతోపాటు నలుగురు విటులను ఆదుపులోకి తీసుకొని రూ2,450 నగదును స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు. ఈ దాడిలో ఇద్దరు మహిళలను వారి నుంచి కాపాడామన్నారు.

గుండ బ్రహ్మయ్య జాతర ఘర్షణలో 8మంది అరెస్టు

వివరాలు వెల్లడించిన మామునూరు ఏసీపీ తిరుపతి



అరెస్టు చూపుతున్న మామునూరు ఏసీపీ తిరుపతి

సంగెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం రోజున సంగెం మండలంలోని గవిచర్లలో యువకుల మధ్య జరిగిన ఘర్షణలో మృతి చెందిన చిర్ర బన్నీ మృతికి కారణమైన వారిని అరెస్టు చేసినట్లు మామునూరు ఏసీపీ తిరుపతి చెప్పారు. బుధవారం రాత్రి సంగెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన 8 మంది నింది తులను విలేకరుల ముందు హాజరుపర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగాది రోజున గ్రామంలో జరిగిన గుండ బ్రహ్మయ్య జాతరలో కుంటపల్లికి చెందిన చిర్ర బన్నీ సిగరెట్ తాగుతుండగా ఏర్పడిన వివాదం ఆయన మృతికి దారితీసింది. సిగరేట్ పొగ వాసన వస్తోంది.. దూరం వెళ్లమని బన్నీని గవిచర్ల గ్రామానికి చెందిన వేల్పుల సిద్ధు అన్నాడు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం సిద్ధు తన బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో సంగెం నుంచి ఆటో, ద్విచక్రవాహనాలపై వచ్చిన వారు బన్నీని తీవ్రంగా కొట్టారు. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చికిత్స నిమిత్తం తరలించగా మృతిచెందాడు. ఇందుకు కారకులైన గుండేటి సునీల్, వేల్పుల సిద్ధు, గుండేటి మహేందర్, గుండేటి కొమ్మాలు, గుండేటి రాజు, మెట్టుపల్లి భరత్, గుండేటి రాజ్‌కుమార్, మెట్టపల్లి చిన్న భరత్‌తో పాటు గుండేటి కార్తీక్‌లను అరెస్టు చేశారు. వీరంతా పర్వతగిరి మండలం శ్రీనగర్ క్రాస్ రోడ్డు గల మామిడి తోట వద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరిలో గుండేటి కార్తీక్ పరారీలో ఉన్నాడు. వీరి వద్దనుంచి ఒక ఆటో, రెండు ద్విచక్రవాహనాలు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని ఆదేరోజు అరెస్టు చేసినట్లు ఏసీపీ వివరించారు. పరారైన కార్తీక్ కోసం గాలింపు చేస్తున్నట్లు చెప్పారు. సంఘటన జరిగిన రెండు రోజుల్లో పర్వతగిరి సీఐ రాజగోపాల్ నేతృత్వంలో సంగెం ఎస్సై నరేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది కేసును ఛేదించారని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాజీపేట పీఎస్ పరిధిలోని 100 ఫీట్ల రోడ్డులో ఓ షాపులో పేకాటడుతున్న ఏడుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని రూ.27,950 నగదు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7150	5300
మక్కలు (బిల్టీ రకం)	2187	1521
కందులు	6605	3022
పెసళ్లు	7851	3022
పల్లికాయ (సూక)	5900	5200
పల్లికాయ (పచ్చిది)	4850	4575
పసుపు (కాడి)	12359	10534
పసుపు (గోల)	11359	9700
తేజ మిర్చి	12800	9500
వండర్‌హాట్	13000	10000
యూఎస్341	11500	9000
దీపిక	13000	10000
దేశీ	28000	18000
సింగిల్ పట్టి	28011	20000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం



రత్నగిరి గ్రామంలోని తాటి చెట్లు

పిల్లలను చదివించడం భారంగా మారింది



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. నా భర్త వంగ రమేష్ ఆరు సంవత్సరాల క్రితం గీత వృత్తి చేస్తూ తాటి చెట్టుపై నుంచి పడి మరణించాడు. ప్రభుత్వం రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించిన అవి అప్పులకు, ఇతర ఖర్చులకే సరి పోయాయి. ప్రభుత్వం మాలాంటి వారికి ఉపాధి కోసం ఏమైన పథకాలు ప్రవేశపెట్టాలి. నా బిడ్డలను చదివించేందుకు కూలీ పనులు చేస్తున్నా.

- వంగ రమ, మరణించిన గీత కార్మికుడి భార్య, రత్నగిరి

గౌడన్నల ప్రాణాలు.. గాలిలో దీపాలు!

గీత వృత్తిలో నిలిచి ప్రమాదాల బారిన పడుతున్న వారెందరో..



గట్లనర్సింగాపూర్‌లో మరణించిన గీత కార్మికుడు కొక్కిస రాజు (ఫైల్)

- హనుమకొండ జిల్లాలో మూడేళ్లలో 15మంది మృతి, 25మందికి వైకల్యం
- కాలం కలిసి రాక కూలీలుగా మారుతున్న గౌడన్నలు
- ప్రభుత్వమిచ్చే ఎక్స్‌గ్రేషియా ఎటూ చాలడం లేదని ఆవేదన
- రూ.10లక్షల పరిహారం ప్రకటన.. హామీలకే పరిమితం

భీమదేవరపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం చేస్తున్న గీత వృత్తి గౌడన్నల పాలిట శాపంగా మారింది. గౌడన్నల బతుకులు గాలిలో దీపంలా మారాయి. ఉదయం బతుకుదెరువు కోసం తాటిచెట్లు ఎక్కేందుకు వెళ్తున్న గౌడన్నలు తిరిగి ఇంటికి వస్తారో లేరోనన్న ఆందోళన ఆ కుటుంబ సభ్యులను వెంటాడుతోంది. ఎప్పుడు ఏ దుర్వార్త వినాల్సి వస్తుందోనన్న భయం.. భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లాడని తెలిసి ఆ ఇల్లాలి రోదనలు.. మూడు పదుల వయసులోనే వైదవ్యం పొందుతున్న అతివలు.. శాశ్వత అంగ వైకల్యంతో బాధపడుతున్న కార్మికులు ఇలా ఎన్నో సవాళ్లు, సమస్యలు, భయాల మధ్య గీతన్నలు జంకుతున్నారు. తమ వృత్తికి రాంరాం పలికి కూలీలుగా మారుతున్నారు. కుటుంబ సభ్యులకు పట్టెడు అన్నం పెట్టేందుకు బతుకు పోరాటం చేస్తున్న గౌడన్నలు వృత్తి కలిసి రాక కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. చనిపోయిన గౌడన్నకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఎన్నాళ్లకు వస్తుందో తెలియని దుస్థితి ఉండగా.. ఆ పరిహారాన్ని రూ. 10లక్షలకు పెంచుతామని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయింది. వడ కల్లు, పొద్దాడు, పరుపుతాడు, పండుతాడు, కర్ర కల్లు ఇలా రకరకాల సీజన్లల్లో దొరికే తాటి చెట్ల కల్లు కల్లు ప్రియులకు విందులు చేస్తున్నాయి. పొద్దాడు సమయంలో అర్ధరాత్రి వరకు కల్లు నీర, వడ కల్లును కల్లు ప్రియులు ఆస్వాదిస్తూంటారు. కానీ పంటి దిగువన బాధను భరిస్తూ కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతున్న బాధను భరించుకుంటూ గౌడన్నలు గీత వృత్తిని చేస్తున్నారు. గాలి వచ్చిన, దుమారం కలకలం రేపినా.. వర్షం పడ్డా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని వృత్తిని కొనసాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తాటి చెట్లను గీస్తూ జీవనం గడుపుతున్న గీతన్నలకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న బతుకు పోరాటంలో గౌడన్నలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ముందుకు సాగుతున్నారు. మూడు సంవత్సరాల్లో 15మంది గౌడన్నలు వృత్తిలో భాగంగా చనిపోయారు. వీరికి రూ. 5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను రూ. 50 లక్షలు చెల్లించారు. మరో రూ. 25లక్షలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అలాగే 25మంది వైకల్యం పొందినట్టు అధికార వర్గాలు తెలుపుతున్నాయి. వీరికి రూ.70లక్షలువచ్చినా మరికొంత నిధులు రావాల్సి ఉంది. ఆ డబ్బుల కోసం వైకల్యం పొందిన గౌడన్నలు ఎదురు చూస్తున్నారు. మరణించిన గౌడన్నకు రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా సరిపోవడం లేదని గతంలో కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేసింది. తాము అధికారంలోకి వస్తే దీనిని రూ.10లక్షల వరకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గీతన్నలు వృత్తి కలిసి రాక చనిపోతుండడంతో పలువురు గీతన్నలు గౌడ వృత్తిని వదిలేసి కూలీలుగా మారిపోతున్నారు.

కొందరికే కాటమయ్య కిట్లు..

గీతకార్మికులు చెట్లు ఎక్కిన సమయంలో ఎలాంటి ప్రమాదాలకు గురవకుండా ఉండేలా రక్షణ కిట్లను ఇచ్చింది. కాటమయ్య కిట్ల పేరుతో వాటిని పంపిణీ చేస్తోంది. కానీ ఉమ్మడి జిల్లాలో అవి పూర్తిస్థాయిలో అందలేని, కొందరికి మాత్రమే వచ్చాయని తెలుస్తోంది. పూర్తి స్థాయిలో కాటమయ్య కిట్లు అందజేయాలని గౌడన్నలు కోరుతున్నారు. కాటమయ్య కిట్ల ద్వారా చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చని భావిస్తున్న ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అందజేయాలని కోరుతున్నారు.



తాటి చెట్లు ఎక్కుతున్న గీత కార్మికులు

రూ. 10లక్షలకు ఎక్స్‌గ్రేషియా పెంచాలి



గీత వృత్తి చేస్తూ మరణించిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న వారు మరణిస్తే రూ. 5లక్షలు ఇస్తున్నారు. పెరిగిన ఖర్చులకు వారి కుటుంబాలను పోషించాలంటే ఆ డబ్బులు సరిపోవడం లేదు. మాలాంటి వారు గీత వృత్తిని వదిలేసి పెట్రోల్ బంక్‌లు, హోటళ్లల్లో పని చేస్తున్నారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెలిస్తే ఆ కుటుంబాలకు కొంత న్యాయం జరుగుతుంది.

- వంగ రమేష్, గీత కార్మికుడు, రత్నగిరి

ఎక్స్‌గ్రేషియా కోసం ఎదురు చూపు



నా భర్త కొక్కిస రాజు తాటి చెట్టుపై నుంచి పడి గత నెల రోజుల క్రితం మరణించాడు. నా భర్త తెచ్చే డబ్బులతోనే మా కుటుంబం గడిచేది. నాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వారిని చదివించాలన్న నాకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ప్రభుత్వం నాలాంటి వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి మా కుటుంబాలను ఆదుకోవాలి. మాకు ఎలాంటి స్థిరచరాస్తులు లేవు.

- కొక్కిస స్వప్న, మరణించిన గీత కార్మికుడి భార్య, గట్లనర్సింగాపూర్

కాళేశ్వరం అభివృద్ధిపై సర్కారు ప్రత్యేక దృష్టి

- మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో ప్రణాళికలు
- గోదావరి పుష్కరాలకు రూ.150కోట్ల ప్రతిపాదనలు
- కాశీ, శ్రీశైలం తరహాలో తీర్చిదిద్దేందుకు చర్యలు



కాళేశ్వరం ఆలయంలోని లింగాలు

మహదేవపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో కాశీ, శ్రీశైలం క్షేత్రాలకు దీటుగా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మే 15వతేదీ నుంచి ప్రారంభమయ్యే సరస్వతీ పుష్కరాలకు రూ.25కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం.. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు కనీవినీ ఎరుగని రీతిలో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వీఐపీ ఘాట్ నుంచి మెయిన్ ఘాట్ వరకు కిలోమీటరు మేర పుష్కరఘాట్‌ను నిర్మించనుంది. దీంతో పాటు కాళేశ్వరం నలువైపులా రోడ్ల విస్తరణ, కాటేజీల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.150కోట్లు వెచ్చించినట్టు తెలుస్తోంది. ఏపీలోని రాజమండ్రి పుష్కరఘాట్‌ను మరిపించేలా కాళేశ్వర శైవక్షేత్రాన్ని ఆకర్షణీయంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి శ్రీధర్ బాబుతో పాటు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించారు. నిధులు మంజూరు చేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంపై దృష్టి పెట్టారు. తెలంగాణలో గోదావరి నది 700 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుండగా అందులో కాళేశ్వర శైవక్షేత్రం అత్యంత ప్రసిద్ధిగాంచింది. త్రివేణి సంగమ క్షేత్రంగా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న ఈ ప్రముఖ క్షేత్రాన్ని గోదావరి పుష్కరాల సందర్భంగా కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. వారికి ఎలాంటి ఎలంటి అసౌకర్యం లేకుండా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో కీలక మంత్రిత్వ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీధర్‌బాబు తన సొంత నియోజకవర్గంలోని కాళేశ్వరాన్ని భారీ అంచనాలతో ఆధ్యాత్మిక క్షేత్రంతో పాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. దీంతో కాళేశ్వరాలయానికి మహర్దశ రానుంది.

మామునూరు ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం చేయాలి

కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు ఎంపీ కావ్య విజ్ఞప్తి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ కావ్య

హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మామునూరు ఎయిర్ పోర్టు పనులను వేగవంతం చేయాలని, వీలైనంత త్వరగా పెద్ద విమానాలు నడిచేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడిని కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు అభివృద్ధికి ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులను, ఉయిర్‌క్రాఫ్ట్ కార్యకలాపాలను వేగవంతం చేయాలని కోరారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని అన్నారు. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ205 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన మౌలిక సదుపాయాలను, పెద్ద విమానాలను నడిపేందుకు కార్యాచరణను త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని ఎంపీ కోరారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు వరంగల్ విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు, భూసేకరణ అనంతరం విమాన రాకపోకలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.



ఎల్కతుర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలు

రజతోత్సవ సభతో రాజకీయాల్లో పెను మార్పులు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎల్కతుర్తిలో సభ నిర్వహణ పనుల ప్రారంభం
- హాజరైన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులు

ఎల్కతుర్తి, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభతో రాజకీయాల్లో పెను మార్పులు జరుగునున్నట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాటు సభాస్థలి పనులకు మంత్రితో పాటు హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సభ పర్యవేక్షకుడు తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. దేశంలోనే జరగని విధంగా అతి పెద్ద మహాసభ ఎల్కతుర్తిలో జరగబోతోందన్నారు. నాడు కేసీఆర్ పాలనలో ప్రజలు తాగు, సాగునీరు, కరెంట్‌కు ఎలాంటి కష్టం లేకుండా ఉన్నారని, నేడు కాంగ్రెస్ పాలనలో అరిగోస పడుతున్నారని మండిపడ్డారు.కేసీఆర్‌ను ఎందుకు పోగొట్టుకున్నామనే బాధ ప్రజల్లో బలంగా ఉందన్నారు. సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధనే ధ్యేయంగా ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. మూడు జిల్లాలకు ముఖద్వారమైన ఎల్కతుర్తి బీఆర్ఎస్ పండుగకు వేదికైందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధమైన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. 14 యేళ్ల పాటు కొట్లాడి సాధించుకున్న తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థాయికి తీసుకువచ్చారన్నారు. 15 నెలలుగా కాంగ్రెస్ అసమర్థ పాలనపై బీఆర్ఎస్ కొట్లాడుతోందన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన పార్టీ రజతోత్సవ సభను హనుమకొండ జిల్లాపరిధిలోఏర్పాటు చేసుకోవడం సంతోషమన్నారు. మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభను తన నియోజకవర్గంలోని ఎల్కతుర్తిలో నిర్వహించడం గర్వకారణమని అన్నారు. పార్టీ రజతోత్సవ సభకు కుంభమేళా తరహాలో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరానున్నట్లు తెలిపారు. సభ నిర్వహణకు భూములు ఇచ్చిన చింతలపల్లి గ్రామ రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.


మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షలకు పైగా ప్రజలు తరలిరానున్నట్లు తెలిపారు. 160 ఎకరాల్లో సభ నిర్వహణ, 1600 ఎకరాల్లో పార్కింగ్ కోసం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభకు తరలి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అభివృద్ధిలో ఓరుగల్లుకు ప్రముఖ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. 27న నిర్వహించే సభను సమర్థవంతంగా పూర్తి చేస్తామన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో జరిగిన ఐదు సభల్లో ఒక సభ గతంలో వరంగల్‌లో జరిగిందన్నారు. దాన్ని మించిన సభ మరోసారి ఎల్కతుర్తిలో జరగనుందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, వాసుదేవ రెడ్డి, సతీష్‌రెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ సుధీర్‌కు మార్, మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, నాయకులు వొడితెల ఇంద్రనీల్, రాకేష్‌రెడ్డి, కడారిరాజు, రవీందర్‌గౌడ్, మేకల స్వప్న, రవీం దర్‌రెడ్డి, నగేష్, మహేందర్, చిట్టి, కొరె రాజ్‌కు మార్, వీరలింగం, మహేందర్, మదన్‌మోహన్ రావు, శ్రీనివాస్, స్వామి, వెంకటేష్‌యాదవ్, డుకిరే రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేతన.. వెతలు!

ఏడాదిగా జీతాల్లేక ధరణి ఆపరేటర్ల పస్తులు





- ఏజెన్సీ రద్దుతో టీజీటీఎస్‌కు అటాచ్
- ప్రభుత్వం నుంచి నేరుగా చెల్లింపు ప్రతిపాదన
- ఆదేశాలు రాక వేతనాలు ఆగిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 78మంది ఆపరేటర్లు.. రూ.కోటికి పైగా బకాయి
- బాధలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం

హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కాలంగా వేతనాలు ధరణి ఆపరేటర్లు వెతలు పడుతున్నారు. జీతాల కోసం ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుంచి స్పందన ఉండటం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలిసి గోడు వెళ్లబోసుకుని వినతి పత్రాలను సమర్పించినా.. చివరికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా.. త్వరలోనే చెల్లిస్తామన్న మాటే తప్ప ఇప్పటి వరకు జీతాలు మాత్రం అందలేదు. నాలుగు నెలల వేతనాలకు సంబంధించి బిల్లులు తయారయ్యాని చెబుతున్నారు కానీ వాటి విషయమై కూడా స్పష్టత లేదు. ఏడాదిగా వేతనాలు రాక ధరణి ఆపరేటర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తమ కుటుంబాలు పస్తులుండే పరిస్థితి ఏర్పడిందని ఆపరేట్లు దిగాలు చెందుతున్నారు.

టీజీటీఎస్‌కు అటాచ్

గతంలో టెరాసిస్ అనే థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా ధరణి ఆపరేటర్లకు వేతనాలు అందేవి. గత సంవత్సరం జనవరిలో ఆ ఏజెన్సీ కాంట్రాక్టు కాలం ముగిసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఏజెన్సీ గడువును పెంచకుండా పక్కనబెట్టింది, ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆరేళ్లుగా పని చేస్తున్న ఆపరేటర్లను తెలంగాణ ప్రభుత్వ టెక్నికల్ సర్వీసెస్ (టీజీటీఎస్)కు అటాచ్ చేసింది. ఇక నుంచి దీని ద్వారానే వేతనాలు చెల్లించనున్నట్టు తెలిపింది. ధరణి ఆపరేటర్లుగా పని చేస్తున్న వారి వివరాలను దానికి అందజేసింది. గతేడాది ఫిబ్రవరి నుంచి టీజీటీఎస్ ద్వారా తమకు వేతనాలు వస్తాయని ఆశ పడిన ఆపరేటర్లకు చివరికి ఎదురుచూపులే మిగిలాయి. ఇదిగో ఇస్తాం... అదిగో ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదు. దీంతో ధరణి ఆపరేటర్ల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలక చందంగా మారింది. థర్డ్ పార్టీ ఏజెన్సీ కింద ఉన్నప్పుడు నెలనెలా వేతనాలు వచ్చేవి. ఇప్పుడు రాకపోగా ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అసలు తాము ఉన్నట్టా? లేనట్టా అన్న సందే హంలో ఆపరేటర్లు కొట్టుమిట్టాడుతు న్నారు. మొదట్లో వీరిని తొలగించాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినా తర్వాత మనసు మార్చుకుని.. కొత్తవారిని నియ మించే బదులు వారినే కొనసాగించాలన్న నిర్ణయానికి వచ్చింది. థర్డ్ పార్టీ ఏజెన్సీ నుంచి నేరుగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని టీజీటీఎస్‌కు తమను అటాచ్ చేయడంతో ధరణి ఆపరేటర్లు ఒకింత సంతోషించారు. భవిష్యత్తులో తమ సర్వీస్ రెగ్యులర్ అవుతుందని ఆశపడ్డారు. వేతనాలు కూడా పెరుగుతాయను కున్నారు. కానీ వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. అసలు వేత నాలే రావడం నిలిచిపోయింది. ఏం చేయాలో తెలియని అనిశ్చి త పరిస్థితిని వారు ఎదుర్కొంటున్నారు. వేతనాల గురించి ప్రభుత్వాన్ని గట్టిగా అడిగేట్టు కూడా లేదు. ఒత్తిడి తెస్తే సర్కార్ కు ఎక్కడ కోపమొచ్చి ఉన్న ఉద్యోగం ఎక్కడ ఊడుతుందోనని భయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 78 మంది:

ప్రతీ మండలానికి ఒక ఆపరేటర్ చొప్పున ఉమ్మడి జిల్లాలో 78 ధరణి ఆపరేటర్లు ఉన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా కోఆర్డినేటర్ హోదాలో ఒక్కో ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కలెక్టరేట్లలో కోఆర్డినేటర్‌తో పాటు ఆయనకు సహాకులుగా ఇద్దరేసి ఆపరేటర్లు (బఫర్స్) ఉండేవారు. ఇప్పుడు వారు కూడా లేరు. ధరణి ఆపరేటర్లకు ఇచ్చే వేతనం కూడా చాలా తక్కువ. వారికి ప్రస్తుతం నెలకు రూ. 11,500 చొప్పున చెల్లిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆరేళ్ల క్రితం వీరి నియామకం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 675 మంది ప్రస్తుతం పని చేస్తున్నారు. మొదట్లో వీరికి రూ.10వేల చొప్పున చెల్లించేది. ధరణి కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమితులైనవారిలో అత్యధికులు ఇంజనీరింగ్ పట్టభద్రులే. అయినప్పటికీ ప్రభుత్వం భవిష్యత్తులో వేతనాలు పెంచుతుందనే ఆశతో విధులో చేరారు. ఏడాదిగా వేతనాలు రాకపోవడంతో కొంతరు ఆపరేటర్లు మరో దారి లేక పీఎఫ్ డబ్బు డ్రా చేసుకోని జీవితాలను వెళ్లదీస్తున్నారు.

ఆరేళ్ల క్రితం..

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అన్ని మండలాల్లో తహసీల్దార్లకు, సంయుక్త సబ్ రిజిస్ట్రార్లుగా అదనపు బాధ్యతలను అప్పగించి, వ్యవసాయ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల విధులు కూడా వారికే కేటాయించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేసి పరికరాలను సమకూర్చి ఆపరేటర్లను నియమించింది. అప్పటి నుంచి తర్డ్ పార్టీ ఎజెన్సీ ద్వారా వీరు పని చేస్తున్నారు.

వెట్టిచాకిరీ

చాకిరి బారెడు, జీతం బెత్తెడు అన్న చందంగా ఉంది ధరణి ఆపరేటర్ల పరిస్థితి. వీరు ధరణి పోర్టల్‌ను ఆపరేట్ చేయడమే కాకుండా తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లను, ఎన్నికలు, సర్వే వివరాలు ఇతరత్రా సర్వే డాటా నమోదు తదితర పనులను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తున్నవీరు అవసరమైతే రాత్రి పొద్దుపోయే వరకు కూడా పని చేయాల్సివస్తోంది. పైగా మండలానికి ఒక్క ఆపరేటరే ఉండడంతో అత్యవసర పని ఉన్నప్పుడు, లేదా అనారోగ్యానికి లోనైప్పుడు సెలవు పెట్టాల్సి వస్తే ప్రత్యామ్నాయం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒక మండలం ఆపరేటర్ సెలవు పెడితే పక్క మండలం ఆపరేటర్ ఆయన విధులు నిర్వహించాల్సి వస్తోంది.

రూ.1.07కోట్ల బకాయిలు

ఒక్కో ఆపరేటర్‌కు రూ.1,38,000 వేతన బకాయిలు రావలసి ఉంది. మొత్తంగా 78 మంది ఆపరేటర్లకు రూ. 1,07,64,000 మేర బకాయి ఉంది. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. ఏడాదిపాటు వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ధరణి ఆపరేటర్లు వాపోతున్నారు. ప్రతీ నెల వేతనాలను అందించాలని గతంలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాము. గత్యంతరం లేక బయట, ఇతరుల వద్ద అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. 2021 జూన్‌లో వచ్చిన జీవో-63 ప్రకారం తమ వేతనాలు రూ. 31,040కు పెంచాలని కోరుతున్నారు. మహిళా ఆపరేటర్లకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నారు.

వరంగల్ చపాట మిర్చికి జీఐ ట్యాగ్

జారీ అయిన సర్టిఫికెట్

హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ చపాట మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ సర్టిఫికెట్ జారీ అయింది. నాలుగేళ్ల కిందట ఈ మేరకు చేసిన కృషికి ఇప్పుడు ఫలితం దక్కింది. వరంగల్ జిల్ల దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలోని తిమ్మంపేట చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ పేర కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీకి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ఈ సర్టిఫికెట్‌ను అందచేసింది. నర్సంపేట ప్రాంతంలో పండుతున్న చపాట మిర్చికి జీఐ ట్యాగ్ లభించడంతో ప్రపంచస్థాయి గుర్తింపు లభించినట్లయింది. జీఐ గుర్తింపు వల్ల భవిష్యత్తులో చపాట మిర్చికి మంచిధర లభించడమే కాక అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ చేసుకునే అవకాశం కూడా లభిస్తుంది. నాలుగేళ్ల కిందట నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన చపాట మిర్చి ఎఫ్‌పీవోలు ఈ జీఐ ట్యాగ్‌తో సత్ఫలితాన్ని అందుకోగలిగాయి. అంతేకాకుండా వాటికి అంతర్జాతీయ గౌరవం కూడా దక్కింది. చపాట మిర్చికి జీఐ ట్యాగ్ సర్టిఫికెట్ లభించినందుకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చపాట మిర్చి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్యేగా చేసిన కృషి నేడు గొప్ప ఫలితాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. జీఐ ట్యాగ్ సర్టిఫికెట్ లభించడానికి కృషిచేసిన అప్పటి వ్యవసాయాధికారులకు, ఎఫ్‌పీవో సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జీఐ ట్యాగ్ వల్ల ఒనగూరే సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



చపాట మిర్చికి జారీ అయిన జీఐ ట్యాగ్ సర్టిఫికెట్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. బుధవారం గోపాల్‌పూర్, జీలుగుల, దండెపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వ్యాధి నిరోధక టీకాల అమలును పక్కాగా నిర్వహించాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవన నిర్మాణాన్ని పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌ను త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి విజేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సంపత్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

▸▸ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని ఆయన నివాసంలో మహాసభ ఏర్పాట్ల కోసం హసన్‌పర్తి మండలంలోని 13 డివిజన్ల ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలంలోని 13 డివిజన్ల ఇన్‌చార్జ్‌లు, అధ్యక్ష, కార్యదర్శులు జన సమీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు లలితాయాదవ్, మాజీ కార్పొరేటర్ వీర భిక్షపతి, రాష్ట్ర నాయకులు ఎల్లావుల కుమార్ యాదవ్, వర్ధన్నపేట 13 డివిజన్ల ఫోరం అధ్యక్షుడు నేరెళ్ల రాజు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే దేశ భక్తులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన హనుమకొండ సీపీఐ మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ రక్షణ కోసం దేశ భక్తులుగా కమ్యూనిస్టు పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మహిళలు, గిరిజనులు, అమాయకులను ఎన్‌కౌంటర్ చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి మద్దెల మల్లేశం, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి, లక్ష్మణ్, రమాదేవి, రాజుగౌడ్, సారంగపాణి, దుర్గాప్రసాద్, షేక్ బాబు, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు. కాగా, మే 26, 27న హసన్‌పర్తిలోని సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించారు. హనుమకొండ జిల్లా సీపీఐ మహాసభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడిగా మోతె లింగారెడ్డి, అధ్యక్షుడిగా నేదునూరి రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా జ్యోతి, చీఫ్ ప్యాట్రన్లుగా ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మిని ఎన్నుకున్నారు. వీరితో పాటు 15 మంది ఉపాధ్యక్షులు, 15 మంది కార్యవర్గ సభ్యులు, 25 మంది కమిటీ సభ్యులతో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు.

ఆత్మగౌరవ యుద్ధ ప్రతీక సర్దార్ పాపన్న

▸▸ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బహుజన వీరుడు, ఓరుగల్లు పోరు బిడ్డ, ఆత్మగౌరవ యుద్ధ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, వారి ఆశయాలను కొనసాగించాలని హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక సాధారణ కులంలో జన్మించి ఆధిపత్య కులాల అధికారాన్ని ధిక్కరించి దళిత, బహుజనులను రాజ్యాధికారంవైపు నడిపిన తొలి బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. పాపన్న స్ఫూర్తిదాయక పోరాటం ముందు తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం, వర్గం, జాతి, సమాజ విచ్ఛిన్నకర అంశాలను పక్కన పెట్టి బహుజన రాజ్యాధికారం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జనార్ధన్‌గౌడ్, పులి రజినీకాంత్, సల్వాజి రవీందర్‌రావు, ఇమ్మడి లోహిత, రాజు, పున్నం చందర్, రఘు, ఖలీల్, శ్రీనివాస్, రాజు, జేకే, వసంత్, దేవమ్మ, సంపత్, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

హనుమకొండ కలెక్టరేట్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై.వీ గణేష్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డీఆర్‌వో మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శమని, పాపన్న బహుజనుల కోసం ఎంతో పోరాటం చేశారన్నారు. వర్ధంతి కార్యక్రమంలో డీఆర్‌డీవో మేన శ్రీను, డీడీ డీటీవో శ్రీనివాస్‌కుమార్, ఇతర ప్రభుత్వ అధికారులు, జిల్లా గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఆర్‌వో వైవీ గణేష్

డంప్ యార్డు నిర్మూలన దీక్షకు అనుమతివ్వండి

మడికొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మడికొండ, రాంపూర్, పరిసర ప్రాంతంలో ఉన్న డంప్ యార్డు నిర్మూలన కోసం చేస్తున్న పోరులో భాగంగా అడ్‌హక్ కమిటీ సభ్యులు బుధవారం కాజీపేట ఏసీపీ తిరుమల్‌ను కలిసి ఈనెల 7 నుంచి 9 వరకు చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌ను కలిసి డంప్ యార్డు సమస్య తీవ్రతను వివరించారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలియజేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపట్టాలి

▸▸ మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర ప్రజలకు నీటి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. బుధవారం వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌తో పాటు వడ్డెపల్లి 1000 ఎంఎల్‌డీ డయా పైప్‌లైన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడిపికొండ, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల పైప్‌లైన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాంపూర్, ఖిలావరంగల్ ప్రాంతాల్లో నీటి సరఫరాలో ఇబ్బందులు జరుగుతున్నట్టు ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని, ఇకపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. లీకేజీలను అరికట్టి నగరంలో అన్ని ప్రాంతాల ప్రజలకు మంచినీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు మహేందర్, శ్రీనివాస్, రవికుమార్, సంతోష్‌బాబు, మాదవిలత, డీఈలు సారంగం, కార్తీక్‌రెడ్డి, ఏఈలు రామప్ప, ముజామిల్, మేనకలు పాల్గొన్నారు.



రాంపూర్ ప్రాంతంలో పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

వరంగల్ కార్పొరేషన్ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇటీవల ఆమోదించిన పనులకు టెండరు ప్రక్రియ పూర్తిచేసి పనులను ప్రారంభించాలని అన్నారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. బల్దియా వ్యాప్తంగా తాగునీరు, వీధిదీపాల సమస్య రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు మహేందర్, సంతోష్‌బాబు, రవికుమార్, మాధవీలత, డీఈలు సారంగం, రోజారాణి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

మడికొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పలు ప్రాంతాల్లో అనేక దొంగతనాలకు పాల్పతున్న అంతర్‌రాష్ట్ర దొంగను మడికొండ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం స్థానిక ఆర్ఎస్ఆర్ గార్డెన్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తి తారసపడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతని వద్ద సుమారు 60 గ్రాముల విలువ గల బంగారు చైన్, డైమండ్ లాకెట్ చైన్, నల్లపూసల దండ దొరికాయి. మడికొండ పోలీస్ స్టేషన్‌తో పాటు మట్వాడ, కేయూసీ, కరీంనగర్ రూరల్, సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీస్‌స్టేషన్ పరిధుల్లో దొంగతనాలు చేసినట్లు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకున్నాడు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సీఐ కిషన్, ఎస్సై రాజ్‌కుమార్, పీసీలను సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు, పలువురు అభినందించారు.

గుండ్లసింగారంలో
రోడ్లు, డ్రెయినేజీలు శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ గుండ్లసింగారం గ్రామంలో చాలా కాలంగా పలు సమస్యలు నెలకొనడంతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నిధులున్నా.. పనులు సున్నా' అనే కథనం ప్రచురితమైంది. దీంతో బల్దియా ఉన్నతాధికారులు స్పందించారు. వెంటనే గుండ్లసింగారంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. దీంతో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాషానాయక్ సిబ్బందితో కలిసి సమస్యలున్న ప్రాంతాల్లో పర్యటించారు. శానిటేషన్ సిబ్బందితో గ్రామంలోని ప్రధాన రహదారి, డ్రైనేజీలు శుభ్రం చేయడంతో పాటు రోడ్లకు ఇరువైపులా చాలా కాలంగా ఉన్న చెత్తను తొలగించారు.

బాలల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

వడ్డెపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని బాలల గ్రంథాయానికి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వెలిదండి సుమలత విలువైన పుస్తకాలను లైబ్రేరియన్ గడ్డం సమ్మయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసు సురేష్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ చుంచు రాజేందర్, సామాజిక వేత్తలు కలకోటి మహేదర్, గొడిశాల హరినాథ్, చుంచు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వ్యక్తులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ ఎంజీఎం హాస్పిటల్‌లో '1615 వరల్డ్ వైడ్ బ్లడ్ డ్రైవ్ టు గివ్ లైఫ్ త్రూ ది లవ్ ఆఫ్ ది పాస్ ఓవర్'ను బుధవారం నిర్వహించింది. చర్చి సభ్యులు, స్థానిక నివాసితులు సహా దాదాపు 150 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈసందర్భంగా దేవుడి సంఘం ప్రతినిధి జనరల్ పాస్టర్ కిమ్ జ్యో చ్యోల్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావులు మాట్లాడుతూ.. ఎండా కాలంలో కూడా ప్రాణాలను రక్షించడంలో స్వచ్ఛందంగా రక్తదానం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 175 దేశాలలో 3.92 మిలియన్ల విశ్వాసులతో చర్చ్ ఆఫ్ గాడ్ ప్రేమ, సేవ లక్ష్యాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

ఇంటి పన్ను చెల్లింపులో 5 శాతం తగ్గింపు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో నివసించే సొంత ఇళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కలిగిన యజమానులకు రాష్ట్ర మున్సిపల్ శాఖ బుధవారం ఎర్లీ బర్డ్ ఆఫర్ ప్రకటించింది. ప్రాపర్టీ ట్యాక్స్‌లు 5 శాతం ఫీజు తగ్గించి చెల్లించవచ్చని హైదరాబాద్ సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. బల్దియా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గతంలో ఉన్న ఇంటి, నల్లా పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించిన వారు 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఫీజును ఏప్రిల్ 30 వరకు చెల్లించే వారికి 5శాతం రిబేట్‌తో కూడిన ఫీజును చెల్లించడానికి అర్హులని తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 100 ప్రకారం ఈ ఎర్లీ బర్డ్ స్కీంను వెల్లడించనున్నట్లు తెలిపారు. వరంగల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

వైస్రాయ్ బార్ ఎదుట స్థానికుల ఆందోళన

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 10వ డివిజన్ అలంకార్ జంక్షన్‌లోని వైస్రాయ్ బార్ ఎదుట స్థానిక ప్రజలు బుధవారం ఆందోళనకు దిగారు. బార్ పక్కన వీధిలో వివిధ కాలనీలకు వెళ్లే రోడ్డు వైపు కాంపౌండ్ వాల్‌ను కూల్చి వేసి నూతనంగా మరో గేటు ఏర్పాటు చేయడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. రాత్రివేళల్లో తమ ఇళ్లకు వెళ్లే సమయాల్లో మందుబాబులు అటుగా వెళ్లే వారిని ఇబ్బందులకు గురుచేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బార్ యాజమాన్యం స్పందించి కాలనీ వైపు ఉన్న గేటు వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడికి పరామర్శ

హసన్‌పర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు తక్కళ్లపెల్లి రవీందర్‌రావు బుధవారం రజనీకుమార్‌ను పరామర్శించారు. వారి వెంట మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వాసుదేవరెడ్డి, వై.సతీష్‌రెడ్డి, నాయకులు బొల్లికొండ వీరేందర్, నయీం, రవి, శరత్, ప్రశాంత్, టీఆర్ఎస్‌వీ ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, వీరు తదితరులున్నారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని వెనక్కి తీసుకోవాలి

▸▸ సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు వాసుదేవరెడ్డి



కేయూలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మంద నరేశ్ తదితరులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమి వేలం పాటని వెనక్కి తీసుకోవాలని సీపీఎం పార్టీ హనుమకొండ జిల్లా నాయకుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని యూటీఎఫ్ భవన్‌లో మండల విస్తృత స్థాయి సమావేశం యాకుంట్ల యాకయ్య అధ్యక్షతన నిర్వహించారు. వాసుదేవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యూనివర్సిటీ భూములను వేలం వేయొద్దని పోరాటాలు చేస్తున్న నాయకత్వాన్ని పోలీసులతో దాడులు జరిపించి అక్రమంగా అరెస్టులు చేయించడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వన్యప్రాణులను కాపాడాల్సిన ప్రభుత్వమే బుల్డోజర్లతో జంతువులను హింసించడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో నాయకులు మంద సంపత్, దూడపాక రాజేందర్, నోముల కిషోర్, ఆలకుంట్ల మల్లయ్య, శ్రీకాంత్, స్రవంతి, శ్వేత, రాణి, సుకర్ణ, తదితరులు పాల్గొన్నారు.

భూములను వేలం వేయొద్దు

కాజీపేట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వేలం ఆపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య మాట్లాడారు. భూముల వేలాన్ని అడ్డుకున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొట్టె మల్లేశం, ఉప్పనపల్లి నాగేశ్వర్‌రావు, కారు ఉపేందర్, జంపాల రమేశ్, సంటి రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం.

కేయూ క్యాంపస్: కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు, విద్యార్థుల చేతుల్లో గుణపాఠం తప్పదని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ హెచ్చరించారు. బుధవారం కేయూలో హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీ భూములను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అమ్ముకుంటూ వేలం వేయడాన్ని నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను వర్సిటీ లైబ్రరీ ఎదుట దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ భూములను కాపాడుకునేందుకు శాంతియుతంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్‌లు చేయడం అమానుషమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ నేతలు అర్షం చరణ్, పోతుల విష్ణు, కొమ్ము మధు, విజయ్, విష్ణు, కిరణ్, సాయి, రవి, రమేశ్, వెంకటేశ్, సురేశ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేటి చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి

ఏప్రిల్ 3న వామపక్ష విద్యార్థి సంఘాల నేతృత్వంలో నిర్వహించనున్న చలో సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీ భూములను కాపాడుకునే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. హెచ్‌సీయూ భూములను కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ 400 ఎకరాల భూమి పరిరక్షణ కోసం పోరాడుతామని స్పష్టం చేశారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూసైన్స్ కళాశాలలో బుధవారం మానవ అక్రమ రవాణా నిర్మూలనపై పోలీసు కళాబృందం, సుబేదారి పోలీసుల ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. చిన్నారులతో ఎలాంటి పనులు చేయించుకోవద్దని అన్నారు. నవజాత శిశువులను అక్రమంగా దత్తత తీసుకోవడం నేరమని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. లేదా చైల్డ్ హెల్ప్‌కు సమాచారం అందించాలని సీఐ కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ పి.సత్యనారాయణరెడ్డి

సన్న బియ్యం పంపిణీ



సన్నబియ్యం పింపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : భట్టుపల్లి, ఇందిరమ్మ కాలనీ, కడిపికొండలోని పలు రేషన్ షాపులలో సన్నబియ్యం పంపిణీని వర్ధన్నపేట ఎమ్మె ల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో, కాంగ్రెస్ మం డల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, ఎమ్మార్వో బావుసింగ్, కాంగ్రెస్ నాయకులు రాజారపు స్వామి, జక్కుల సదానందం, చీమల రాజ్‌కుమార్, నాగపురి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- వడ్డెపల్లి: గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ వికాస్‌నగర్‌లో 59వ రేషన్ షాపులో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీని హనుమకొండ ఆర్‌డీవో రమేష్ రాథోడ్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డి, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాజీపేట తహసీల్దార్ బావుసింగ్, రేషన్ డీలర్ సిద్దేశ్వర్, కాంగ్రెస్ శ్రేణులు బంక సతీష్, బంక చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 56వ డివిజన్ సప్తగిరి కాలనీలోని రేషన్ షాపులో ఏర్పాటు చేసిన సన్నబియ్యం పంపిణీని కాంగ్రెస్ 56వ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.
- హసన్‌పర్తి: గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారంలో సన్న బియ్యం పం పిణీని స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లుతో కలిసి ఆర్డీవో రమేష్ రాథోడ్ బుధవారం ప్రారంభించారు. ఆయన వెంట తహసీల్దారు చల్ల ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు సంగాల ప్రేమ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు మార్క రాజు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.
- న్యూశాయంపేట: 31వ డివిజన్ న్యూశాయంపేటలో బుధవారం కార్పొ రేటర్ మామిండ్ల రాజుయాదవ్ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వేల్పుల మోహన్‌రావు, మాడిశెట్టి శింశంకర్, కాంగ్రెస్ నాయకులు సురేందర్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- వరంగల్ మెడికల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని 4వ డివిజన్‌లో బుధవారం ప్రారంభించారు. పెద్దమ్మగడ్డ రేషన్ షాపులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబేద్కర్ రాజు ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులు సన్న బియ్యం పంపిణీ పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలు చేపట్టాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలను వెంటనే చేపట్టి తరగతుల సక్రమంగా నిర్వహించాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను కలిసి అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతలు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నేతలు మొగిలి వెంకట్‌రెడ్డి, మంద నరేశ్, బి.నరసింహరావు, డాక్టర్ పాలమాకుల కొమురయ్యలు మాట్లాడుతూ.. పదేళ్లుగా వర్సిటీలో పార్టుటైమ్ అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు సక్రమంగా పాఠ్యాంశాలు జరుగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ అధ్యక్షుడు మంద నరేశ్, హాకీం నవీద్, స్వేరో నేత సాయి కుమార్, డాక్టర్ పాలమాకుల కొమురయ్య, డాక్టర్ మద్దిరాల మోహన్‌రెడ్డి, డాక్టర్ వడ్డెపల్లి మధు, పుల్లా కుమార్, శివ, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫీజుల చెల్లింపు గడువు పొడిగించాలి

ఈనెల 2వ తేదీతో ముగిసిన కేయూ పరిధిలో డిగ్రీ 2, 4,6వ సెమిస్టర్ పరీక్ష ఫీజుల చెల్లింపు గడువు పొడగించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను తన చాంబర్‌లో కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ కుమార్, వంశీకృష్ణ, రాజు, అన్వేశ్, ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి మంద కృష్ణ పరామర్శ

న్యూశాయంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ రాజారపు బాబు కుటుంబాన్ని మందకృష్ణ మాదిగ బుధవారం పరామర్శించారు. బాబు తండ్రి దాసు ఇటీవల మృతి చెందాడు. దాసు చిత్రపటానికి మంద కృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మాడిశెట్టి శివశంకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మందకుమార్ తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 3 ఏప్రిల్ 2025

తరచి చూస్తే మన చుట్టూ అనేక అవకాశాలు ఉంటాయి. వాటిని అందిపుచ్చుకుంటే.. ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించటమే కాదు.. ఇతరులకు సాయం చేయటానికి వీలవుతుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన **దీపాలి ముర్రా** కథ కూడా ఇదే.. దీపాలి తన చుట్టు పక్కల ఉచితంగా దొరికే సబాయి గడ్డితో పర్యావరణహితమైన గృహఅలంకారాలను చేసి విక్రయించటం ప్రారంభించింది. తనలాంటి అనేక మంది గిరిజన మహిళలకు కూడా ఉపాధి కల్పిస్తోంది. దీపాలి ప్రస్థానం ఆమె మాటల్లోనే...

మన చుట్టూ చూస్తే అవకాశాలెన్నో!



"నేను పదోతరగతి వరకు చదువుకున్నాను. నాకు చిన్నతనంలోనే వివాహమైంది. నా భర్త తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసేవాడు. గట్ల మీద సబాయి గడ్డిని పండించేవాడు. సబాయి గడ్డి చాలా గట్టిగా ఉంటుంది. సాధారణంగా ఈ గడ్డితో తాళ్లను పేనుతారు. నా భర్త చేసే వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం మా కుటుంబానికి సరిపోయేది కాదు. దాంతో నేను కూడా ఏదో ఒక పనిచేయాల్సిన అవసరం ఏర్పడింది. నాకు చదువు రాదు కాబట్టి ఏ ఉద్యోగంలోను చేరలేను. కానీ ఎంతో కొంత సంపాదించకపోతే కుటుంబం గడవని పరిస్థితి. ఆ సమయంలో సబాయి గడ్డి నాకు ఉపకరించింది. గడ్డితో తాళ్లను పేనటం నేర్చుకున్నా. ఇంట్లో పనంతా అయిపోయిన తర్వాత తాళ్లను పేనేదాన్ని. రోజుకు 50 రూపాయలు వచ్చేవి. కానీ ఆ డబ్బులు సరిపోయేవి కావు. ఆ సమయంలో- నా కోసమే అన్నట్లుగా- యునెస్కో సంస్థ స్థానిక స్వచ్ఛంద సంస్థలతో కలిసి- ఒక వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో సబాయి గడ్డిని ఉపయోగించి రకరకాల గృహాలంకరణ వస్తువులను తయారు చేయడం నేర్పించారు. జువెలరీ బాక్స్‌లు, బుట్టలు, హ్యాంగింగ్ ప్లాంటర్లు, వాల్ మౌంటెడ్ సొల్వర్లు, ఫ్లవర్ వాజ్‌లు, పళ్లాలు వంటివి తయారుచేయటం ఎలాగో నేర్పించారు. వాటిపై అందమైన పువ్వులు, పక్షులు, జంతువుల బొమ్మలు కుట్టడం నేర్పారు.

నాకు చదువు రాదు కాబట్టి ఏ ఉద్యోగంలోను చేరలేను. కానీ ఎంతో కొంత సంపాదించకపోతే కుటుంబం గడవని పరిస్థితి. ఆ సమయంలో సబాయి గడ్డి నాకు ఉపకరించింది. గడ్డితో తాళ్లను పేనటం నేర్చుకున్నా. ఇంట్లో పనంతా అయిపోయిన తర్వాత తాళ్లను పేనేదాన్ని. రోజుకు 50 రూపాయలు వచ్చేవి.



రకరకాలు...

ఈ ప్రకృతిలో ప్రతి వస్తువు మనకు పనికి వస్తుంది. మనం వాటిని గుర్తించి ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచించాలంతే! సబాయి గడ్డి చూడటానికి గరుకుగా ఉన్నా- దానితో రకరకాల వస్తువులు తయారుచేయవచ్చు. మా చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు వేటిని ఇష్టపడతారో గమనించి- ఆ వస్తువులు తయారుచేయటం మొదలుపెట్టా. ఈ ప్రయాణ ప్రారంభంలోనే- ఎదురయిన తొలి సవాల్- తగినంత సబాయి గడ్డి దొరకకపోవటం. మా పొలంలో పండిన గడ్డి- ఎక్కువ వస్తువులకు సరిపోయేది కాదు. దాంతో ఇతరుల నుంచి కొనుగోలు చేయాల్సి వచ్చేది. గడ్డితో పాటుగా సహజసిద్ధమైన రంగులను కూడా కొని తయారు చేసిన వస్తువులపై బొమ్మలు వేసేదాన్ని. ఇక్కడ ఒక విషయాన్ని చెప్పాలి. సబాయి గడ్డితో చేసే వస్తువుల తయారీకి చాలా ఎక్కువ సమయం పడుతుంది. ఉదాహరణకు ఒక అందమైన బుట్ట అల్లాలంటే 40 గంటల దాకా పడుతుంది. దాంతో నేను ఎదగాలంటే ఎక్కువ మంది పనివారు అవసరమవుతారని అర్థమయింది. ఆ లోపులో నేను తయారుచేసిన వస్తువులకు గిరాకీ పెరిగింది. దాంతో మా గ్రామంలోనే ఉన్న కొద్ది మంది మహిళలకు ఉపాధి కల్పించాను. ప్రస్తుతం నా దగ్గర 50 మంది మహిళలు పనిచేస్తున్నారు. వీరందరూ నెలకు 600 దాకా రకరకాల వస్తువులు తయారుచేస్తూ ఉంటారు. వీటిని దేశంలో వివిధ నగరాల్లో జరిగే కళాప్రదర్శనలలో ఉంచుతాము. గత ఏడాది కొపెన్‌హెగెన్‌లో జరిగిన ఒక ఉత్సవంలో కూడా పాల్గొన్నాం. ఒకప్పుడు నెలకు 1500 సంపాదించటానికి కష్టపడిన నేను ప్రస్తుతం ఏడాదికి కొన్ని లక్షలు సంపాదిస్తున్నా! దీనికి ప్రధానమైన ముడివస్తువు గడ్డే! అనేక ప్రాంతాల్లో ఉచితంగా దొరికే ఈ గడ్డితో అందరూ వస్తువులు తయారుచేయవచ్చు. సంపాదించుకోవచ్చు. దీనికి నేనే ఉదాహరణ. నా ఉదాహరణ అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నా!".

పిల్లల లంచ్‌బాక్స్‌లో ఇవి వద్దు...

పిల్లలకు ఇష్టమని లంచ్‌బాక్స్‌లో రకరకాల చాక్లెట్లు, చిప్స్ పెడుతూ ఉంటారు చాలామంది తల్లులు. వీటి వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. పిల్లల లంచ్‌బాక్స్‌లో ఏవి పెట్టకూడదో తెలుసుకుందాం.

- **పళ్ల రసాల ప్యాకెట్లు:** నిమ్మ, నారింజ, దానిమ్మ లాంటి రకరకాల పళ్ల రసాల ప్యాకెట్లు ప్రస్తుతం బజార్లో దొరుకుతున్నాయి. చాలామంది ఇవి ఆరోగ్యానికి మంచివనే ఉద్దేశంతో వీటిని కొని పిల్లల లంచ్‌బాక్స్‌లో పెట్టేస్తుంటారు. వీటిలో అధిక మొత్తంలో చక్కెరలు ఉంటాయి. ఎక్కువకాలం నిల్వ ఉండడం కోసం రసాయనాలు కూడా కలుపుతుంటారు. వీటివల్ల పిల్లల్లో స్థూల కాయం, దంత సమస్యలు ఏర్పడవచ్చు. ఇలాంటి పాకెట్లను లంచ్‌బాక్స్‌లో పెట్టకూడదు.
- **డ్రైఫ్రూట్ చాక్లెట్లు:** కాజు, బాదం, పిస్తా లాంటి నట్స్, డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ వీటితో తయారు చేసిన చాక్లెట్లలో కృత్రిమ రంగులు, అధిక పరిమాణంలో చక్కెర, ఇతర కొవ్వు పదార్థాలు కూడా కలుపుతారు. వీటిని తినడం వల్ల పిల్లలకు జీర్ణ సమస్యలు వస్తాయి. తరచూ ఇలాంటి చాక్లెట్లని పిల్లలకు ఇవ్వకూడదు.
- **సాల్ట్ బిస్కెట్స్, చిప్స్:** వీటిలో పిల్లలకు అవసరమైనదానికంటే ఎక్కువ పరిమాణంలో ఉప్పు ఉంటుంది. వీటిని తినడం వల్ల పిల్లల ఆరోగ్యం పాడవుతుంది.
- **పేస్ట్రీలు, రస్క్‌లు:** వీటిని సాధారణంగా మైదాతో తయారు చేస్తూ ఉంటారు. ఇది పిల్లల ఆరోగ్యానికి మంచిది కాదు. వీటిలో కూడా అధికంగా చక్కెర, కొవ్వు పదార్థాలు ఉంటాయి. వీటివల్ల పిల్లలకు మధుమేహం లాంటి సమస్యలు రావచ్చు.



- **పిజ్జా, బర్గర్:** వీటిలో పోషకాలకు బదులు అధిక మొత్తంలో క్యాలరీలు, శాచురేటెడ్ కొవ్వులు, సోడియం లాంటివి ఉంటాయి. వీటివల్ల పిల్లలకు టైప్ 2 డయాబెటిస్, రక్తపోటు, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది.

సెలెబ్ టాక్

కెరీర్ రాకెట్‌లా దూసుకుపోయే సమయంలో బిడ్డను కనడానికి ఏ మహిళైనా కాస్త తటపటాయిస్తుంది. ఎన్నో అపరాధ భావనలు, భయాలు వాళ్లను వేధిస్తాయి. సినీనటులు కూడా ఇందుకు మినహాయింపు కాదు. బాలీవుడ్ అగ్రతార **దీపిక పడుకొనె** తానెదుర్కొన్న 'మామ్ గిల్ట్' గురించి, దాన్ని అధిగమించిన వైనం గురించి ఇలా వివరిస్తోంది.



కొత్త తల్లులు గిల్ట్ లేకుండా..

బిడ్డ 'దువా'ను కన్న తర్వాత, రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన దీపిక, అబుదాబిలో గ్లోబల్ సమిట్‌కు హాజరైన సందర్భంలో, తన మాతృత్వ ప్రయాణం గురించీ, మాతృత్వం పట్ల తనకున్న దృక్పథం గురించి ఇలా వివరించింది. "మాతృత్వమన్నది అద్భుతమైన అనుభవం. ఇక నుంచి నేనెంచుకోబోయే సినిమాలు, పాత్రల మీద ఆ ప్రభావం పడుతుందనే విషయం నాకు తెలుసు. గర్భం దాల్చక ముందు నుంచే ఈ విషయం గురించి నేను స్పష్టతను ఏర్పరుచుకున్నాను. ప్రస్తుతం జీవితంలో నేనొక కీలకమైన దశలో ఉన్నాను. ఒక కొత్త తల్లిగా బిడ్డకు సమయాన్ని కేటాయిస్తూనే, నటిగా నా వృత్తికి న్యాయం చేకూర్చేలా సమయ నిర్వహణను కొనసాగించక తప్పదు. అలాగని బిడ్డకు దూరమైన ప్రతిసారీ అపరాధ భావనకు గురి కావలసిన అవసరం లేదని కూడా నేను భావిస్తున్నాను.

నిజానికి మాతృత్వం నన్నెంతో మార్చేసింది. నా ఆలోచనా విధానాలు, తీసుకునే నిర్ణయాలు బిడ్డే ప్రధానంగా సాగుతున్నాయి. నా ప్రాధామ్యాలు కూడా మారిపోయాయి. నా మనసులో పాప దువా ఎల్లప్పుడూ మెదులుతూనే ఉంటుంది. నిజానికి నా గూగుల్ సెర్చ్ మొత్తం పిల్లల పెంపకం చుట్టూరానే తిరుగుతూ ఉంటుంది. బిడ్డ పాలు కక్కడం ఎప్పటి నుంచి మానేస్తుంది, అందుకోసం తల్లులేం చేయాలి? లాంటి ప్రతి తల్లినీ వేధించే ప్రశ్నలే నన్ను కూడా వేధిస్తూ ఉంటాయి.

సెల్ఫ్ కేర్ అవసరం

తల్లి అయినంత మాత్రాన మన పూర్వపు బాధ్యతలకు స్వస్తి చెప్పవలసిన అవసరం లేదు. ఎలాంటి అపరాధ భావనకు గురి కాకుండా సెల్ఫ్ కేర్‌కు కూడా సమయం కేటాయిస్తూ ఉండాలి. మహిళలమైన మనం ఎన్నో పాత్రలు పోషిస్తూ ఉంటాం. ఆ పాత్రలకు పూర్తి న్యాయం చేయాలని పరితపిస్తూ ఉంటాం. అయితే ఆ క్రమంలో మనల్ని మనం నిర్లక్ష్యం చేసుకుంటూ ఉంటాం. నిజానికి మహిళలు వాళ్లకంటూ కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. మిగతా బాధ్యలకు నిర్లక్ష్యం చేయకుండా, వాటికి తగినంత సమయాన్ని కేటాయించినంత కాలం ఎలాంటి అపరాధ భావనకూ గురి కావలసిన అవసరం లేదని నా అభిప్రాయం. మహిళలు నిరంతరంగా ఏదో ఒక విషయం గురించి చింతిస్తూనే ఉంటారు. తల్లి బాధ్యతలకే ప్రాధాన్యమిస్తూ, మానసికోల్లాసాన్ని అందించి సేద తీర్చే సొంత పనులను వాయిదా వేస్తూ ఉంటారు. కానీ ఇది సరి కాదు. బిడ్డను ఆరోగ్యంగా పెంచాలంటే తల్లి కూడా ఆరోగ్యంగా ఉండాలి.

దశలవారీ ఒడిదొడుకులు

మహిళలకు భావోద్వేగాలు, కుంగుబాట్లు ఎక్కువ. వాటి మీద కూడా దృష్టి పెడుతూ ఉండాలి. ఒకానొక సమయంలో నేను కూడా మానసిక కుంగుబాటుకు లోనయ్యాను. ఆ అనుభవాన్ని బయటి ప్రపంచంతో పంచుకోవడం ద్వారా నా మనసును తేలిక పరుచుకున్నాను. నా భుజాల పైనుంచి పెద్ద భారం తొలగిపోయిన అనుభూతికి లోనయ్యాను. ఆ సమయంలో ఎవరో నన్ను అంచనా వేస్తారనే భయం లేకుండా ఎంతో పారదర్శకంగా వ్యవహరించాను. అత్యంత వ్యక్తిగతమైన విషయాన్నీ, నా జీవితాన్ని మలుపు తిప్పిన విషయాన్నీ అందరితో పంచుకోవడం నాకెంతో ముఖ్యమనిపించింది. ఇలా స్వీయ అనుభవాన్ని పంచుకోవడం ద్వారా ఏ ఒక్కరి జీవితాన్ని కాపాడగలిగినా నా ప్రయత్నం ఫలించినట్టేనని భావించాను. మహిళల జీవితంలో దశలవారీ ఒడిదొడుకులుంటాయనడానికి నా జీవితమే ఒక ఉదాహరణ. మానసిక కుంగుబాటును ధైర్యంగా ఎదుర్కోవడమే కాకుండా, ఆ సమస్య పట్ల అవగాహన పెంచగలిగాను. కొత్త తల్లులు లోనయ్యే అపరాధ భావనలను స్వయంగా అనుభవించాను కాబట్టే ఈ అంశం గురించి బహిరంగ చర్చ జరగవలసిన అవసరం ఉందని నేను దృఢంగా నమ్ముతున్నాను."

కౌన్సెలింగ్

ముడతలు పోవడానికి మార్గమిదే!

డాక్టర్! నా వయసు 35. ఈ మధ్య ముఖం మీద సన్నని గీతలు, ముడుతలు కనిపిస్తున్నాయి. ఫేస్ ప్యాక్స్, ఫేసియల్స్‌తో అంతగా ప్రయోజనం కనిపించడం లేదు. వీటిని వదిలించుకోవడంతో పాటు చర్మాన్ని బిగుతుగా మార్చే చికిత్సలేవైనా ఉన్నాయా?

- ఓ సోదరి, హైదరాబాద్



35 ఏళ్ల వయసు నుంచి ముఖం మీద గీతలు ఏర్పడడం సహజం. చర్మాన్ని బిగుతుగా ఉంచే చర్మం అడుగున కొల్లాజెన్ ఈ వయసు నుంచి తరిగిపోతూ ఉంటుంది. దీన్ని శరీరం స్వతఃసిద్ధంగా తయారు చేసుకునే సామర్థ్యాన్ని కోల్పోతుంది. కాబట్టి చర్మం మీద సన్నని గీతలు, ముడతలు లాంటి వయసు పైబడే ఛాయలు కనిపించడం మొదలవుతుంది. ఇలాంటి సందర్భాల్లో కొల్లాజెన్ సప్లిమెంట్స్‌ను వాడుకోవచ్చు. ఇవి పౌడర్, ద్రవ రూపంలో ఉంటాయి. అయితే నిజానికి ఇవి కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడతాయే తప్ప స్వచ్ఛమైన కొల్లాజెన్స్ కావు. వీటిని ఆహారంతో లేదా పానీయాలతో కలుపుకుని తీసుకోవచ్చు. ఇలా రోజుకు ఐదు గ్రాముల కొల్లాజెన్ తీసుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న కొల్లాజెన్ సప్లిమెంట్స్ అన్నీ జంతు ఆధారితమైనవే! వృక్షసంబంధ కొల్లాజెన్లు త్వరలో అందుబాటులోకి రాబోతున్నాయి. ఈ కొల్లాజెన్ సప్లిమెంట్లలో అదనంగా జింక్, విటమిన్ సి కూడా ఉంటాయి కాబట్టి చర్మ పోషణకు కూడా ఇవి ఉపయోగపడతాయి. అలాగే కొల్లాజెన్ సప్లిమెంట్లు కేవలం చర్మానికే కాదు వెంట్రుకలకూ, కీళ్లకూ కూడా ఎంతో మేలు చేస్తాయి.

ఆహారం ద్వారా...

కొల్లాజెన్ సప్లిమెంట్లతో పాటు, చికెన్, చేపలు, గుడ్లు, బోన్ బ్రాత్, నట్స్, బెర్రీలు, వెల్లుల్లి, బీన్స్, బెల్ పెప్పర్స్ కూడా కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడతాయి. కాబట్టి వాటిని కూడా ఆహారంలో చేర్చుకుంటూ ఉండాలి. వీటితో పాటు కొల్లాజెన్ పౌడర్‌ను 35 ఏళ్ల వయసు నుంచే తీసుకోవడం మొదలుపెట్టాలి. అలాగే ఈ పౌడర్లను కొన్ని నెలల పాటు వాడుకుని తర్వాత కొంత కాలం పాటు యాంటీఆక్సిడెంట్లు వాడుకోవచ్చు. లేదంటే ప్రతి రోజూ క్రమం తప్పకుండా 6 నెలల పాటు కొల్లాజెన్ పౌడర్లను వాడుకుని, ఆ తర్వాత వారానికి రెండు సార్లు చొప్పున వాడుకోవచ్చు. ఇలా చేయడం ద్వారా ఓవర్‌డోస్ సమస్యను అరికట్టవచ్చు. ఈ కొల్లాజెన్ పౌడర్లను 35 ఏళ్లు పైబడిన వాళ్లు కూడా వాడుకోవచ్చు.

డాక్టర్ స్వప్న ప్రియ, కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, కాస్మోస్యూర్ క్లినిక్, హైదరాబాద్.

ఇలా చేస్తే ఇంట్లోకి బల్లులు రావు..!



సాధారణంగా కిటికీలు, వెంటిలేటర్ల నుంచి బల్లులు ఇంట్లోకి వచ్చేస్తూ ఉంటాయి. వీటిని సులువుగా బయటికి పంపేందుకు నిపుణులు ఈ చిట్కాలు చెబుతున్నారు.

- బల్లి ఉన్న గదిలో కొన్ని వెల్లుల్లి రెబ్బలు లేదా సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను ఓ గిన్నెలో వేసి ఉంచితే వాటి ఘాటుకి బల్లులు బయటికి వెళ్లిపోతాయి.
- గిన్నెలో పది నుంచి పన్నెండు మిరియాలు వేసి అవి మునిగే దాకా నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో పోసి బల్లులు ఉన్నచోట పిచికారీ చేస్తే బల్లులు వెళ్లిపోతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల కాఫీ పొడి, కొద్దిగా పొగాకు వేసి కొన్ని నీళ్ల చుక్కలు చల్లి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేసి గది మూలల్లో ఉంచితే బల్లులు వెళ్లిపోతాయి. మళ్లీ రావు
- కలరా వుండలను ఇంట్లో అక్కడక్కడ ఉంచితే వాటి వాసనకు బల్లులు వెళ్లిపోతాయి.
- ఇంట్లో బూజులు లేకుండా తరచూ శుభ్రం చేసుకుంటూ ఉంటే బల్లులు రావు.

సాధారణంగా మనం రెస్టారెంట్‌కు వెళ్లి ఆర్డర్ చేసిన తర్వాత... రుచి నచ్చకపోతే ఆహార పదార్థాలు వదిలేస్తాం. కానీ కూర్గ్‌లో ఉన్న 'ది ఇబనీ వెల్‌నెస్ సెంటర్'లో అలా వదిలేస్తే ప్రతి పదిగ్రాములకు వంద రూపాయల జరిమానా కట్టించుకుంటారు. కేవలం ఆహారమే కాదు.. ప్రకృతికి ఇబ్బందికి కలిగించే ఏ చిన్న పనిని చేయరు. పక్షులకు ఇబ్బంది అవుతుందని ఈ రిసార్ట్‌లో సెల్‌ఫోన్ టవర్స్ కూడా వేయలేదు. ఇలా పూర్తిగా ప్రకృతితో మమేకమైపోయిన ఈ రిసార్టు ఎండీ డాక్టర్ షెర్రిని 'నవ్య' పలకరించినప్పుడు అనేక విశేషాలు చెప్పుకొచ్చారు.



ప్రకృతిలో మమేకమై...

వాణిజ్యపరమైన ప్రాధాన్యత లేకుండా రిసార్టును, వెల్‌నెస్ సెంటర్‌ను నడపటం సాధ్యమా? 'ది ఇబనీ'ని ఎందుకు ప్రారంభించారు?

కూర్గ్ కాఫీ తోటలకు ప్రసిద్ధి. అయితే ఈ ప్రాంతంలో 'కొడగు' అనే తెగల వారు నివసిస్తూ ఉంటారు. వీరు ఇప్పటికీ ప్రకృతిని దేవతగా కొలుస్తారు. ప్రకృతికి విరుద్ధమైన ఏ పనిని చేయరు. కొడుగు భాషలో 'ఇబనీ' అంటే మంచు బిందువు అని అర్థం. మంచు ఎంత స్వచ్ఛంగా ఉంటుందో మేము అనుసరించే విధానాలు అలాగే ఉంటాయి. మా దగ్గర ఉన్న అన్ని భవంతులకు కొడగు భాషలోని పేర్లే పెట్టాం. 2002లో మా నాన్నగారు 125 ఎకరాల ఈ ఎస్టేట్‌ను కొనుగోలు చేశారు. దానిలో మేము మాత్రమే నివసించేవాళ్లం. దీనిని అందరితోను ఎందుకు పంచుకోకూడదనే ఆలోచన వచ్చింది. అప్పుడు కొన్ని కాటేజీల మాదిరిగా రూమ్స్ కట్టించాం. 125 ఎకరాలలో 47 కాటేజీలు ఉంటాయి. అంటే ప్రతి కాటేజీకి సుమారు మూడు ఎకరాల కాఫీ తోటలు..అటవీ ప్రాంతం వస్తుంది. జాగ్రత్తగా గమనిస్తే తప్ప కాటేజీ ఉందనే విషయం కూడా ఎవరికి తెలియదు. మేము దీనిని నిర్మించిన సమయంలో ఒక్క పెద్ద చెట్టును కూడా కొట్టలేదు.

రిసార్టు చిన్నగా ఉంటే ఎక్కువ లాభాలు ఉండవు కదా...

మేము ఈ ప్రాజెక్టు ద్వారా డబ్బులు సంపాదించాలనుకోవటం లేదు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు మా వంతు కృషిని చేయాలనుకుంటున్నాం. దానితో పాటుగా పర్యాటకులకు స్వచ్ఛమైన ప్రకృతి అనుభూతిని అందించాలనేదే మా ఉద్దేశం. పర్యాటకులకు ఉదయానే వినిపించే పక్షుల పాటలు ఎప్పటికీ గుర్తుండిపోవాలి. గడియారాల అవసరం లేకుండా సూర్యుడి గమనం ద్వారా సమయం ఎంత అయిందో చెప్పే నైపుణ్యత రావాలి. ప్రశాంతమైన ప్రకృతిలో ఉన్నప్పుడు మన ఇంద్రియాలు చురుకుగా పనిచేస్తాయి. అప్పుడు మనలో కలిగే భావనలు వేరుగా ఉంటాయి. అంతే కాకుండా అతిథులకు మా వద్ద ఉన్న వందల రకాల చెట్ల జాతుల గురించి అవగాహన కలగాలి. అదే మా లక్ష్యం. దీని వెనక ఎలాంటి లాభాపేక్ష లేదు.

ఇంత స్వచ్ఛంగా నిర్వహించాలనుకున్నప్పుడు ఎదురయ్యే సవాళ్లు ఏమిటి?

రకరకాల సవాళ్లు ఎదురవుతూ ఉంటాయి. వాటి నుంచి మేము పాఠాలు.. గుణపాఠాలు నేర్చుకుంటూనే ఉంటాం. ఉదాహరణకు మేము ఏ పదార్థంలోను పంచదార వాడం. కాఫీ..టీ.. డిజర్ట్ అన్నింటిలోను బెల్లమే వాడతాం. ఇక మా దగ్గర ఆహారాన్ని వృథా చేయనివ్వం. ఎవరైనా అతిథులు ఆహారాన్ని వృథా చేస్తే - పది గ్రాములకు వంద రూపాయలు చెల్లించమంటాం. ఈ విషయం ముందే చెబుతాం. ఇలా జమ అయిన మొత్తానికి మరి కొంత కలిపి ఏడాదికి ఒక సారి స్వచ్ఛంద సంస్థలకు అందిస్తాం. అంతే కాదు. మా దగ్గర బుఫేలో కూడా ఒక సారి వంటలు వండం. అతిథుల సంఖ్య ఆధారంగా విడతల వారిగా ఆహారాన్ని వండుతాం. దీనివల్ల వృథా పూర్తిగా తగ్గిపోతుంది. ఈ విషయాలు కొందరికి నచ్చకపోవచ్చు. కానీ మా పద్ధతిలో పర్యావరణానికి, సమాజానికి మేలు చేసేవారు మా దగ్గరకు వస్తారు. కొందరు రాకపోవచ్చు. దీనికి కూడా మేము సిద్ధపడే ఉన్నాం. అంతే కాకుండా మేము పూర్తి పర్యావరణహితమైన పద్ధతులను అనుసరిస్తాం. మా దగ్గర ఎక్కడ ప్లాస్టిక్ కనిపించదు భవంతులు నిర్మించే సమయంలో ఒక్క చెట్టును కూడా కొట్టివేయలేదు. అంత దాకా ఎందుకు.. మా రిసార్ట్‌లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అంతంత మాత్రమే! సెల్‌ఫోన్ టవర్స్ పెడతామని అనేక మంది ముందుకు వచ్చారు. కానీ మేము అంగీకరించలేదు. ఎందుకంటే- మా దగ్గర సుమారు 75 రకాల పక్షులు కనిపిస్తూ ఉంటాయి. వీటిలో ఏడాదికి ఒక సారి వచ్చే వలస పక్షులు కూడా ఉన్నాయి. సెల్‌ఫోన్ టవర్స్ వెలువరించే తరంగాల వల్ల పిచుకలు వంటి అనేక పక్షులు చనిపోతాయి. అందువల్ల టవర్స్‌ను పెట్టడానికి అంగీకరించలేదు. దాంతో మా దగ్గరకు వచ్చే పర్యాటకులు వైఫై మీద ఆధారపడాల్సి ఉంటుంది.

ఆతిథ్యరంగంలో ఉన్నత స్థానాల్లో తక్కువ మంది మహిళలు ఉంటారు. మీ అనుభవాలేమిటి?

నాకు ఈ విషయంలో భిన్నమైన అభిప్రాయం ఉంది. నేను ఎప్పుడూ పురుషుల కన్నా తక్కువ అని అనుకోలేదు. అలాంటి ఆలోచనలు నాకు ఎప్పుడూ రావు. నా ఉద్దేశంలో పని బాగా చేయటం.. చేయలేకపోవటం అని మాత్రమే ఉంటాయి. కొన్ని ఉద్యోగాలకు స్త్రీ, పురుషులు ఇద్దరూ పోటీ పడుతూ ఉంటారు. ఎవరు బాగా పనిచేస్తే వారికి ఉద్యోగం ఇవ్వాలి తప్ప- స్త్రీలనే వివక్ష ఉండకూడదనేది నా అభిప్రాయం.

ఒక వైపు వ్యాపారం... మరో వైపు ఇల్లు... వీటి మధ్య బ్యాలెన్స్ ఎలా?

ఇల్లు... వ్యాపారం... ఈ రెండే తప్ప నాకు వేరే వ్యాపకాలు ఏమి లేవు. కొన్ని సార్లు ఈ రెండూ కలిసిపోతూ ఉంటాయి. బోర్డు రూమ్‌లో కూర్చుని ఇంట్లో పిల్లల కోసం పిజ్జాలు ఆర్డర్ చేసిన సందర్భాలున్నాయి. ఇదే విధంగా ఇంట్లో పిల్లలు- "బోర్డు రూమ్‌లో మాట్లాడినట్లు మాట్లాడుతున్నావు.." అని ఫిర్యాదు చేసిన రోజులు కూడా ఉన్నాయి. నా ఉద్దేశంలో మన ప్రాధమ్యాలు స్పష్టంగా తెలిస్తే.. వ్యాపారాన్ని, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేయటంలో సమస్యలు ఉంటాయని అనుకోవటం లేదు.

• సివిఎల్ఎన్ ప్రసాద్

నీదెంత రాతిగుండె తల్లీ!

ప్రియుడి మోజులోపడి తన ముగ్గురు పిల్లలను చంపేసింది

- అమీన్‌పూర్ ఘటనలో దుర్మార్గానికి ఒడిగట్టింది తల్లే
- చిన్ననాటి స్నేహితుడితో వివాహేతర సంబంధం
- భర్తను వదిలేసి ప్రియుడిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయం
- ముక్కు, నోరు అదిమిపట్టి పిల్లలని హత్యచేసిన రజిత
- ఆపై విషాహారంతో కడుపునొప్పి అంటూ గగ్గోలు
- రజిత, ఆమె ప్రియుడు శివకుమార్ అరెస్టు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అభంశుభం తెలియని ముగ్గురు పిల్లలు రాత్రి నిద్రపోయినవారు నిద్రపోయినట్లుగా ప్రాణాలొదలడం.. పక్కనే నిద్రించిన తల్లి అర్ధరాత్రి తర్వాత కడుపునొప్పితో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైన ఘటన గుర్తుందా? వారం క్రితం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటనలో వేళ్లన్నీ భర్తవైపే చూపాయి. భార్య ప్రవర్తనను అనుమానించే ఆ భర్త తరచూ ఆమెతో గొడవపడటం. ఆ వేధింపులను తాళలేక ఒకానొక దశలో ఆమె పుట్టింటికి వెళ్లిపోవడం.. మళ్లీ గొడవపడితే పిల్లలను చంపేసి తాను చస్తాననే షరతుతో తిరిగి కట్టుకున్నవాడి చెంతకు రావడంతో భర్త తీరు కారణంగానే పిల్లలతో కలిసి విషాహారం తిని ఆత్మహత్యాయత్నం చేసిందా? లేదంటే ఆ భర్తే.. పిల్లలను, భార్యను వదిలించుకునేందుకు ఘోరానికి ఒడిగట్టి ఉంటాడా? అనే అనుమానాలు తలెత్తాయి. అయితే ఎవ్వరూ ఊహించని విధంగా దిగ్భ్రాంతికరమైన వాస్తవం విచారణలో వెలుగుచూసింది! ఆ భార్యే ఘోరానికి ఒడిగట్టింది. పేగు తెంచుకొని పుట్టారన్న మమకారాన్ని మరిచిపోయి.. ప్రియుడి మోజులో కళ్లు మూసుకుపోయి.. అతడితో తన పెళ్లికి బిడ్డలే అడ్డుగా ఉన్నారని వారిని నిర్దాక్షిణ్యంగా చంపుకొంది ఆ తల్లేనని పోలీసులు తేల్చారు. కేసు వివరాలను సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెదక్‌పల్లికి చెందిన అవురిచింతల చెన్నయ్య (50) మొదటి భార్య చనిపోయింది. కొన్నాళ్లకు తనకన్నా వయసులో 20 ఏళ్ల చిన్నదైన రజిత (30) అలియాస్ లావణ్యను చెన్నయ్య రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు సాయికృష్ణ(12), మధుప్రియ(10) గౌతమ్(8) పిల్లలు. అమీన్‌పూర్ మండలం బీరంగూడలోని రాఘవేంద్ర కాలనీలోని ఓ అద్దె ఇంట్లో ఈ కుటుంబం ఉంటోంది. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. రజిత స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. రజిత ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న చెన్నయ్య తరచూ ఆమెతో గొడవ పడేవాడు. అతడి వేదింపులు భరించలేక ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు నచ్చజెప్పడంతో తిరిగి భర్త చెంతకు వచ్చింది. గత నెల 27వ తేదీ రాత్రి 8 గంటలకు పిల్లలతో కలిసి చెన్నయ్య, రజిత భోజనం చేశారు. రజిత, పిల్లలు పెరుగన్నం తినగా చెన్నయ్య పప్పన్నం తిని విధులకు వెళ్లిపోయి రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికొచ్చాడు. తెల్లవారుజామున మూడు గంటలకు రజిత తనకు కడుపునొప్పి అంటూ బిగ్గరగా రోదించడంతో స్థానికుల సాయంతో భర్త చెన్నయ్య ఆమెను ఆస్పత్రికి తరలించాడు. తర్వాతే ముగ్గురు పిల్లలు మృతిచెందినట్లుగా గుర్తించారు.


రజిత, పిల్లలు సాయికృష్ణ, మధుప్రియ గౌతమ్

చిన్ననాటి స్నేహితుడితో వివాహేతర సంబంధం

రజితకు పదో తరగతి చదివే రోజుల్లో నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గోడుకొండ్లకు చెందిన నూరు శివకుమార్ (30) క్లాస్‌మేట్. ఆరు నెలల క్రితం పదో తరగతి విద్యార్థులంతా గెట్ టుగెదర్ పార్టీ చేసుకుంటే రజిత వెళ్లింది. అక్కడ శివకుమార్‌తో మాట్లాడిన రజిత.. అతడితో చనువు పెంచుకొని వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త చెన్నయ్యను వదిలేసి వస్తానని, తనను పెళ్లి చేసుకోవాలని శివను కోరింది. నీకు ముగ్గురు పిల్లలు ఉన్నారు కదా.. కుదరదు అని అతడు చెబితే.. వారిని అడ్డుతొలగించుకొని వస్తానని రజిత అతడికి చెప్పింది. దీనికి అతడు సరేనన్నాడు. ఘటన రోజే శివకు ఫోన్ చేసిన రజిత తాను పిల్లలను చంపబోతున్నట్లు చెప్పింది. ఆ రోజు రాత్రి భర్త, పిల్లలతో కలిసి భోజనం చేశాక చిన్నారులను పడుకోబెట్టింది. భర్త విధులకు వెళ్లిపోయాక నిద్రలో ఉన్న పిల్లలు సాయికృష్ణ, మధుప్రియ, గౌతమ్‌ను ఒక్కొక్కరిగా టవల్‌తో ముక్కు, నోరు అదిమిపట్టి.. ఊపిరాడకుండా చేసి చంపేసింది. తర్వాత.. పెరుగన్నం తినడంతోనే ముగ్గురు పిల్లలు మృతి చెందారని నమ్మించేందుకు కడుపునొప్పి నాటకం ఆడి భర్తను, పోలీసులను నమ్మించేందుకు ప్రయత్నించింది. ఈ కేసులో నిందితులు రజిత, ఆమె ప్రియుడైన శివను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నవ్వుతూ మాట్లాడి.. సైకోలా మారి

- జర్మనీ యువతి రేప్‌కేసు నిందితుడు అస్లాం తీరు
- టూరిస్టులను ఆకట్టుకోవడంలో దిట్ట
- గంజాయి.. మత్తు పదార్థాలకు బానిస
- 2018లోనే బాలికపై అత్యాచారం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రంజాన్ రోజు జర్మనీ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డ మహమ్మద్ అబ్దుల్ అస్లాంకు నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కారులో విదేశీ యువతిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లిన అస్లాం.. అప్పటి వరకూ నవ్వుతూ మాట్లాడి.. అంతలోనే సైకోగా మారాడని బాధిత యువతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. దుబాయ్‌లో డ్రైవర్‌గా పనిచేసిన అస్లాం.. విదేశీ పర్యాటకులను ఆకట్టుకోవడంలో దిట్ట అని పోలీసులు చెబుతున్నారు. వేర్వేరు దేశాల వారిని.. వారి మాతృభాషలో పలకరిస్తూ.. బుట్టలో వేసుకుంటాడని వివరించారు. విదేశీ యువతిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాక.. ఒక్కసారిగా సైకోగా మారాడని, అసభ్యంగా ప్రవర్తించాడన్నారు. చెప్పినట్లు వినకుంటే చంపేస్తానని బెదిరించి.. ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసైన అస్లాం.. 2018లోనే ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పోక్సో కేసులో కొన్నాళ్లు జైలులో ఉన్నాడు. 2021లో ఆ కేసును కొట్టివేసినట్లు తెలిసింది. అస్లాంపై గొడవలు, ఈవ్‌టీజింగ్ కేసులు నమోదైనట్లు సమాచారం. డబ్బు అవసరమున్నప్పుడు దుబాయ్ వెళ్తాడని, అక్కడ ఎంతోకొంత సంపాదించాక.. తిరిగి హైదరాబాద్‌కు వస్తాడని పోలీసులు గుర్తించారు. అస్లాం తండ్రి అజీమ్.. మజ్లిస్ పార్టీ స్థానిక నేత అని తెలిసింది.

జర్మనీ ఎంబసీకి నివేదిక!

బాధిత యువతి గురువారం తన స్వదేశానికి వెళ్లిపోవడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆమెను బుధవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారని, జడ్జి ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు ఈ కేసులో సేకరించిన సీసీకెమెరా ఫుటేజీలు, ఇతర అంశాలతో ఓ సమగ్ర నివేదికను రాచకొండ సీపీకి అందజేశారు. ఆ నివేదికను పరిశీలించిన సీపీ.. దాన్ని సీఐడీ విభాగానికి పంపారు. సీఐడీ అధికారులు ఆ నివేదిక ప్రతిని చెన్నైలో ఉండే జర్మనీ ఎంబసీకి అందజేస్తారని తెలిసింది.







చిత్రజ్యోతి

SINCE 1965

పాతబస్తీ నేపథ్యంలో



ప్రముఖ నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ తమ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మించనున్న 60వ చిత్రాన్ని ప్రకటించారు. 'రౌడీ బాయ్స్', 'లవ్ మీ' చిత్రాలతో కథానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఆశిష్ ఇందులో ప్రధాన పాత్రలో నటించనున్నారు. నూతన దర్శకుడు ఆదిత్యరావు గంగసాని తెరకెక్కించనున్నారు. హైదరాబాద్ పాతబస్తీ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. త్వరలోనే తారాగణాన్ని, సాంకేతిక సిబ్బందిని ఖరారు చేసి షూటింగ్ ప్రారంభించనున్నారు.

ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్నా

కె.రాఘవేంద్రరావు



"దర్శకుడు వీఎన్ ఆదిత్య నా దగ్గర పనిచేయకపోయినా, ఆయనంటే చాలా ఇష్టం. స్టార్స్‌తోనే సినిమాలు చేయకుండా.. కొత్తవాళ్లకూ అవకాశం ఇస్తుంటాడు. అందుకే ఆయన దర్శకత్వం వహించిన 'ఫణి' చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు అన్నారు. వీఎన్ ఆదిత్య తెరకెక్కిస్తున్న గ్లోబల్ థ్రిల్లర్ 'ఫణి'. మహేశ్ శ్రీరామ్, క్యాథరిన్ ట్రెస్సా జంటగా నటిస్తున్నారు. డాక్టర్ మీనాక్షీ అనిపిండి నిర్మిస్తున్నారు. బుధవారం జరిగిన మోషన్ పోస్టర్ విడుదల కార్యక్రమంలో డా.మీనాక్షీ అనిపిండి మాట్లాడుతూ "ఇది చిన్న చిత్రంగా మొదలై పెద్ద ప్రాజెక్ట్‌గా మారింది. సినిమా ఘనవిజయం సాధిస్తుంది" అని చెప్పారు. వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ "ఈ సినిమా చిత్రబృందం పడిన కష్టానికి ఫలితం. అన్ని రకాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది" అని తెలిపారు.

కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం

నితిన్, భరత్



'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రంతో తొలిసారి మెగాఫోన్ పట్టారు దర్శకద్వయం నితిన్, భరత్. ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మించింది. మైత్రీమూవీ మేకర్స్ విడుదల చేస్తోంది. ఈనెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా నితిన్ మాట్లాడుతూ "ప్రదీప్ చాలా కాలంగా తెలుసు. ఈ కథ చెప్పగానే ఆయనకు నచ్చింది. పవన్‌కల్యాణ్ నటించిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమా పేరు ఈ ప్రాజెక్టుకు కచ్చితంగా సరిపోతుందనే తీసుకున్నాం. ఈ టైటిల్ మాకు పబ్లిసిటీ పరంగానూ సాయపడింది" అని అన్నారు. భరత్ మాట్లాడుతూ "ఈ సినిమా కథకు చాలా స్పాన్ ఉంది. సినిమాలో సందర్భానుసారంగా వచ్చే వినోదం ఎక్కువగా ఉంటుంది. ఈ సమ్మర్‌లో కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. అందరినీ అలరించి ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

ఆధ్యాత్మిక అనుభూతితో



భక్తి, జ్ఞానం ద్వారా మనిషిలో దైవత్వం నిండుతుందనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'శివాజ్ఞ'. సీనియర్ నటుడు భానుచందర్, హర్షిణి కీలకపాత్ర పోషించారు. శివపరమాత్మ క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. "శివాజ్ఞ' చిత్రం ప్రేక్షకులకు కొత్త ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది'అని యూనిట్ తెలిపింది. తొలి రోజు ఎంపిక చేసిన థియేటర్లలో ఉచిత ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది.

హాలీవుడ్ నటుడు వాల్ కిల్మర్ కన్నుమూత




ప్రముఖ హాలీవుడ్ నటుడు వాల్ కిల్మర్ (65) ఇక లేరు. 'బ్యాట్‌మ్యాన్ ఫరెవర్', 'టాప్ గన్', 'ద డోర్స్' 'హీట్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న వాల్ కిల్మర్.. మంగళవారం న్యూమోనియా వ్యాధితో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, థియేటర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయనకు 1984లో విడుదలైన 'టాప్ సీక్రెట్' చిత్రం సినీ రంగప్రవేశానికి బాటలు వేసింది. 1986లో విడుదలైన 'టాప్ గన్' అనే చిత్రంలోని 'ఐస్‌మ్యాన్' పాత్ర ఆయనకు మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత 1991లో విడుదలైన 'ద డోర్స్' అనే చిత్రంలో 'జిమ్ మోరిసన్' పాత్రను పోషించి అందరినీ ఆకట్టుకున్నారు. 1995లో విడుదలైన 'బ్యాట్‌మ్యాన్ ఫరెవర్'లో బ్యాట్‌మ్యాన్‌గా ప్రేక్షకాదరణ పొందారు.

అలరించే ఎర్రచీర



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఎర్రచీర: ద బిగినింగ్'. సుమన్ బాబు కీలక పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్.వి.వి. సుబ్బారెడ్డి, సీహెచ్ వెంకట సుమన్ నిర్మిస్తున్నారు. రఘుబాబు, కమల్‌కామరాజు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఏప్రిల్ 25న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్రనిర్మాత ఎన్.వి.వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది" అని అన్నారు. "సినిమాలో గ్రాఫిక్స్‌కు అధిక ప్రాధాన్యం ఉంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించే సినిమా ఇది" అని దర్శకుడు సుమన్‌బాబు చెప్పారు.


ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబును ఆయన సోదరుడు చిరంజీవి తన సతీమణి సురేఖతో కలసి బుధవారం సత్కరించారు.

నిహారిక నిర్మాతగా



కమిటీ కుర్రోళ్లు చిత్రంతో నిర్మాతగా మంచి విజయాన్ని అందుకున్నారు నిహారికా కొణిదెల. తన నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బేనర్‌పై నిర్మించబోయే తదుపరి చిత్రాన్ని ఆమె బుధవారం ప్రకటించారు. ఇందులో సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్నాడు. మానస శర్మ దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.

ప్రతి పాత్ర ప్రత్యేకంగా



గూఢచారి సాహసాల నేపథ్యంలో అల్లుకున్న ఓ ఆసక్తికర కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రం 'చైనా పీస్'. నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలు. అక్కి విశ్వనాథరెడ్డి దర్శకుడు. మూన్‌లైట్ డ్రీమ్స్ బేనర్ నిర్మిస్తోంది. కమల్ కామరాజు, రఘుబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. నిహాల్ కోధాటి పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. సీరియస్ లుక్‌లో నిహాల్ ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో ప్రతి పాత్రకు తనదైన ప్రత్యేకత ఉంటుందని యూనిట్ తెలిపింది. సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్, సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు.

వెంటాడే చిత్రం



క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రం 'బ్లడ్ రోజస్'. రంజిత్‌రామ్, అప్సరరాణి జంటగా నటించారు. ఎంజీఆర్ దర్శకుడు. టీబీఆర్ సినీ క్రియేషన్స్ నిర్మించింది. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా బుధవారం చిత్రబృందం మీడియా సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'మంచి సినిమా చేయాలనే ప్రయత్నం ఈ చిత్రంతో నెరవేరింది. ఈ నెల చివరి వారంలో 'బ్లడ్ రోజస్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అన్నారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. కథలోని భావోద్వేగాలు ప్రేక్షకులను చాలాకాలం పాటు వెంటాడతాయి అని అప్సరరాణి చెప్పారు. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది అని రంజిత్‌రామ్ పేర్కొన్నారు.


బిజినెస్

అంబానీకే మళ్లీ ఫోర్బ్స్ కిరీటం

రెండో స్థానంలో అదానీ.. సంపన్న మహిళ సావిత్రి జిందాల్

- ఫోర్బ్స్ జాబితాలో 205 మంది భారతీయులు
- అందులో 13 మంది తెలుగువారు
- అత్యధిక శ్రీమంతులున్న దేశాల్లో

ఇండియాకు మూడో స్థానం



న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ బిలియనీర్ల జాబితాలో 205 మంది భారతీయులకు చోటు దక్కింది. గత ఏడాదితో పోలిస్తే మనోళ్ల సంఖ్య మరో ఐదు పెరిగింది. భారత కుబేరుల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ 9,250 కోట్ల డాలర్ల (సుమారు రూ.7.91 లక్షల కోట్లు) సంపదతో అగ్రస్థానంలో నిలిచారు. ఆసియాలో ఆయనే నం.1 కాగా ప్రపంచ లిస్ట్‌లో మాత్రం 18వ స్థానంలో నిలిచారు. అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ 5,630 కోట్ల డాలర్ల (రూ.4.81 లక్షల కోట్లు) ఆస్తితో దేశంలో రెండో అత్యంత ధనికుడిగా ఉన్నారు. ప్రపంచ జాబితాలో ఆయనకు 28వ స్థానం దక్కింది. జిందాల్ గ్రూప్ చైర్‌పర్సన్ సావిత్రి జిందాల్ 3,550 కోట్ల డాలర్ల (రూ.3.04 లక్షల కోట్లు) నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో ఉన్నారు. అంతేకాదు, దేశంలో ఆమే అత్యంత సంపన్న మహిళ కూడా. వరల్డ్ ర్యాంకింగ్స్‌లో సావిత్రి జిందాల్ 48వ స్థానంలో ఉన్నారు. హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్ నాడార్ (3,450 కోట్ల డాలర్లు), సన్ ఫార్మా చైర్మన్ దిలీప్ సంఘ్వీ (2,490 కోట్ల డాలర్లు) వరుసగా 4, 5 స్థానాల్లో ఉన్నారు. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా, స్టీల్ టైకూన్ లక్ష్మీ మిట్టల్, డీమార్ట్ సూపర్ మార్కెట్ల అధిపతి రాధాకిషన్ దమానీ, డీఎల్ఎఫ్‌కు చెందిన కేపీ సింగ్ వరుసగా టాప్-10లోని మిగతా స్థానాలను దక్కించుకున్నారు.

మొత్తం సంపద రూ.80.46 లక్షల కోట్లు

ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలోని 205 మంది భారతీయుల మొత్తం సంపద 94,100 కోట్ల డాలర్లుగా (రూ.80.46 లక్షల కోట్లు) నమోదైంది. గత ఏడాది జాబితాలోని 200 మంది బిలియనీర్ల మొత్తం సంపద 95,400 కోట్ల డాలర్లతో పోలిస్తే గణనీయంగా తగ్గింది. గడిచిన ఏడాదిలో అంబానీ, అదానీల ఆస్తి భారీగా తరిగిపోవడం ఇందుకు ప్రధాన కారణం. కాగా, ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది బిలియనీర్లున్న దేశాల్లో అమెరికా (902 మంది), చైనా (516 మంది) తర్వాత మూడో స్థానం మనదే. ప్రపంచ బిలియనీర్లలో సగానికిపైగా ఈ మూడు దేశాల్లోనే ఉండటం గమనార్హం.

3,000 దాటిన ప్రపంచ కుబేరులు..

మొత్తం సంపద రూ.1,377 లక్షల కోట్లు

ఫోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితాలో ఈసారి 3,028 మందికి చోటు దక్కింది. వీరి సంఖ్య 3,000 దాటడం ఇదే తొలిసారి. గత ఏడాదితో పోలిస్తే 247 మంది పెరిగారు. ఈ ఏడాది జాబితాలోని బిలియనీర్ల మొత్తం సంపద గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 2 లక్షల కోట్ల డాలర్లు పెరిగి మొత్తం 16.1 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.1,377 లక్షల కోట్లు) చేరుకుంది.

తెలుగు సంపన్నుల్లో ఫార్మా వారే అధికం

భారత బిలియనీర్లలో 13 మంది తెలుగు వారు కూడా ఉన్నారు. అందులో దివీస్ ల్యాబ్స్ చైర్మన్ మురళి దివి 910 కోట్ల డాలర్ల (సుమారు రూ.77,805 కోట్లు) సంపదతో అగ్రస్థానంలో నిలిచారు. హెటిరో గ్రూప్ అధిపతి పార్థసారధి రెడ్డి 380 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో ఆ తర్వాత స్థానంలో ఉన్నారు. బయోలాజికల్ ఈ లిమిటెడ్‌కు చెందిన మహిమ దాట్ల 320 కోట్ల డాలర్ల ఆస్తితో తెలుగు రాష్ట్రాల్లోని సంపన్న మహిళగా నిలిచారు. తెలుగువారులో అత్యధికం ఫార్మా రంగానికి చెందినవారే కావడం విశేషం.

మస్క్ ప్రపంచ నం.1



ప్రపంచ కుబేరుల్లో టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్ ఏఐ కంపెనీల అధిపతి ఎలాన్ మస్క్ తన అగ్రస్థానాన్ని కొనసాగించారు. 34,200 కోట్ల డాలర్ల ఆస్తితో (రూ.29.24 లక్షల కోట్లు) మరోసారి ప్రపంచ నం.1గా నిలిచారు. మార్క్ జుకెర్‌బర్గ్ 21,600 కోట్ల డాలర్ల నెట్‌వర్త్‌తో 2వ స్థానాన్ని దక్కించుకున్నారు. అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యవస్థాపకులు జెఫ్ బెజోస్ (21,500 కోట్ల డాలర్లు) మూడో స్థానంలో ఉన్నారు. ఒరాకిల్ సహ వ్యవస్థాపకులు లారీ ఎలిసన్ (19,200 కోట్ల డాలర్లు), లూయీ విట్టన్ గ్రూప్ చైర్మన్ బెర్నార్డ్ ఆర్నో కుటుంబం(17,800 కోట్ల డాలర్లు) వరుసగా 4, 5 స్థానాల్లో ఉన్నారు.

తెలుగు బిలియనీర్లు

ప్రపంచ ర్యాంక్	పేరు	ఆస్తి (బి. డాలర్లు)	కంపెనీ
323	మురళి దివి	9.1	దివీస్ లేబొరేటరీస్
948	బీ పార్థసారధి రెడ్డి	3.8	హెటిరో గ్రూప్
1141	మహిమ దాట్ల	3.2	బీ ఈ లిమిటెడ్
1219	జీఎం రావు	3	జీఎంఆర్ గ్రూప్
1265	ప్రతాప్ సీ రెడ్డి	2.9	అపోలో హాస్పిటల్స్
1305	పీపీ రామ్‌ప్రసాద్ రెడ్డి	2.8	అరబిందో ఫార్మా
1408	ఎం సత్యనారాయణ రెడ్డి	2.6	ఎంఎస్ఎన్ గ్రూప్
1513	జూపల్లి రామేశ్వర్ రావు	2.4	మై హోమ్ గ్రూప్
1688	పీ పిచ్చి రెడ్డి	2.1	మేఘా ఇంజనీరింగ్
1688	పీపీ కృష్ణా రెడ్డి	2.1	మేఘా ఇంజనీరింగ్
2233	జీవీ ప్రసాద్	1.5	డాక్టర్ రెడ్డీస్
2233	కే సతీశ్ రెడ్డి	1.5	డాక్టర్ రెడ్డీస్
2479	సుబ్బమ్మ జాస్తి	1.3	సువెన్ లైఫ్

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా



న్యూఢిల్లీ: ప్రముఖ ఆర్థికవేత్త పూనమ్ గుప్తాను ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ప్రభుత్వం నియమించింది. కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఇందుకు ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం ఆమె నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేళ్ల పాటు గుప్తా ఈ పదవిలో ఉంటారు. జనవరిలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైకేల్ డి పాత్రా పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో పూనమ్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. ఆర్థిక శాస్త్రంపై గట్టి పట్టు ఉన్న ఆమె ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుతో సహా పలు సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రధాని ఆర్థిక సలహా మండలిలోనూ ఆమె సభ్యురాలు.

తయారీ రంగం దూకుడు

న్యూఢిల్లీ: మార్చి నెలలో తయారీ రంగం కనివిని ఎరుగని వేగంతో దూసుకుపోయింది. కొత్త ఆర్డర్లు పెరగడంతో పాటు అందుకు అనుగుణంగా వస్తూత్పత్తి కూడా పెరగడంతో తయారీ రంగ సూచీ హెచ్ఎస్‌బీసీ ఇండియా పీఎంఐ 58.1 పాయింట్లకు చేరింది. ఇది ఎనిమిది నెలల గరిష్ఠ స్థాయి. ఫిబ్రవరిలో ఇది 14 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యంలో మార్చి నెల పీఎంఐ అద్భుతమైన రికవరీ సాధించిందని విశ్లేషకులంటున్నారు. అంతర్జాతీయ ఆర్డర్లు కొంతమేరకు తగ్గినా దేశీయ ఆర్డర్లు గణనీయంగా పెరిగాయని వారన్నారు. ఈ సూచీ 50 పాయింట్ల కన్నా పైన ఉంటే వృద్ధిపథంలో ఉన్నదని సంకేతం. గత జూలై తర్వాత మొత్తం విక్రయాలు ఈ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం.

యూకే ఫార్మా కంపెనీ లుపిన్ చేతికి

న్యూఢిల్లీ: బ్రిటన్‌కు చెందిన రెనాసైన్స్ ఫార్మా కంపెనీని 1.23 కోట్ల పౌండ్లకు (రూ.135 కోట్లు) కొనుగోలు చేసినట్టు లుపిన్ ప్రకటించింది. ముంబై కేంద్రంగా పని చేస్తున్న లుపిన్‌కు అనుబంధ విభాగం అయిన లుపిన్ హెల్త్‌కేర్ (యూకే) లిమిటెడ్ ఈ కొనుగోలు చేసింది. దీని ప్రకారం రెనాసైన్స్ పూర్తిగా లుపిన్ యాజమాన్యంలోని సంస్థగా మారుతుంది. తదుపరి దశలో లుపిన్‌కు అనుబంధ కంపెనీగా ట్రేడవుతుందని తెలిపింది. చెవి నొప్పికి వినియోగించే సెఫాలోస్పోరిన్స్ బ్రాండెడ్ ఇంజెక్షన్ సరఫరా చేసే ఏకైక కంపెనీ రెనాసైన్స్ ఇది కాకుండా కార్డియో వాస్కులర్, మూత్రకోశ వ్యాధులకు కూడా రెనాసైన్స్ ఔషధాలు ఉత్పత్తి చేస్తుంది. ఈ కొనుగోలుతో తమ బ్రాండెడ్ ఔషధాల పోర్ట్‌ఫోలియో విస్తరణకు దోహదపడుతుందని లుపిన్ తెలిపింది.

సెన్సెక్స్ 593 పాయింట్లు అప్

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాలను ప్రకటించనున్న నేపథ్యంలో క్రితం సెషన్‌లో భారీగా నష్టపోయిన ఈక్విటీ సూచీలు బుధవారం కాస్త కోలుకున్నాయి. బ్యాంకింగ్, వాహన, ఐటీ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు వేల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో సెన్సెక్స్ 592.93 పాయింట్లు ఎగబాకి 76,617.44 వద్దకు చేరింది. నిఫ్టీ 166.65 పాయింట్ల లాభంతో 23,332.35 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 రాణించాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.38 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం పెరిగాయి.

ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓకు గడువు జూలై 31

నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్(ఎన్ఎస్‌డీఎల్) ఐపీఓను ప్రారంభించేందుకు గడువును సెబీ ఈ జూలై 31 వరకు పొడిగించింది. ఎన్ఎస్‌డీఎల్ రూ.3,000 కోట్ల ఐపీఓకు మార్కెట్ నియంత్రణ మండలి 2024 సెప్టెంబరులోనే ఆమోదం తెలిపింది. డిపాజిటరీ ఐపీఓకు వచ్చేందుకు ఇదివరకున్న గడువు ఈనెల 11తో ముగియనుంది.

యూపీఐ లావాదేవీల జోరు

2024 జూలై-డిసెంబరు మధ్య 42% వృద్ధి



న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ చెల్లింపులు జోరందుకున్నాయి. గత ఏడాది జూలై-డిసెంబరు మధ్య కాలంలో నమోదైన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలే ఇందుకు ఉదాహరణ. ఈ కాలంలో దేశవ్యాప్తంగా 9,323 కోట్ల యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయి. అంతకు ముందు ఆరు నెలలతో పోలిస్తే ఇది 42% ఎక్కువని వరల్డ్‌లైన్ సంస్థ తాజాగా విడుదల చేసిన తన 'ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్ ఫర్ 2హెచ్, 2024'లో పేర్కొంది. లావాదేవీల సంఖ్య, లావాదేవీల విలువ పరంగా చూస్తే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంలు 92-93% మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉన్నాయి. గత ఏడాది జూలై-డిసెంబరు మధ్య కాలంలో యూపీఐ చెల్లింపుల విలువ రూ.99.68 లక్షల కోట్ల నుంచి 31% వృద్ధితో రూ.130.19 లక్షల కోట్లకు చేరింది.

లిథియం ఉత్పత్తిలోకి కోల్ ఇండియా

న్యూఢిల్లీ: బొగ్గు ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉన్న ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) కీలకమైన లిథియం ఖనిజ ఉత్పత్తిలోకి ప్రవేశించాలని యోచిస్తోంది. కంపెనీ సీఎండీ పీఎం ప్రసాద్ ఈ విషయం వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాల్లో ఈ ఖనిజ నిక్షేపాలున్న కొన్ని బ్లాకులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అరుదైన లిథియం ఖనిజాన్ని విద్యుత్ వాహనాల బ్యాటరీలు, పవన విద్యుత్ టర్బైన్స్‌లో పెద్ద ఎత్తున వినియోగిస్తారు. మన దేశంలో ఈ ఖనిజ నిక్షేపాలు పెద్దగా లేవు. దీంతో మన దేశానికి చెందిన అనేక కంపెనీలు ఈ నిక్షేపాలు అధికంగా ఉన్న అర్జెంటీనా, చిలీ, ఆస్ట్రేలియావైపు చూస్తున్నాయి.

మార్చిలో తగ్గిన నియామకాలు

ముంబై: మార్చి నెలలో దేశంలో ఆఫీసు కొలువుల నియామకాలు స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో ఈ నియామకాలు 1.4 శాతం తగ్గాయని నౌకరి.కామ్ తెలిపింది. హోలీ, రంజాన్ పండగలు ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. గత ఏడాది మార్చితో పోలిస్తే గత నెల రిటైల్ రంగంలో 13 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో 10 శాతం, ఎడ్యుకేషన్ రంగంలో 14 శాతం నియామకాలు తగ్గాయి. గత ఏడాది మార్చిలో ఐటీ రంగంలో నియామకాలు 16 శాతం పెరగ్గా, గత నెల మూడు శాతం పడిపోయాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	440
వరంగల్	427	గోదావరి	425
చిత్తూరు	520	విశాఖపట్నం	440
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	146	విజయవాడ	152
వరంగల్	146	గుంటూరు	140
కరీంనగర్	146	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	146	చిత్తూరు	117
కర్నూలు	146	నెల్లూరు	122
విశాఖపట్నం	124	అనంతపురం	122
గోదావరి	152		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	92,850 ▲	85,100 ▲	1,14,000 ▲
విజయవాడ	94,200 ▲	88,500 ▲	1,03,000 ▲
విశాఖపట్నం	89,320 ▲	81,880 ▲	99,930 ▼
రాజమండ్రి	92,840 ▲	85,100 ▲	1,03,100 ▼
ప్రొద్దుటూరు	93,350 ▲	85,880 ▲	1,01,200 ▲
ముంబై	91,000 ▼	83,350 ▼	99.540 ▼

స్పోర్ట్స్

ధీరజ్‌కు శాప్ చైర్మన్ హామీ

- ఆర్చర్‌తో మాట్లాడిన రవి నాయుడు
- నేడు సమస్య పరిష్కారమయ్యే చాన్స్

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

విజయవాడ (స్పోర్ట్స్) : ఆర్చర్లు ధీరజ్, చికిత వీసా కష్టాలపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి శాప్ చైర్మన్ రవినాయుడు స్పందించారు. అమెరికాలో జరిగే ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-1లో ఏపీ క్రీడాకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్గొనాలన్న ఉద్దేశంతో...బుధవారం క్రీడాకారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, పార్లమెంటరీ స్పోర్ట్స్ కమిటీ మెంబర్, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగితో క్రీడాకారులను ఫోన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడించారు. వీసా మంజూరులో సమస్యలను పరిష్కరించి వెంటనే క్రీడాకారులు వరల్డ్ కప్‌లో పాల్గొనే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని వారిని కోరినట్టు శాప్ చైర్మన్ తెలిపారు.

సంజూకి లైన్ క్లియర్

కీపింగ్ బాధ్యతలకు ఓకే



బెంగళూరు : ఐపీఎల్‌లో సంజూ శాంసన్ రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. అలాగే అతడు కీపింగ్ కూడా చేయనున్నాడు. ఈమేరకు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)నుంచి సంజూకి గ్రీన్ సిగ్నల్ లభించింది. గత ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్ సందర్భంగా జోఫ్రా ఆర్చర్ బంతి తగలడంతో శాంసన్ కుడి చూపుడు వేలికి గాయమైన సంగతి తెలిసిందే. దాంతో అతడు ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది. ఫలితంగా ఈ ఐపీఎల్‌లో ఇప్పటి వరకు రాజస్థాన్ ఆడిన మూడు మ్యాచ్‌లలో ఇంపాక్ట్ ఆటగాడిగానే సంజూ బరిలో దిగాడు. ఈనేపథ్యంలో రియాన్ పరాగ్ రాయల్స్‌కి సారథ్యం వహిస్తున్నాడు.

ప్రపంచ బాక్సింగ్ కప్ సెమీస్‌కు జదుమని

న్యూఢిల్లీ: భారత బాక్సర్ జదుమని సింగ్ బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల 50 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో జదుమని 3-2తో ఎలిస్ ట్రోబ్రిడ్జ్ (బ్రిటన్)పై నెగ్గాడు. మిగతా భారత బాక్సర్లలో నరేందర్ బేర్వాల్ (+90 కి), నిఖిల్ దూబే (75 కి), జుగ్ను (85 కి) తమ ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై క్వార్టర్స్‌లోనే వెనుదిరిగారు.


గుజరాత్ అదుర్స్

- మెరిసిన బట్లర్, సిరాజ్
- బెంగళూరు చిత్తు



బట్లర్ (73 నాటౌట్)

బెంగళూరు: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. డాషింగ్ బ్యాటర్ జోష్ బట్లర్ (39 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సర్లతో 73 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సిరాజ్ (3/19) విజృంభించడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 8 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ని చిత్తు చేసింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 169/8 స్కోరు చేసింది. లివింగ్‌స్టోన్ (54), జితేష్ శర్మ (33), టిమ్ డేవిడ్ (32) పోరాడారు. సాయి కిశోర్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లకు 170 పరుగులు చేసి గెలిచింది. సాయి సుదర్శన్ (49) రాణించాడు. హాజెల్‌వుడ్, భువనేశ్వర్ చెరో వికెట్ దక్కించుకొన్నారు.



సిరాజ్ (3/19)

రాణించిన బ్యాటర్లు: బట్లర్ అర్ధ శతకంతో రాణించడంతో.. గుజరాత్ అలవోకగా నెగ్గింది. సుదర్శన్‌తో కలసి రెండో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన బట్లర్.. రూథర్‌ఫోర్డ్ (30 నాటౌట్)తో కలసి మూడో వికెట్‌కు అజేయంగా 63 పరుగులు జోడించాడు. దీంతో టైటాన్స్ మరో 13 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. ఛేదనలో ఓపెనర్లు సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (14) తొలి వికెట్‌కు 32 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. పవర్‌ప్లేలో గుజరాత్ 42/1 స్కోరు చేసింది. ఐదో ఓవర్లో గిల్ అవుటైన తర్వాత వచ్చిన బట్లర్ తొలుత ఆచితూచి ఆడినా తర్వాత చెలరేగిపోయాడు. అయితే, 13వ ఓవర్‌లో బంతి మార్చడంతో చాలెంజర్స్‌కు బ్రేక్ దక్కింది. అర్ధ శతకానికి పరుగు దూరంలో ఉన్న సుదర్శన్‌ను హాజెల్‌వుడ్ క్యాచవుట్ చేశాడు. కానీ, బట్లర్ 4,6తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. మరో ఎండ్‌లో రూథర్‌ఫోర్డ్ కూడా ధాటిగా ఆడాడు. విజయానికి 18 బంతుల్లో 20 పరుగులు కావల్సి ఉండగా.. బట్లర్ మూడు సిక్స్‌లతో మ్యాచ్‌ను ముగించాడు.

చెలరేగిన సిరాజ్: సిరాజ్ నిప్పులు చెరగడంతో.. పవర్‌ప్లేలోనే మూడు టాపార్డర్ వికెట్లను కోల్పోయిన బెంగళూరు ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన బెంగళూరుకు ఆరంభంలోనే గట్టిదెబ్బ తగిలింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ కోహ్లీ (7)ని అర్షద్ క్యాచవుట్ చేయగా.. ఆ తర్వాతి ఓవర్‌లో దేవ్‌దత్ పడిక్కళ్ (4)ను సిరాజ్ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. సిక్స్‌తో ఎదురుదాడి చేసే ప్రయత్నం చేసిన మరో ఓపెనర్ ఫిల్ సాల్ట్ (14)ను కూడా సిరాజ్ పెవిలియన్ చేర్చడంతో.. ఆరు ఓవర్లకు బెంగళూరు 38/3తో కష్టాల్లో పడింది. కెప్టెన్ రజత్ పటీదార్ (12)ను ఇషాంత్ వికెట్ల ముందు దొరకబుచ్చుకొన్నాడు. ఈ దశలో లివింగ్ స్టోన్‌కు జత కలసిన జితేష్ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. దీంతో 10 ఓవర్లు ముగిసే సరికి ఆర్‌సీబీ 73/4 స్కోరు చేసింది. కానీ, జితేష్‌ను కిశోర్ అవుట్ చేయడంతో.. ఐదో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన క్రునాల్ పాండ్యా (5)ను కూడా కిశోర్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపాడు. అయితే, డెత్ ఓవర్లలో లివింగ్‌స్టోన్, డేవిడ్ ధాటిగా ఆడుతూ ఏడో వికెట్‌కు 24 బంతుల్లో 46 పరుగులు జోడించారు. రషీద్ వేసిన 18వ ఓవర్‌లో మూడు సిక్స్‌లు బాదిన లివింగ్‌స్టోన్ అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. కానీ, ఆవెంటనే సిరాజ్ బౌలింగ్‌లో క్యాచవుట్ అయ్యాడు. ఆఖరి ఓవర్‌లో డేవిడ్ రెండు ఫోర్లు, సిక్స్‌తో టీమ్ స్కోరును 160 మార్క్ దాటించాడు. మొత్తంగా చివరి 5 ఓవర్లలో బెంగళూరు 64 పరుగులు రాబట్టింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
పంజాబ్	2	2	0	0	4	1.485
ఢిల్లీ	2	2	0	0	4	1.320
బెంగళూరు	3	2	1	0	4	1.149
గుజరాత్	3	2	1	0	4	0.807
ముంబై	3	1	2	0	2	0.309
లఖ్‌నవూ	3	1	2	0	2	-0.150
చెన్నై	3	1	2	0	2	-0.771
హైదరాబాద్	3	1	2	0	2	-0.871
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
కోల్‌కతా	3	1	2	0	2	-1.428

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు — వేదిక: కోల్‌కతా

కోల్‌కతా x హైదరాబాద్ రా.7.30

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (బి) సిరాజ్ 14, కోహ్లీ (సి) ప్రసిద్ధ్ (బి) అర్షద్ 7, పడిక్కళ్ (బి) సిరాజ్ 4, పటీదార్ (ఎల్బీ) ఇషాంత్ 12, లివింగ్‌స్టోన్ (సి) బట్లర్ (బి) సిరాజ్ 54, జితేశ్ (సి) తెవాటియా (బి) సాయి కిషోర్ 33, క్రునాల్ (సి అండ్ బి) సాయి కిషోర్ 5, టిమ్ డేవిడ్ (బి) ప్రసిద్ధ్ 32, భువనేశ్వర్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 169/8; వికెట్ల పతనం:** 1-8, 2-13, 3-35, 4-42, 5-94, 6-104, 7-150, 8-169. **బౌలింగ్:** సిరాజ్ 4-0-19-3, అర్షద్ 2-0-17-1, ప్రసిద్ధ్ 4-0-26-1, ఇషాంత్ 2-0-27-1, సాయి కిషోర్ 4-0-22-2, రషీద్ 4-0-54-0.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) ఇషాంత్ (బి) హాజెల్‌వుడ్ 49, గిల్ (సి) లివింగ్‌స్టోన్ (బి) భువనేశ్వర్ 14, బట్లర్ (నాటౌట్) 73, రూథర్‌ఫర్డ్ (నాటౌట్) 30, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 17.5 ఓవర్లలో 170/2; వికెట్ల పతనం:** 1-32, 2-107; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-23-1, హాజెల్‌వుడ్ 3.5-0-43-1, యశ్ 3-0-20-0, రసిఖ్ 3-0-35-0, క్రునాల్ 3-0-34-0, లివింగ్‌స్టోన్ 1-0-12-0.

గోయెంకా..మళ్లీ అదే తీరు!



లఖ్‌నవూ: గత సీజన్ ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నాటి కెప్టెన్ కేఎల్ రాహుల్‌కు ఫ్రాంచైజీ యజమాని సంజీవ్ గోయెంకా మైదానంలోనే క్లాస్ పీకడం పెద్ద దుమారం లేపింది. తాజాగా మంగళవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ ఓడిపోయింది. సీజన్‌లో ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌లలో సూపర్ జెయింట్స్‌కిది రెండో పరాజయం కావడం గమనార్హం. అలాగే కెప్టెన్ పంత్ బ్యాటుతోపాటు, సారథిగానూ విఫలమయ్యాడు. ఈనేపథ్యంలో..పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం గ్రౌండ్‌లోనే పంత్‌తో గోయెంకా మాట్లాడాడు. ఆ సందర్భంగా పంత్‌వైపు వేలు చూపుతూ సీరియస్‌గా ఏదో అనడం కనిపించింది. ఈ సీన్‌పై ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా చర్చ జరుగుతోంది.

వన్డే సిరీస్ కూడా కివీస్‌దే..

హామిల్టన్ : ఐదు టీ20ల సిరీస్‌ను 4-1తో గెలిచిన న్యూజిలాండ్..పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌నూ మరో మ్యాచ్ ఉండగానే సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన రెండో వన్డేలో 84 పరుగులతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తొలుత కివీస్ 50 ఓవర్లలో 292/8 స్కోరు చేసింది. కీపర్ మిచెల్ హే (99 నాటౌట్) ఒక్క పరుగుతో సెంచరీ మిస్సయ్యాడు. ఛేదనలో సీర్స్ (5/59) ధాటికి పాకిస్థాన్ 41.2 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది.

ముంబైకి బై.. గోవాకి జై!

యశస్వీ జైస్వాల్ అనూహ్య నిర్ణయం



ముంబై: యువ ఆటగాడు యశస్వీ జైస్వాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. తన అంతర్జాతీయ కెరీర్‌కు పునాదులు వేసిన ముంబై జట్టును వీడనున్నాడు.. 2025-26 సీజన్ నుంచి దేశవాళీల్లో గోవాకి ఆడనున్నాడు. జాతీయ జట్టు మ్యాచ్‌లు లేకుంటే...23 ఏళ్ల జైస్వాల్ దేశవాళీల్లో గోవా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశముంది.. వ్యక్తిగత కారణాలతోనే ముంబైని వీడాలని యశస్వీ నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈమేరకు నిరభ్యంతర పత్రం ఇవ్వాలని కోరుతూ ముంబై క్రికెట్ సంఘం(ఎంసీఏ)నికి అతడు లేఖ రాశాడు. దానిని ఆమోదిస్తూ ఎంసీఏ బుధవారం నిర్ణయం తీసుకుంది. జైస్వాల్ జమ్మూ కశ్మీర్‌తో గత జనవరిలో జరిగిన గ్రూప్-ఎ రంజీ లీగ్ మ్యాచ్‌లో ముంబైకి చివరిసారి ప్రాతినిధ్యం వహించాడు. ఆ మ్యాచ్‌లో అతడు 4, 26 పరుగులు చేశాడు. కాగా..ఆ మ్యాచ్‌లో ముంబై ఓడింది. 'జైస్వాల్ మా జట్టుకు ఆడాలని నిర్ణయించుకున్నాడు. అతడికి స్వాగతం' అని గోవా క్రికెట్ సంఘం కార్యదర్శి షంబా దేశాయ్ అన్నాడు. ఇటీవలి కాలంలో అర్జున్ టెండూల్కర్, సిద్దేశ్ లాడ్ కూడా ముంబైని వీడి గోవా జట్టుకు వెళ్లడం గమనార్హం.

కారణం అదేనా?

ముంబై జట్టు యాజమాన్యంపై అసంతృప్తి కారణంగానే జైస్వాల్ గోవా వెళ్లాలన్న నిర్ణయానికి కారణమని సమాచారం. కశ్మీర్‌తో మ్యాచ్ సందర్భంగా జైస్వాల్, ముంబై జట్టు సీనియర్ ఆటగాడికి నడుమ గొడవ జరిగినట్టు తెలిసింది. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో జైస్వాల్ షాట్ ఎంపికను ఆ సీనియర్ ఆటగాడు ప్రశ్నించాడట. దాంతో యశస్వీ..తొలి ఇన్నింగ్స్‌లో ఆ సీనియర్ క్రికెటర్ షాట్ ఎంపికను ప్రస్తావించి అతడి ప్రశ్నను తిప్పికొట్టినట్టు తెలిసింది.

ముంబై జట్టును కొనుగోలు చేసిన సారా



ముంబై: సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ క్రికెట్ వ్యాపారంలోకి ప్రవేశించింది. గ్లోబల్ ఈ-క్రికెట్ ప్రీమియర్ లీగ్ (జీఈపీఎల్)లో ముంబై ఫ్రాంచైజీని సారా కొనుగోలు చేసింది. గతేడాదే మొదలైన ఈ లీగ్ విజయవంతమైంది. దీంతో ఇప్పుడు రెండో సీజన్‌లో కొత్త జట్లను ఆహ్వానించారు. ఇందులో భాగంగా ముంబై జట్టును సారా కొనుక్కుంది. జీఈపీఎల్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద ఈ-క్రికెట్ లీగ్. రియల్ క్రికెట్-24 అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై లీగ్ జరుగుతుంది. లీగ్ ఫైనల్ ఈ ఏడాది మే నెలలో జరగనుంది.

'నోట్ బుక్' సంబరాలు.. దిగ్వేష్‌కు జరిమానా



లఖ్‌నవూ: ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీపై బీసీసీఐ కొరడా ఝుళిపించింది. అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతోపాటు రాఠీ ఖాతాలో ఓ డీ మెరిట్ పాయింట్ చేర్చారు. పంజాబ్‌తో మ్యాచ్‌లో ప్రియాన్ష్ ఆర్య అవుటైనప్పుడు ఓ లెటర్ రాస్తున్నట్టుగా దిగ్వేష్ తన చేతులతో అతిగా ప్రవర్తించాడు. వెంటనే ఫీల్డ్ అంపైర్ అతడిని వారించాడు. వెస్టిండీస్ పేసర్ కెస్రిక్ విలియమ్స్ కూడా ఇలాగే వికెట్ పడగొట్టినప్పుడు 'నోట్ బుక్ సెలబ్రేషన్స్' చేసుకొనే వాడు. 2019 ద్వైపాక్షిక సిరీస్‌లో కోహ్లీని అవుట్ చేసిన సమయంలో విలియమ్స్ ఇలాంటి సంబరాలే చేసుకొన్నాడు. కాగా, దిగ్వేష్ తీరును మాజీలు గవాస్కర్, కైఫ్ తప్పుబట్టారు.

బీజేపీ, బీఆర్ఎస్ మాటలకు బోల్తా పడొద్దు

» వారు మిమ్మల్ని పావులా వాడుకుంటున్నారు: జూపల్లి



హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ నేతల మాటలకు బోల్తా పడొద్దని విద్యార్థులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. వారు రాజకీయ లబ్ధి కోసం విద్యార్థులను పావులుగా వాడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ నుంచి ప్రభుత్వం ఒక్క ఇంచు భూమిని కూడా తీసుకోవట్లేదని, కంచ గచ్చిబౌలిలోని ఆ 400 ఎకరాల భూమి హెచ్‌సీయూకి సంబంధినది కానే కాదని చెప్పారు. ఈ 400 ఎకరాల భూమి గత 20 ఏళ్లుగా వివాదంలో ఉందని, పదేళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌లు దానిని కాపాడే ప్రయత్నాలు ఎందుకు చేయలేదని మంత్రి నిలదీశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో సరైన న్యాయవాదులను పెట్టి ఆ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడారన్నారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం హెచ్‌సీయూ నుంచి 534 ఎకరాలు తీసుకుని బదులుగా గోపన్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని 397 ఎకరాల ప్రభుత్వ భూమిని వర్సిటీకి స్వాధీనం చేసిందని, ఆ 534 ఎకరాల్లోనే ఈ 400 ఎకరాలున్నందున వర్సిటీ నుంచి ప్రభుత్వం ఈ భూమిని గుంజుకుందన్న అంశం ఉత్పన్నం కాదన్నారు. ఇప్పుడు పెడ బొబ్బలు పెడుతున్న బీఆర్ఎస్, పదేళ్ల పాలనలో 31 వేల కోట్ల విలువైన 453 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్మిందన్నారు. దేశంలో గత పదేళ్లలో 16 లక్షల ఎకరాల అడవిని నాశనం చేసిన అధికార బీజేపీకి కంచ గచ్చిబౌలి భూమిపై మాట్లాడే నైతిక హక్కు ఉందా అని ప్రశ్నించారు.



న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఈటల

హెచ్‌సీయూ భూములు అమ్మితే ఖబడ్దార్

» బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

» ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బీజేపీ ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూములను అమ్మితే సహించేది లేదని, ఖబడ్దార్ అంటూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తెలంగాణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు హెచ్‌సీయూ భూముల అంశంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఈటల సహా తెలంగాణ బీజేపీ ఎంపీలు బుధవారం నిరసన తెలియజేశారు. ఎంపీలు గోడం నగేష్, రఘునందన్‌రావు, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డితోపాటు బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. అనంతరం ఈటల విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌సీయూ భూమల వేలాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాలను రూ.40 వేల కోట్లకు అమ్మి ప్రభుత్వాన్ని నడపాలనే సిగ్గుమాలిన పనికి రాష్ట్ర ప్రభుత్వం ఒడిగట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, భూముల వేలాన్ని నిలిపివేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. భూముల అమ్మకంపై ప్రభుత్వం ముందుకువెళితే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని రఘునందన్‌రావు పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ రాష్ట్ర ఆస్తులను అడ్డగోలుగా అమ్మిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తోందని డీకే అరుణ ఆరోపించారు. రాష్ట్రాన్ని నడపడానికి భూముల అమ్మకానికి ప్రభుత్వం సిద్ధపడడం శోచనీయమని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

విద్యార్థులపై లాఠీ చార్జి ఘోరం: బీఆర్ఎస్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జి చేయడాన్ని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ నేతలు జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎర్రోళ్ల శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. హెచ్‌సీయూ భూముల విషయంలో సీఎం రేవంత్, ఏపీ సీఎం చంద్రబాబుని అనుసరిస్తున్నారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు హయాంలో హెచ్‌సీయూ భూములను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయని టీడీపీలో ఉన్నప్పుడు రేవంత్ అన్నారని గుర్తు చేశారు. ఈ భూముల విషయంలో గతంలో గురువు మొదలుపెట్టిన పనిని శిష్యుడు రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారన్నారు. హెచ్‌సీయూలోని మూడు చెరువులు ఉన్నాయని, వాటిని రక్షించాల్సిన హైడ్రా ఏమైందని ప్రశ్నించారు. హెచ్‌సీయూ భూముల అంశంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకం ఆడుతున్నాయని ఆరోపించారు. ఇక, తెలంగాణ ఉద్యమంలో మాదిరిగానే నేడు హెచ్‌సీయూ విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం అనుచిత దాడులకు తెగబడుతోందని బీఆర్ఎస్‌నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. కాగా, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వంపై నోరుపారేసుకున్న మేధావులు.. కోదండరాం, ఆకునూరి మురళి.. ఇప్పుడు ఎందుకు నోరు విప్పడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. సదరు మేధావులు.. సీఎం రేవంత్‌కు ఎందుకు గొడుగు పడుతున్నారని నిలదీశారు. కాగా, హెచ్‌సీయూలో భాగమైన కంచగచ్చిబౌలిలోని భూముల్లో ఉన్న చెట్లను నరికి, వన్య ప్రాణులకు, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ అటవీ శాఖకు బుధవారం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ మెరూకు ఓ వినతి పత్రం అందజేశారు.

బీజేపీని కాపాడేందుకే రేవంత్ డైవర్షన్ డ్రామా

» బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లకుండా కుట్ర

» మైహోంపైకి బుల్డోజర్లు పంపే దమ్ముందా?: కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లులను కోల్డ్‌స్టోరేజీకి పంపేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ పకడ్బందీ స్ర్కీన్‌ప్లే రచించిందని, ఈ విషయంలో బీజేపీని కాపాడేందుకు రేవంత్ రెడ్డి డైవర్షన్ డ్రామా మొదలుపెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ చేసిన తీర్మానాలను తెరమరుగు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తే.. తనకు అండగా ఉన్న బీజేపీ ఇరుకున పడుతుందని రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. హెచ్‌సీయూ భూముల విషయమై ఆమె మాట్లాడుతూ.. ఆ భూములను వర్సిటీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. "హైడ్రా, మూసీ పేరిట పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చిన రేవంత్‌రెడ్డికి మైహోంపైకి బుల్డోజర్లను పంపే దమ్ముందా?"అని ప్రశ్నించారు. మరోవైపు రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ బీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు మాదిరిగా తొమ్మిదో షెడ్యూల్‌లో బిల్లును చేర్చాలంటే ముందు గవర్నర్ ఆమోదం అవసరమని.. అలా కాకుండా ఢిల్లీలో ధర్నాలు చేస్తే.. బీసీలకు న్యాయం జరగదని ఆయన వ్యాఖ్యానించారు.

వర్గీకరణ ఉద్యమకారులపై కేసులు ఎత్తేయాలి

» మంత్రి దామోదరకు మాదిగ దండోరా నేతల వినతి

ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఉద్యమకారులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని మాదిగ దండోరా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు మంత్రి దామోదరను మాదిగ దండోరా ఉద్యమకారులు కలిశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయడానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌సీయూలో అంగుళం కూడా స్వాధీనం చేసుకోలేదు

న్యాయపోరాటం చేసి ప్రజల భూమిని కాపాడాం

సాఫ్ట్‌వేర్ హబ్‌గా మార్చి లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తాం.. రాహుల్‌కు అన్ని విషయాలు తెలుసు

బీఆర్ఎస్ బిల్లీరావుతో కుమ్మక్కై భూమిని కాజేయాలనుకుంది: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిలో ఒక అంగుళం కూడా తెలంగాణ ప్రభుత్వం స్వాధీన పరుచుకోలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు చెప్పి విద్యార్థులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. 2004లోనే ప్రభుత్వం హెచ్‌సీయూకు 397ఎకరాలను కేటాయించి అందుకు బదులుగా 400ఎకరాలు తీసుకుందని ఆయన గుర్తు చేశారు. ఈ భూమిని గతంలో బిల్లీరావుకు చెందిన ఐఎంజి భారత్ అనే సంస్థకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో కేటాయించారని, అది ఆయన చేతుల్లోకి పోకుండా హైకోర్టు, సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేసి తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించిందని భట్టి చెప్పారు. వేల కోట్ల రూపాయల విలువైన ఈ భూమి తెలంగాణ ప్రజలదని, సాఫ్ట్ వేర్ హబ్‌గా మార్చి లక్షలాది మంది యువకులకు ఉపాధి కల్పిస్తామన్నారు. అంతర్జాతీయ సంస్థలకు బిడ్డింగ్ ద్వారా భూములు కేటాయించి ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చాలనుకుంటున్నామని భట్టి తెలిపారు. తాము భూమిని ప్లాట్లుగా చేసి అమ్ముకోవడం లేదన్నారు.

పర్యావరణానికి హాని కలిగించం


ఈ భూమిలో పర్యావరణానికి హాని కలిగించే పనులు ఏమీ చేయడం లేదని, అక్కడి సరస్సులు, రాళ్లూ అలాగే ఉంటాయని భట్టి చెప్పారు. తమ నేత రాహుల్ గాంధీకి అన్ని విషయాలు తెలుసని, లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించే పనులు చేస్తున్నామంటే ఆయన హర్షిస్తారని చెప్పారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు కూడా ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని, వారి భవిష్యత్తుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

బిల్లీరావుతో కుమ్మక్కై కాజేయాలని చూశారు

2014 నుంచి 2023 వరకూ ఈ భూమిపై కేసీఆర్ ప్రభుత్వం బలంగా న్యాయపోరాటం చేయకుండా బిల్లీరావు అనే ప్రైవేట్ వ్యక్తితో కుమ్మక్కై వేల కోట్ల రూపాయల ప్రజల భూమిని కాజేయాలని చూసిందని భట్టి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే గతంలో ఐఎంజికి కేటాయించిన భూమిని రద్దు చేసిందని, దానిపై బిల్లీరావు హైకోర్టుకు వెళ్లారని, పదేళ్ల టీఆర్ఎస్ ప్రభుత్వంలో గట్టిగా న్యాయపోరాటం చేయలేదని భట్టి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బలంగా న్యాయపోరాటం చేసిందని, హైకోర్టు తీర్పు తనకు వ్యతిరేకంగా రావడంతో బిల్లీరావు సుప్రీంకోర్టుకు వెళ్లారని, అక్కడా విజయం సాధించలేకపోయారని భట్టి చెప్పారు. 2 దశాబ్దాలుగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న ప్రజల భూమిని తాము పోరాడి సాధించామని, ఇంత చేసినా తాము ఆ విషయాన్ని ప్రచారం చేసుకోలేకపోతున్నామని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను డాక్యుమెంట్లతో సహా వివరించిన తర్వాత యూనివర్సిటీ అధ్యాపకుల ప్రతినిధులు అర్థం చేసుకున్నారని చెప్పారు. బీజేపీ నేతలకు వాస్తవాలు తెలిసినా రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేస్తున్నారని భట్టి చెప్పారు.

చెట్ల నరికివేత ఆపండి

(మొదటిపేజీ తరువాయి)



ప్రజా ప్రయోజన వ్యాజ్యాల(పిల్స్)పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుకతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఎల్ రవిచందర్, ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్(ఏజీ) సుదర్శన్‌రెడ్డి వాదించారు. అడవి అంటే ఏంటనే నిర్వచనం ఏ చట్టంలోనూ స్పష్టంగా లేదని, ఒకే చోట 125 ఎకరాల విస్తీర్ణంలో చెట్లు ఉంటే అది అడవి కిందికే వస్తుందని, 'ఏదేని ఒక విశాల ప్రదేశంలో చెట్లు దట్టంగా ఉంటే అది అడవి' అన్న ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అర్థాన్నే సుప్రీంకోర్టు కూడా పరిగణలోకి తీసుకుందని పిటిషనర్ల తరపున న్యాయవాదులు వాదించగా.. కంచ గచ్చిబౌలిలోని భూమి ముమ్మాటికీ ప్రభుత్వ భూమేనని, దాన్ని పరిశ్రమల కోసమే కేటాయించారని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గూగుల్ ఇమేజ్‌లు తప్ప అవి అటవీ భూములు అనడానికి ఏ రికార్డూ లేదని చెప్పారు. అటవీ భూముల నిర్ధారణలో గూగుల్ ఇమేజ్‌లను పరిగణలోకి తీసుకోలేమంటూ సుప్రీంకోర్టే స్వయంగా చెప్పిందని పేర్కొన్నారు. "అటు రెవెన్యూ రికార్డుల్లో.. ఇటు అటవీ రికార్డుల్లో సదరు భూమి అడవి అని ఎక్కడా లేదు. ఫొటోలను పట్టుకుని అటవీ భూమి అని నిర్ధారిస్తాం?" అని ఎదురు ప్రశ్నించారు. "పాములు, ముంగీసలు, నెమళ్లు ఉంటే అడవి అయిపోతుందా? అయితే హెచ్‌సీయూ కూడా అడవే. అంతెందుకు హైదరాబాద్‌లో చాలా ప్రాంతాన్ని అడవిగానే గుర్తించాల్సి వస్తుంది. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్‌లో కూడా పాములు, నెమళ్లు ఉన్నాయి. దాన్నికూడా అడవి అంటారా?" అని వాదించారు.

200 ఎకరాల్లో చెట్లను నరికేశారు

బుధవారం విచారణ సందర్భంగా తొలుత పిటిషనర్ల తరపున న్యాయవాదులు వాదనలను ప్రారంభిస్తూ.. "వాల్టా చట్టం ప్రకారం మూడు మీటర్ల కంటే పొడవున్న ఒక్క చెట్టును నరకాలన్నా సంబంధిత అధికారి అనుమతి అవసరం. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే కంచ గచ్చిబౌలిలో వేల చెట్లను తొలగించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ముందస్తుగా ఎలాంటి అనుమతులు పొందలేదు. ప్రభుత్వ భూమి అయినా ప్రైవేటు భూమి అయినా అటవీ రూల్స్ వర్తిస్తాయి. 'అక్కడ జంతువులు లేవు.. జింకలు లేవు.. గుంట నక్కలు మాత్రమే ఉన్నాయి' అని ప్రభుత్వ పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ సంస్థ హైడ్రా చెరువులను గుర్తించేందుకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ చిత్రాలను వినియోగిస్తోంది. అదేవిధంగా ఈ ప్రాంతం ఇమేజ్‌లు తెప్పించండి. అక్కడ ఏం ఉందో తెలుస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతంలో చెట్లు కొట్టేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. ఆ కమిటీ అధ్యయనం చేసి అనుమతించిన తర్వాతనే చెట్లను నరికివేయాలి. కానీ, ఈ కేసులో ఎలాంటి అనుమతులు లేకుండానే వందల ఎకరాల్లో చెట్లను నరికి సుప్రీంకోర్టు ఆదేశాల ధిక్కరణకు పాల్పడ్డారు. ఒకవేళ ఈ పిటిషన్లను హైకోర్టు అనుమతిస్తే నరికేసిన అడవిని ప్రభుత్వం ఎలా పునరుద్ధరిస్తుంది" అని ప్రశ్నించారు. "అడవుల సంరక్షణ నిబంధనలు-2023 ప్రకారం అడవులు, అడవుల తరహాలో ఉండే భూముల రికార్డులను రూపొందించడానికి ప్రతీ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం నిపుణుల కమిటీ వేయాలని 'అశోక్ కుమార్ శర్మ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఈ ఏడాది మార్చి 4న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. కానీ, తెలంగాణ ప్రభుత్వం నిపుణుల కమిటీ వేయకుండానే అడవిని కొట్టేస్తోంది. యాభైకి పైగా భారీ యంత్రాలను, సిబ్బందిని మోహరించి పనులు చేస్తున్నారు. వట ఫౌండేషన్ మొదట పిటిషన్ దాఖలు చేసిన రోజు హైకోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. హైకోర్టులో కేసు విచారణలో ఉండగా బాధ్యతగల రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదన్న విశ్వాసంతోనే హైకోర్టు జోక్యం చేసుకోలేదు. కానీ, దీన్ని అదనుగా తీసుకొని ప్రభుత్వం రాత్రింబవళ్లు పనులు చేస్తూ చెట్లను కొట్టేస్తోంది. ఇప్పటికే 200 ఎకరాల్లో వృక్ష సంపదను నరికేశారు. ఆకాశహర్మ్యాలు, భారీ కాంక్రీట్ నిర్మాణాల మధ్య పర్యావరణాన్ని సమతౌల్యం చేస్తూ అనేక రకాల జీవజాతులు, జలవనరులతో ఉన్న ప్రాంతాన్ని తొలగించడం సమంజసం కాదు" అని వాదించారు.

గతంలో కేటాయింపులపై ఎందుకు మాట్లాడలేదు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్(ఏజీ) సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. వివాదం నడుస్తున్న భూమి మొదటి నుంచీ పరిశ్రమల కోసం ఉద్దేశించిందేనని కోర్టుకు తెలిపారు. "2003లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం క్రీడాభివృద్ధి, మౌలికసదుపాయాల ఏర్పాటు కోసం ఐఎంజీ అకాడమీస్ భారత అనే ప్రైవేటు సంస్థకు రూ.50 వేలకు ఎకరం చొప్పున నామమాత్రపు ధరకే ఈ భూములను కేటాయించింది. కానీ, ఆ తర్వాత వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఐఎంజీ భారత పేరిట చేసిన సేల్ డీడ్‌ను, ఎంవోయూను రద్దు చేసింది. దీన్ని ఐఎంజీ భారత సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది. హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇస్తూ.. భూకేటాయింపు రద్దు సబబేనని పేర్కొంది. ఈ తీర్పును ఐఎంజీ భారత సంస్థ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వానికే అనుకూలంగా తీర్పు వచ్చింది. ఏళ్లతరబడి సుప్రీం కోర్టు వరకు వెళ్లి ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోకుండా రక్షించుకున్నాం. ప్రజల అవసరాల కోసమే వాటిని వినియోగిస్తున్నాం. ఇప్పుడు అటవీ భూమిని ఐటీ కంపెనీలకు కేటాయిస్తున్నారని గగ్గోలు పెడుతున్నవారు.. గతంలో ప్రైవేటు వ్యక్తులకు, ఇతర సంస్థలకు ఇస్తే ఎందుకు మాట్లాడలేదు. రాష్ట్రంలో 1990 నుంచి ప్రభుత్వాలు.. 25 సర్వే నెంబరులోనే బస్సు డిపోకు 6.05 ఎకరాలు, బీఎస్ఎన్ఎల్‌కు ఎకరం, నవోదయ పాఠశాలకు 31ఎకరాలు, మండల కార్యాలయాల కాంప్లెక్స్‌కు ఐదు ఎకరాలు, స్పోర్ట్స్ అథారిటీ అండ్ టిమ్స్‌కు 117 ఎకరాలు, టీఎన్జీవోస్ హౌసింగ్ కోసం 134ఎకరాలు, అప్రోచ్ రోడ్డుకు 31ఎకరాలు, సబ్‌స్టేషన్ కోసం 12.25 ఎకరాలు, ట్రిపుల్ ఐటీకి 81 ఎకరాలు కేటాయించాయి. అప్పుడు ఎవరూ దీన్ని ప్రశ్నించలేదు" అన్నారు. "ఈ 400 ఎకరాలతో పాటు సరూర్‌నగర్ మండలం మామిడిపల్లిలో 450 ఎకరాలను కూడా పరిశ్రమల కోసం కేటాయించారు. భవిష్యత్తులో సదరు మామిడిపల్లి భూములను కూడా అటవీ భూములు అంటారేమో" అని ఏజీ వ్యాఖ్యానించారు. ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. ఐఎంజీ అకాడమీస్ భారత తీర్పులో ఎక్కడైనా "సదరు భూమి స్వభావం ఏంటి అని ఉందా?" అని ఏజీని ప్రశ్నించింది. దీనికి ఏజీ సమాధానం ఇస్తూ.. భూమి స్వభావం ఏంటి అని పేర్కొనాల్సిన అవసరమే లేదని, కంచ అంటేనే గడ్డి కోసం కేటాయించిన భూములని పేర్కొన్నారు. పశువుల పోషణకు నిజాం రాజు హైదరాబాద్‌కు నలుదిక్కులా గడ్డి కోసం ప్రత్యేకంగా భూములను ఇచ్చారన్నారు. సమయం లేకపోవడంతో విచారణను గురువారం మధ్యాహ్నం 2.15గంటలకు వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది. అప్పటివరకు ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టరాదని స్పష్టం చేసింది.

వర్సిటీలకు వందల ఎకరాలెందుకు?

» ఇదేం మహారాజుల కాలం కాదు

» గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు

» సోషల్ మీడియాలో వైరల్



హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూవివాదంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అట్టుడుకుతున్న వేళ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ వీడియోలో వర్సిటీలకు వందల ఎకరాలు ఎందుకంటూ ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "అవేమైనా రాజదర్బార్‌లా.. యూనివర్సిటీలకు వందల ఎకరాలు అవసరం లేదు. ఇదేం మహరాజుల కాలం కాదు. పట్టణప్రాంతాల్లో ఉన్న భూములను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలి. పేదలకు ఇళ్లు, ఆస్పత్రులు కట్టించాల్సిన అవసరం ఉంది. నేను గట్టి మనిషిని. అనుకున్నది సాధించే దాకా పోరాడి తీరుతా. నేనెవరికీ భయపడను. ఇటీవల హార్టికల్చర్ యూనివర్సిటీకి 500 ఎకరాలు కావాలని అడిగితే.. 50ఎకరాలు సరిపోతుంది అని ప్రధాని మోదీకే చెప్పా" అని ఆయన వ్యాఖ్యానించినట్టుగా ఆ వీడియోలో ఉంది. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఇటీవల కేటీఆర్ ప్రకటించిన రెండు రోజుల్లోనే సోషల్ మీడియాలో కేసీఆర్ వ్యాఖ్యలతో కూడిన వీడియో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది.

పర్యావరణానికి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టండి

» హెచ్‌సీయూలో ఏం జరుగుతుందో నివేదిక ఇవ్వండి: కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల అంశంలో జరుగుతున్న పరిణామాలపై కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పందించింది. హెచ్‌సీయూలో చెట్లు, జీవాలకు హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుని, పర్యావరణానికి విఘాతం కలగకుండా చూడాలని రాష్ట్ర అటవీ శాఖను ఆదేశించింది. భారతీయ అటవీ చట్టం లేదా స్థానిక అటవీ, వన్యప్రాణి చట్టాల ప్రకారం తగు చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఘటనపై తమకు సమగ్ర నివేదిక అందజేయాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ అటవీ శాఖ అదనపు కార్యదర్శికి కేంద్ర అటవీ శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.సురేందర్ నుంచి లేఖ అందింది.

కంచ గచ్చిబౌలి విధ్వంసంతో జీవ వైవిధ్యానికి దెబ్బ

» ఈ భూముల్లో 233 రకాల పక్షి జాతులు

» అత్యంత అరుదైన 72 వృక్ష జాతులున్నాయి

» సహజ అడవిని కోల్పోతే నగరం నరకమే

» అరుణ్ వాసిరెడ్డి, హరగోపాల్ ఆందోళన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): కొన్ని వేల వృక్షాలు, జంతువులు, పక్షులు, కీటకాలకు ఆవాసమైన కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని కట్టడాలుగా మారిస్తే, జీవ వైవిధ్యత దెబ్బతింటుందని పర్యావరణ శాస్త్రవేత్త అరుణ్ వాసిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సహజసిద్ధంగా ఏర్పడిన అడవిని కోల్పోతే నగరం నరకంగా మారుతుందనడంలో సందేహంలేదన్నారు. కంచ గచ్చిబౌలిలోని వృక్ష, జంతుజాలాలకు సంబంధించిన ఒక నివేదికను బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ భూముల్లో 233 రకాలకుపైగా అరుదైన పక్షిజాతులు, 200కుపైగా జింకలు ఉన్నాయని ఆయన తెలిపారు. అత్యంత అరుదైన 72రకాల వృక్ష జాతులకు కంచ గచ్చిబౌలీ చిరునామా అని తెలిపారు. 2024లో షెడ్యూల్ 1 జాబితాకెక్కిన 27రకాల పక్షులు, ఉడుములు, కొండచిలువలు, నక్షత్రతాబేలు, నాలుగు కొమ్ముల జింక తదితర 4రకాల జంతువులు ఉన్నాయని పేర్కొన్నారు. వాటికి ఎలాంటి నష్టం తలపెట్టినా చట్టరీత్యా నేరమని గుర్తుచేశారు. కంచ గచ్చిబౌలిలోని 400ఎకరాల భూమి చట్టపరంగా తెలంగాణ ప్రభుత్వానిదే కావచ్చని, అయితే నైతికంగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానిదే" అని ప్రముఖ సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ వ్యాఖ్యానించారు. అనేక జీవజాతులకు, వృక్షసంపదకు ఆలవాలమైన ఆ భూమిని యాభై ఏళ్లుగా పరిరక్షిస్తున్నది హెచ్‌సీయూనే చెప్పారు. ఇప్పటికి దాన్ని కాపాడడానికి వర్సిటీ విద్యార్థులు నిద్రాహారాలు మాని మరీ పోరాడుతున్నారని చెప్పారు. హెచ్‌సీయూ విశ్రాంత ఆచార్యుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ భూములను కాంక్రీట్ జంగిల్‌గా మారిస్తే ఇక నగరం నిప్పుల కుంపటిని తలపిస్తుందనడంలో సందేహంలేదని హెచ్చరించారు. కంచగచ్చిబౌలి భూముల వేలానికి వ్యతిరేకంగా 1.20లక్షలమందికి పైగా పౌరులు ఆన్‌లైన్ పిటిషన్‌లో సంతకాలు చేసినట్లు సేవ్ సిటీ ఫారెస్ట్ ప్రతినిధి శశి తెలిపారు.

హెచ్‌సీయూలో లాఠీచార్జి!

ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు, ప్రొఫెసర్లపై లాఠీలు ఝుళిపించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ)లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వర్సిటీ భూములను కాపాడుకునేందుకు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా చేస్తున్న ఆందోళనలకు ప్రొఫెసర్లు కూడా మద్దతు తెలపడంతో ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. బుధవారం ఉదయం వర్సిటీలోని అంబేద్కర్ ఆడిటోరియం నుంచి ప్రభుత్వం చదును చేస్తున్న 400 ఎకరాల కంచ భూముల వైపు విద్యార్థులు, ప్రొఫెసర్లు ర్యాలీ తీస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. వందల సంఖ్యలో చేరుకున్న విద్యార్థులు ఒక్కసారిగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా, నిలువరించలేకపోయిన పోలీసులు లాఠీచార్జి చేశారు. సుమారు 30 మంది గాయపడగా, వారిని వర్సిటీ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల నిర్బంధం, లాఠీచార్జిని డ్రోన్లతో చిత్రీకరించిన ఆరుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. విద్యార్థులపై లాఠీచార్జిని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, బీజేవైఎం, బీఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాలతోపాటు హెచ్‌సీయూ అచార్యుల సంఘం కూడా తీవ్రంగా ఖండించింది. మరోవైపు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి ప్రముఖ సినీనటులు, రాజకీయ ప్రముఖులు మద్దతు తెలిపారు. వర్సిటీ లోపల, వెలుపల సుమారు 300 మందికి పైగా పోలీసులను మోహరించారు. లోపల ఉన్న పోలీసులు విద్యార్థులను బయటకు రాకుండా అడ్డుకోగా, గేటు బయట పోలీసులు బారికేడ్లతో మీడియా, రాజకీయ పార్టీల నేతలను లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. విద్యార్థుల సంఖ్య భారీగా ఉండడంతో పోలీసులు వాటర్ క్యానన్లను కూడా ఏర్పాటు చేసుకున్నారు. శాంతియుతంగా ఉద్యమిస్తున్న విద్యార్థులను అడ్డుకునేందుకు పోలీసులను మోహరించడం దారుణమని విద్యార్థి సంఘాలు ఆక్షేపిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని పణంగా పెట్టడం సరికాదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు భూమి ఎంత ముఖ్యమో విద్యా సంస్థలకు కూడా అంతే ముఖ్యమని చెప్పారు. అభివృద్ధికి, విద్యకు, ప్రకృతికి మధ్య వైరుధ్యం ఏర్పడినపుడు కచ్చితంగా ప్రకృతి ముందు అభివృద్ధి తలవంచాల్సిందేనని తెలిపారు. హెచ్‌సీయూ విద్యా సంస్థ మాత్రమే కాదని, జీవ వైవిధ్యానికి ప్రతీక అని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. భూములు అమ్ముతామంటూ ప్రభుత్వ విద్యాసంస్థను నాశనం చేస్తున్న సర్కారు.. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వాళ్ల నుంచి ఎందుకు వాటిని వెనక్కి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. వర్సిటీ క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను తక్షణం ఉపసంహరించుకోవాలని హెచ్‌సీయూ ఆచార్యుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.



హెచ్‌సీయూలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి

గ్యారెంటీలు విస్మరించి భూఅమ్మకాలా?

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకోవడంతో పాటు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ వన్యప్రాణులకు హాని తలపెడుతున్న ప్రభుత్వం వెంటనే హెచ్‌సీయూ భూముల ఆక్రమణను నిలిపివేయాలని బీజేపీ మహిళామోర్చా డిమాండ్ చేసింది. హెచ్‌సీయూ భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ముట్టడికి యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సచివాలయం వద్దకు చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శిల్పారెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను విస్మరించిన సర్కారు, భూముల అమ్మకాలకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.

పర్యావరణ విధ్వంసం ఆపండి: రేణూదేశాయ్

హెచ్‌సీయూలో విద్యార్థుల ఉద్యమానికి పలువురు టాలీవుడ్ సెలబ్రిటీలు మద్దతు పలికారు. నటి రేణుదేశాయ్ స్పందిస్తూ.. "ఒక తల్లిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి విన్నవిస్తున్నా. నా పిల్లలకు, మనందరి పిల్లలకు ఆక్సిజన్ కావాలి. అలాగే మాకు అభివృద్ధి కావాలి. కానీ, ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేయొద్దు. మీరు పరిపాలిస్తున్న రాష్ట్ర పౌరురాలిగా అడుగుతున్నా. ఆ 400 ఎకరాలను వదిలేయండి ప్లీజ్" అని ఆమె విడుదల చేసిన వీడియోలో అభ్యర్థించారు.

ఈ చర్యలు ఉనికికే ప్రమాదం: సమంత

హెచ్‌సీయూలో తాజా పరిణామాలపై సోషల్ మీడియా వేదికగా సమంత స్పందిస్తూ "అటవీ నిర్మూలన చర్యలతో ఉష్ణోగ్రతలు మరో 4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. ఇది మానవాళి ఉనికికి కూడా ప్రమాదకరం. హెచ్‌సీయూలోని 400 ఎకరాల్లో చెట్లను నరకడం చాలా బాధగా ఉంది. జంతువులను, పక్షులను కాపాడాలి" అని పేర్కొన్నారు.

రాహుల్ దిష్టిబొమ్మ దహనం

హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ నాయకులు ఆందోళన చేపట్టారు. వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వద్ద కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ దిష్టి బొమ్మను దహనం చేశారు. హెచ్‌సీయూ విద్యార్థులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు.

గురుకులాల్లో కొత్తగా ఫౌండేషన్ కోర్సులు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (హైదరాబాద్): సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఫౌండేషన్ కోర్సుల ప్రారంభానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ఈ కోర్సులు దోహదపడతాయన్న నిపుణులు, అధ్యాపకుల సూచనల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా పలు దఫాల చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్(తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్) కార్యదర్శి వి.ఎస్.అలగు వర్షిణి తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 8వ తరగతి నుంచి కోర్సులను ప్రారంభించేలా చర్యలు చేపట్టామని, అందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేశామని ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన వారికి ఫౌండేషన్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తారు. నైపుణ్యం, అనుభవం ఉన్న అధ్యాపకుల ద్వారా శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

మొదటి త్రైమాసికంలోనే 14 వేల కోట్ల అప్పు

» ఆర్‌బీఐకి ప్రతిపాదించిన ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 1 నుంచి ప్రారంభమైన 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేల కోట్ల అప్పు తీసుకోనుంది. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) నిర్వహించే ఈ-వేలం పాటల ద్వారా ఈ బహిరంగ మార్కెట్ రుణాల (ఓఎంబీ)ను సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు మొదటి త్రైమాసికానికి (ఏప్రిల్, మే, జూన్) సంబంధించి ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపించింది. తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఆర్‌బీఐకి మొదటి త్రైమాసిక ప్రతిపాదనలు పంపించాయి. ఈ వివరాలను ఆర్‌బీఐ ప్రకటించింది. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో మార్కెట్ రుణాల కింద రూ.64,539 కోట్లు సేకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో రూ.14,000 కోట్లను అంటే 21.69 శాతాన్ని మొదటి త్రైమాసికంలోనే తీసుకుంటుండం ప్రభుత్వ అవసరాన్ని తెలియజేస్తోంది. ఏప్రిల్ 15న రూ.2,000 కోట్లు, 29న రూ.2,000 కోట్లు, మే 6న రూ.2,000 కోట్లు, మే 20న రూ.2,000 కోట్లు, మే 27న రూ.1,000 కోట్లు, జూన్ 3న రూ.2,000 కోట్లు, జూన్ 17న రూ.2,000 కోట్లు, జూన్ 24న రూ.1,000 కోట్ల చొప్పున ఈ మార్కెట్ రుణాలను సేకరించనుంది.

జూన్ 1 వరకు ఇంటర్ కాలేజీలకు వేసవి సెలవులు

» సెలవుల్లో అనధికారికంగా తరగతులు నిర్వహిస్తే చర్యలు

» రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృష్ణ ఆదిత్య

రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలకు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి(టీజీబీఐఈ) జూన్ 1వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించింది. జూన్ 2న కళాశాలలు పునఃప్రారంభమవుతాయని, రాష్ట్రంలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలు కచ్చితంగా సెలవుల షెడ్యూల్‌ను పాటించాలని టీజీబీఐఈ కార్యదర్శి కృష్ణ ఆదిత్య బుధవారం ఓ ప్రకటనలో ఆదేశించారు. సెలవుల్లో అనధికారకంగా తరగతులు నిర్వహిస్తే ఆ విద్యాసంస్థల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

టెన్త్ విద్యార్థులకు.. రేపు కెరీర్ గైడెన్స్

వార్షిక పరీక్షలు రాసిన పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 4న కెరీర్ గైడెన్స్ పేర ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పాఠశాల విద్య సంచాలకులు ఈవీ నర్సింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 12.10 గంటల వరకు టీ-శాట్ ద్వారా ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కోర్సుల వివరాలు తెలిపే విషయ నిపుణులు, తాను పాల్గొంటామని వివరించారు.

బీసీ గర్జన కాదు.. కాంగ్రెస్ మాయ గర్జన

» ఆ పార్టీ పాలనలో బీసీలకు ఒరిగిందేమి లేదు: కె.లక్ష్మణ్



హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్‌పార్టీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ, బీసీలను మరోసారి మోసం చేయడానికి కుట్ర పన్నుతోందని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా పోరు గర్జన పేరుతో ఆ పార్టీ రాజకీయ డ్రామాకు తెర లేపిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక దేశ చరిత్రను పరిశీలిస్తే, ఆ పార్టీ బీసీలకు ఏనాడూ న్యాయం చేయలేదని ఆయన దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూడా బీసీలకు 22 సీట్లే ఇచ్చి వారి హక్కులను కాల రాస్తూ వచ్చిందని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్న నినాదంతో ఆ వర్గం వారిని మభ్యపెట్టేందుకు మరో కొత్త పథకం వేస్తోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు 9వ షెడ్యూల్‌తో సంబంధం లేకుండానే బీసీ రిజర్వేషన్లను పెంచే పూర్తి అధికారమున్నదని లక్ష్మణ్ వెల్లడించారు. రాష్ట్రంలో బీసీలకు పూర్తిన్యాయం జరిగేలా బీజేపీ నిరంతరం పోరాడుతోందని, మోదీ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పించిందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకొని, బీసీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రంగారెడ్డి జిల్లా బాటసింగారంలో బర్డ్‌ఫ్లూ !

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో బర్డ్‌ఫ్లూ కలకలం రేపింది. వారం క్రితం బాటసింగారం పరిధిలోని ఓ పౌల్ట్రీఫామ్‌లో రోజూ కొన్ని కోళ్ల మృత్యువాత పడటంతో నిర్వహకులు వెటర్నరీ డాక్టర్లను సంప్రదించారు. దీంతో ఫామ్ వద్ద వైద్యులు మార్చి 26న శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారని, ఈ నెల 1న వచ్చిన రిపోర్టులో బర్డ్‌ఫ్లూ వచ్చినట్లు తేలిందని కోళ్ల ఫామ్ నిర్వాహకులు తెలిపారు. ప్రతి రోజు వెయ్యి నుంచి 2 వేల కోళ్లు మృత్యువాత పడినట్లు తెలిసింది. అధికారులు మృతి చెందిన కోళ్లను బస్తాల్లో వేసి లోతైన గుంతలో పాతిపెట్టించినట్లు సమాచారం.

అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరాపై టెండర్లు

» మళ్లీ జోన్ల వారీగానే పిలిచిన మహిళా శిశు సంక్షేమ శాఖ

» కొత్తవారికి అవకాశం లేదంటూ పౌల్ట్రీ రైతుల ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు గుడ్లను సరఫరా చేసేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల దాఖలకు ఏప్రిల్ 10వరకు అవకాశం ఇవ్వగా, 11న సాంకేతిక బిడ్‌లను తెరవనున్నట్టు నోటీసులో పేర్కొంది. గుడ్డు సైజు 45-52 గ్రాములు ఉండాలని తెలిపింది. టెండర్లను గత ప్రభుత్వంలో మాదిరే జోన్ల వారీగా పిలిచింది. రెండేళ్ల అనుభవంతో కూడిన అగ్‌మార్క్ సర్టిఫికేట్‌తో పాటు, రిప్లికా సీరియల్ నంబరు (గుడ్లను సరఫరా చేసే వారికి ఇచ్చే గుర్తింపు) కూడా ఉండాలని పేర్కొంది. దీంతో ప్రస్తుతం గుడ్లను సరఫరా చేస్తున్న వారికే టెండర్లలో పాల్గొనే అవకాశం ఉండటంతో ఇతరులకు అవకాశం లేకుండా పోయిందని పలువురు పౌల్ట్రీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలి

» లేదంటే తదుపరి కార్యాచరణ: రెవెన్యూ ఉద్యోగులు

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని హెచ్చరించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. బుధవారం ట్రెసా నేతలు భూపరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్‌ఏ) నవీన్ మిత్తల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు పొడిగింపుపై జీవో

లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) రాయితీ గడువును ముందనుకున్నట్లుగానే పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతమున్న 25 శాతం రాయితీని ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ బుధవారం (జీవో 182) ఉత్తర్వులిచ్చారు.





మహాధర్నాకు హాజరైన బీసీ సంఘాల నేతలు, కార్యకర్తలు ; మహాధర్నాలో పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రి పొన్నం, నారాయణ, మహేశ్‌గౌడ్, వీహెచ్ తదితరులు

మోదీ దిగి రావాలి

(మొదటిపేజీ తరువాయి)

నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపైనా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకే తాను ఏ సామాజికవర్గమైనా, తనపై ఏ ఒత్తిడి ఉన్నా.. రాహుల్‌గాంధీ మాటను నిలబెట్టడానికే ప్రాధాన్యమిచ్చానని తెలిపారు. తెలంగాణలో అధికారం చేపట్టి వంద రోజులు గడవక ముందే బలహీనవర్గాల లెక్కలు తేల్చేందుకు శాసనసభలో తీర్మానం చేశామని, కులగణన పూర్తిచేసి ఆ వివరాలను 2024 ఫిబ్రవరి 4న శాసనసభలో పెట్టామని పేర్కొన్నారు. అందుకే ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డేగా ప్రకటించామన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలన్నా, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కొనసాగాలన్నా.. కులాల లెక్కలు తేలాలని న్యాయస్థానాలు చెప్పాయని గుర్తు చేశారు. అందుకే జగగణనలో కులగణన జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. దేశంలో ఏయే కులాల జనాభా ఎంత ఉందో లెక్క తేలాలని, దామాషా ప్రకారం నిధులు, నియామకాలు చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించిందని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీ విధానపరమైన నిర్ణయమని, కాంగ్రెస్ ఒక్కసారి హామీ ఇస్తే అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో చేసి చూపించామన్నారు.



బీసీల మహాధర్నాలో కల్లుకుండ, మోకుతో పాల్గొన్న సీఎం రేవంత్

దేశానికి దిక్సూచిగా నిలిచాం...

గుజరాత్ సహా బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో బీసీల జనాభా 56.36 శాతంగా తేల్చామని, దేశానికి దిక్సూచిగా నిలుస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లోనే కాకుండా.. విద్య, ఉద్యోగావకాశాల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని భావిస్తున్నట్లు చెప్పారు. బీసీల నుంచి ఐఏఎస్, ఏపీఎస్ సహా అన్ని క్యాటగిరీల ఉద్యోగులు వచ్చి ప్రభుత్వ పాలనలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ ఆశిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో బీసీలను ముందువరుసలో నిలిపేందుకే రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించామన్నారు. బీసీలది ధర్మమైన కోరిక అని, దానిని నెరవేర్చడానికి ప్రభుత్వాలు ముందుకు రావాల్సిన బాధ్యత ఉందని సీఎం అన్నారు. కానీ, బీజేపీ అందుకు సిద్ధంగా లేదని, ఆ పార్టీ విధానపరమైన ఆలోచనే బలహీన వర్గాలకు వ్యతిరేకమని ఆరోపించారు. దేశంలో బలహీన వర్గాల లెక్క తేలాలని భావించి మొరార్జీ దేశాయ్ ఏర్పాటు చేసిన మండల్ కమిషన్‌పై బీజేపీ కుట్ర చేసి.. కమండల్ యాత్ర మొదలు పెట్టిందని రేవంత్ ఆరోపించారు. ఇప్పుడు ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ.. ఆ కమండల్ ప్రతినిధేనన్నారు. బలహీన వర్గాలను బలోపేతం చేయడానికి బీజేపీ వ్యతిరేకమన్నారు. అందుకే.. బలహీన వర్గాల లెక్క తేల్చాల్సి వస్తుందనే 2021లో చేయాల్సిన జనాభా లెక్కలను చేయలేదన్నారు. రాహుల్‌గాంధీ కులగణన చేయాలనడంతో 2025 వచ్చినా జనగణన చేయకుండా వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు. ఇది బీసీల సమస్య మాత్రమే కాదని, యావత్ బహుజనుల సమస్య అని తెలిపారు. అందుకే.. బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఆధిపత్యం చెలాయిస్తే ఊరుకోం...

దేశ ప్రధానిగా మోదీ బలహీన వర్గాల ప్రజల గుండెచప్పుడు వినాలని, అంతేతప్ప.. చట్టం, అధికారం చేతిలో ఉందని ఆధిపత్యం చెలాయిస్తే ఊరుకునేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము ఇతర రాష్ట్రాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరడం లేదని, తెలంగాణలో అమలు చేసేందుకు అనుమతి కోరుతున్నామని చెప్పారు. ఈ విషయంపై తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌ను తమ వాళ్లు కలిసినా.. వారు స్పందించలేదని, అందుకే ఢిల్లీకి వచ్చామని అన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు అనుమతిస్తే ప్రధాని మోదీని తానే తెలంగాణకు పిలిచి పార్టీలకతీతంగా 10 లక్షల మందితో బహిరంగ సభ ఏర్పాటు చేసి సన్మానం చేస్తానన్నారు. లేదంటే ఢిల్లీ నుంచి గల్లీల్లోకి వచ్చినప్పుడు తమ చేతికి దొరుకుతారని చెప్పారు. ప్రధాని గద్దె దిగిరాకుంటే, గ్రామాల్లో గద్దెలు కూలుతాయని హెచ్చరించారు. చట్టసభల్లో మెజారిటీ లేకపోయినా.. ఎన్నో చట్టాలు చేశారని, బీసీ రిజర్వేషన్లపై మాత్రం ఎందుకిలా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రాణాలివ్వాల్సిన పనిలేదని, బీసీ రిజర్వేషన్లకు అనుమతిస్తే చాలునని రేవంత్ అన్నారు. తాము ఇక ఢిల్లీకి వచ్చేది లేదని, ప్రధాని మోదీయే గల్లీలకు రావాల్సి వస్తుందని చెప్పారు. "బీసీల ఆవేదనను మోదీ వినకుంటే మన బలమేంటో చూపించాలి. ధర్మమైన కోరిక కోసం 10 లక్షల మందితో పరేడ్ గ్రౌండ్‌లో ధర్మయుద్ధం ప్రకటించండి. మీకు నేను అండగా నిలుస్తాను. మన బలమేంటో చూపిద్దాం. మోదీ దిగిరాకుంటే.. మనల్ని తక్కువ అంచనా వేస్తే... ఎర్రకోట మీద జెండా ఎగరేద్దాం. రిజర్వేషన్లు సాధించుకుందాం" అని రేవంత్ అన్నారు.

బీసీలకు బీజేపీ, బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి

తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు శాసనసభలో మద్దతు తెలిపిన బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో ధర్నాకు ఎందుకు రాలేదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇందుకు ఆ రెండు పార్టీలు బీసీలకు సమాధానం చెప్పాలన్నారు. ఈడబ్ల్యూఎస్‌తో 50 శాతం రిజర్వేషన్లు దాటొద్దనే నిబంధనకు కేంద్రమే మార్గం తెరిచిందని గుర్తు చేశారు. ఇప్పుడు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పనతో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే సహకరించడం లేదని ఆరోపించారు. కాగా, బీసీ రిజర్వేషన్లను తప్పుదారి పట్టించి, బీసీ కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం జరుగుతోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. బీసీలందరూ ఒకటేనని, మళ్లీ అందులో కులాల లొల్లి వద్దని సూచించారు. కలిసికట్టుగా ముందుకెళ్లాలని కోరారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కులగణన, 42 శాతం రిజర్వేషన్లు సీఎం రేవంత్ రెడ్డి మొండిధైర్యం వల్లే సాధ్యమయ్యాయన్నారు. కాగా, తెలంగాణ ప్రజలకు కొట్లాట కొత్త కాదని, పోరాటాలు చేసైనా మన హక్కులు సాధించుకుందామని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేసి.. తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రధాని మోదీ పేరుకే ఓబీసీ అంటున్నారని, కానీ.. బీసీలకు ఆయన చేసిందేమీలేదని మరో విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. ఎమ్మెల్సీ విజయశాంతి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించినట్లుగానే బీసీ రిజర్వేషన్లనూ పట్టుపట్టి సాధించాలని పిలుపునిచ్చారు. ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, వి.హనుమంతరావు, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ తదితరులు మాట్లాడారు.

జంతర్‌మంతర్‌లో బీసీల హోరు

బీసీల పోరుగర్జనకు 16 పార్టీల మద్దతు

» వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ఎంపీల హాజరు

» వందలాది కులసంఘాల నేతల రాక

» బీసీ బిల్లులను ఆమోదించకపోతే

» వచ్చే ఎన్నికలే బీజేపీకి చివరివి: జాజుల

» హాజరుకాని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంటులో ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తెలంగాణ బీసీ సంఘాలు చేపట్టిన 'బీసీల పోరుగర్జన, మహాధర్నా'తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ దద్దరిల్లింది. బుధవారం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మహాధర్నాకు మద్దతు తెలిపేందుకు దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుంచి నేతలు తరలివచ్చారు. 16 రాజకీయ పార్టీల నేతలు కూడా ధర్నాకు హాజరై సంఘీభావం తెలిపి.. బీసీ రిజర్వేషన్ల బిల్లులకు తమ పార్టీల తరఫున మద్దతు ఉంటుందని ప్రకటించారు. ధర్నాను విజయవంతం చేసేందుకు వందలాదిగా బీసీ సంఘాల నేతలు, వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చారు. ధర్నా ప్రారంభం అయిన ఉదయం 10 గంటల నుంచి ధర్నా ముగిసే వరకు నేతలు, కార్యకర్తలు ఉత్సాహంతో సభ ప్రాంగణంలోనే ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న సమయంలో భారీ ఎత్తున బీసీ బిల్లులకు మద్దతుగా చేసిన నినాదాలతో జంతర్‌మంతర్ మార్మోగిపోయింది. ధర్నాకు హాజరైన తమిళనాడు ఎంపీ విష్ణుప్రసాద్, కర్ణాటక ఎంపీలు జి.కుమార్ నాయక్, ప్రభామల్లికార్జున్ తమ మాతృభాషలో మాట్లాడి బీసీ రిజర్వేషన్ల పోరాటానికి మద్దతు ప్రకటించారు. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు రేణుకాచౌదరి, అనిల్‌కుమార్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్‌తో పాటు.. వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీపీ(శరద్‌పవార్) ఎంపీ సుప్రియా సూలే, డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులు ధర్నాకు హాజరయ్యారు. ధర్నాకు భారీ ఎత్తున జాతీయ నేతలు తరలిరావడంతో వేదికపై సీట్లు దొరకడం కష్టమైపోయింది. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ధర్నా వేదికకు ఒక మూలన దాదాపు 40 నిమిషాల పాటు కింద కూర్చొని మిగతా నేతల ప్రసంగాలను ఆసక్తితో విన్నారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా వేదిక దిగి తెలుగు జర్నలిస్టుల వద్దకు చేరి, వారితో కలిసి నేతల ప్రసంగాలను విన్నారు. మహాధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎవరూ హాజరుకాలేదు. ఈ కార్యక్రమంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లులను యథావిధిగా కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేకపోతే తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలే బీజేపీకి చివరివని అన్నారు. దేశవ్యాప్తంగా కులగణనను కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో 70 కోట్ల జనాభా ఉన్న బీసీల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శాఖను కూడా కేటాయించలేదని విమర్శించారు. ప్రధాని మోదీ పేరుకే బీసీ అయిన ఆచరణలో మాత్రం ఆయన బీసీ కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ బీసీల భవిష్యత్తు కోసం సీఎం రేవంత్ రెడ్డి పోరాడుతున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ధర్నాకు ఆహ్వానించినా రాలేదని విమర్శించారు. సీఎంగా కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్న ఏనాడూ బీసీల లెక్కలు తేల్చేందుకు ఆయనకు మనసు ఒప్పలేదని విమర్శించారు.

నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు 42%: చిరంజీవులు

70 ఏళ్లకు పైగా ఉన్న కులగణన డిమాండ్‌ను సుసాధ్యం చేసిన ప్రజానాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ టి.చిరంజీవులు అన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల సాధన అనేక పోరాటాలతో ముడిపడి ఉందని, అందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కాంట్రాక్టులు, ప్రభుత్వ నామినేటెడ్ పదవులలోనూ బీసీలకు 42% వాటా కేటాయించాలని ఆయన కోరారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశిని శంకర్‌రావు మాట్లాడుతూ.. చట్టసభలలో బీసీలకు 33% రిజర్వేషన్ కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం రూపొందించిన బిల్లును కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీలో రేవంత్ డ్రామాలు!

» వెనక ఉండి ఆడిస్తున్న రాహుల్‌గాంధీ

» బీసీలకు 42% రిజర్వేషన్లపైకాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘాల ముసుగులో సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ధర్నాకు దిగడం చూస్తుంటే 42 శాతం రిజర్వేషన్ల అమలు నుంచి తప్పించుకునే ప్రయత్నంలా కనిపిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని, వారిని ఓటు బ్యాంకుగానే కాంగ్రెస్ పార్టీ చూస్తోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేనప్పుడు.. పెంచుతామంటూ హామీ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచడం ఇష్టంలేకనే రేవంత్‌రెడ్డి ఢిల్లీలో డ్రామాలాడుతున్నారని, అసలైన బీసీ ద్రోహి ఆయనేనని ఆరోపించారు. రేవంత్ వెనక రాహుల్‌గాంధీ ఉండి ఈ డ్రామాలాడిస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ వర్గానికి చెందిన మోదీ ప్రధాని అయితే జీర్ణించుకోలేక ఆయనపై రాహుల్ అసభ్యకర వ్యాఖ్యలు చేశారని అన్నారు. కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ మరిచిపోయిందని, కానీ, బీసీల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో గత్యంతరం లేక 42 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పాస్ చేశారని తెలిపారు. రాష్ట్రంలో 46 శాతం బీసీల జనాభా ఉందంటున్న సీఎం రేవంత్.. తన క్యాబినెట్‌లో 46% మంది బీసీ మంత్రులకు చోటు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. బీసీలకు మంత్రి పదవులు రెండంటే రెండే ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు బీసీలపై కపట ప్రేమలు చూపుతూ.. హామీల అమలు వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేలా రాజకీయ కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే 42శాతం వాటా అమలు చేసి ఆరుగురు బీసీలకు మంత్రి పదవులు ఇవ్వాలని బీజేపీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాల్వాయి హరీశ్, పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌ది చేతకానితనం:సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో కాంగ్రెస్‌ది చేతకానితనం అని, ఆ నెపాన్ని కేంద్రంపై రుద్ది తప్పించుకోవాలనుకుంటోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. మతపరమైన రిజర్వేషన్లకు మోదీ ప్రభుత్వం వ్యతిరేకమని, తెలిసి కూడా ముస్లింలను బీసీ జాబితాలో కాంగ్రెస్ నేతలు ఎందుకు చేర్చారని మండిపడ్డారు. రిజర్వేషన్లపై హామీ ఇచ్చే ముందు మోదీ ప్రభుత్వాన్ని అడిగి మ్యానిఫెస్టోలో పెట్టారా అని బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కాంగ్రెస్ బీసీలకు అన్యాయం చేస్తుంటే బీసీ సంఘాలు ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన సంఘాలు.. కాంగ్రెస్‌ను సంకన వేసుకుని ఢిల్లీలో ధర్నా పేరుతో డ్రామాలాడుతున్నాయని విమర్శించారు.

విస్తరణకు విరామం!

(మొదటిపేజీ తరువాయి)

జరిగినట్లు చెబుతున్నారు. ఎస్సీ మాల సామాజిక వర్గం నుంచి గడ్డం వివేక్‌వెంకటస్వామితో పాటుగా.. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పేరునూ పరిగణనలోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముస్లిం మైనార్టీల నుంచి ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్ లేదా.. పార్టీ సీనియర్ నేతను ఎవరినైనా తీసుకుని తర్వాత ఎమ్మెల్సీని చేయడమా అన్నదానిపైన చర్చించారు. ఈ క్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఫిరోజ్‌ఖాన్ తదితరుల పేర్లూ ప్రస్తావనకు వచ్చినట్లు చెబుతున్నారు. అయితే ఈ పేర్లన్నింటిపైనా ఐదుగురు ముఖ్యనాయకుల అభిప్రాయాలను ఉమ్మడిగాను, విడివిడివిడిగానూ అధిష్ఠానం తీసుకుంది. అయితే ఉగాది, ఏప్రిల్ 2 సాయంత్రం, 3, 4 తేదీల్లో ఉదయం ప్రమాణ స్వీకారానికి మంచి ముహూర్తాలు ఉన్నాయని, ఈ లోపున నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం కోరింది. అయితే ఆ ముహూర్తాలపై అధిష్ఠానం ఇంతవరూ నిర్ణయం తీసుకోలేదు.

ఢిల్లీకి ఆశావహుల చక్కర్లు.. ప్రయత్నాలు

నలుగురు లేదా ఐదుగురితోనే మంత్రివర్గ విస్తరణ జరగనున్నట్లు వార్తలు రావడంతో ఆశావహులు, మద్దతుదారులు ఢిల్లీ బాట పట్టారు. మాదిగ సామాజిక వర్గం.. ఎస్టీ లంబాడా ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌లను కలిసి.. తమ సామాజిక వర్గాలకూ క్యాబినెట్లో చోటు కల్పించాలంటూ వినతిపత్రాలు ఇచ్చారు. ఢిల్లీకీ వెళ్లి అధిష్ఠానం పెద్దలను కలిసి వినతిపత్రాలూ ఇచ్చారు. మాదిగలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలూ జరుగుతున్నాయి. లంబాడాలకు అవకాశం కల్పించాలంటూ ఆ సామాజిక వర్గ నేతలు ఏకంగా సీఎం నివాసం ముట్టడికి ప్రయత్నించారు. ఇక ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లి.. పట్టు వదలకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి.. తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలంటూ వినతిపత్రం ఇచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో చోటు కల్పించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలంటూ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి.. ఖర్గేకు లేఖ రాశారు. వీరే కాకుండా సీనియార్టీ ప్రాతిపదికన తమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలంటూ పలువురు పార్టీ ఎమ్మెల్యేలు అధిష్ఠానం పెద్దలను సంప్రదిస్తున్నారు.

రెండో వారంలో ప్రకటించే ఛాన్స్!

మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పుపైన రాష్ట్ర ముఖ్య నేతల అభిప్రాయాలు తీసుకున్న అధిష్ఠానం పెద్దలు.. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌తో కలిసి కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా.. పార్టీ పట్ల అంకిత భావానికే ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆలోచన అధిష్ఠానం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ పార్టీకి చెప్పుకోడానికి ఉన్న బలమైన రాష్ట్రం ఏదైనా ఉందంటే.. అది తెలంగాణే. దీంతో మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పు తదితర అంశాలపై అధిష్ఠానం.. ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు బొటా బొటీ మెజార్టీ ఉండగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి రావడం, ఎంఐఎం గట్టి మద్దతుదారుగా నిలబడడంతో పార్టీ బలంగా తయారైంది. అదను చూసుకుని ఈడీ, ఐటీ కేసులతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరతకు గురిచేయకుండా జాగ్రత్తలు తీసుకునే క్రమంలోనూ మంత్రివర్గం విషయంలో అధిష్ఠానం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. అసంతృప్తికి తావు లేకుండా నిర్ణీత వ్యవధి తర్వాత మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ చేపట్టి.. కొత్త వారికి చోటు కల్పించాలన్న ఆలోచనా అధిష్ఠానం చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరో వైపున పార్లమెంటుకు వక్ఫ్ బిల్లు వచ్చిన నేపథ్యంలో ఈ అంశంపైనే ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టారు. ఏఐసీసీ కార్యదర్శుల సమావేశం, దేశవ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల కూర్పు, ఇతర సంస్థాగత అంశాల్లో ఏఐసీసీ పెద్దలు తలమునకలుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం పెద్దలు అన్ని అంశాలపైన దృష్టి సారించి మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం తీసుకునేందుకు సమయం పట్టొచ్చునంటున్నారు. ఏప్రిల్ 2వ వారంలో నిర్ణయాన్ని ప్రకటించే ఛాన్స్ ఉంద ని చెబుతున్నారు.



మల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలంటూ దీక్ష

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం మునిసిపాలిటీ పరిధి శేరిగూడ గాంధీ విగ్రహం ఎదుట తెలంగాణ పారా మెడికల్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఉక్కుల అశోక్ నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్‌కు సేవలందిస్తూ మలక్‌పేట్ ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలిచారని, ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రంగారెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించాలనేది ప్రజల అభిమతన్నారు.



గ్రూప్-1 ర్యాంకర్లను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

గ్రూప్-1లో ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల ప్రతిభ

» అభినందనలు తెలిపిన టీజీఆర్టీసీ ఎండీ సజ్జనార్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన టీజీఆర్టీసీ ఉద్యోగుల పిల్లలను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ అభినందించారు. నారాయణపేట డిపోకు చెందిన కండక్టర్ శ్రీనివాస్ కుమార్తె వీణ(118), ఐటీ-2గా పనిచేస్తున్న వాహిద్ కుమార్తె ఫాహిమినా ఫైజ్(126), వనపర్తి డిపోలో పనిచేస్తున్న ఐటీ-2 ఎస్.బాల్‌రెడ్డి, కండక్టర్ పుష్పలత కుమారుడు రాఘవేందర్ రెడ్డి(143) ర్యాంకులు సాధించారు. బస్ భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ర్యాంకర్లతోపాటు వారి తల్లిదండ్రులను సజ్జనార్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1లో ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు రాణించడం సంతోషంగా ఉందన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

» బెట్టింగ్‌లో రూ.5లక్షలు పోగొట్టుకోవడంతో ఆత్మహత్య



ఆకాష్ (ఫైల్)

మోపాల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరొకరు బలయ్యారు. బెట్టింగ్‌లో తీవ్రంగా నష్టపోయిన ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా రూరల్ మండలంలోని ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన ఆకాష్ (22) మండలంలోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి ఇటీవల రూ.5 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే ఏమంటారోనని భయపడి మార్చి 26న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆకాష్‌కు భార్య, ఆరు నెలల బాబు ఉన్నాడు.

గంటపాటు శ్రవణ్‌రావు విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులు ఆరో నిందితుడైన శ్రవణ్‌రావును బుధవారం గంటపాటు విచారించారు. అయితే.. రెండోసారి జరిగిన ఈ విచారణలోనూ పోలీసు అధికారులు అడిగిన ప్రశ్నలకు శ్రవణ్‌రావు సరైన సమాధానాలివ్వలేదని సమాచారం. గత ప్రభుత్వంలోని పెద్దల పాత్రపై శ్రవణ్‌రావును పలుమార్లు ప్రశ్నించినా.. ఆయన మౌనంగానే ఉన్నారని తెలిసింది. "ఫోన్ ట్యాపింగ్ కేసులో మీ పేరు బయటకు రాకముందే దుబాయ్‌కి ఎందుకు వెళ్లిపోయారు? అక్కడ మీతో పాటు ఉన్న ఐదుగురు వ్యక్తులు ఎవరు? అక్కడి నుంచి మీరు ఎవరెవరితో మాట్లాడారు?" అని దర్యాప్తు అధికారులు ప్రశ్నించగా.. శ్రవణ్‌రావు మౌనందాల్చారని సమాచారం. ఆయన నుంచి సమాధానాలు రాకపోవడంతో.. ఈనెల 8న మరోమారు విచారణకు హాజరవ్వాలని పేర్కొంటూ.. పంపించారు.

మంచినీళ్లు అడిగితే మూత్రం పోశాడు!

» గ్యాంగ్ రేప్ బాధితురాలిపై నిందితుల మరో అకృత్యం

» పోలీసుల విచారణలో వెల్లడి.. నిందితులకు రిమాండ్

కల్వకుర్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండపేటలో ఓ వివాహిత(27)పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఏడుగురు నిందితులు.. తర్వాత కూడా అతి దారుణంగా వ్యవహరించారు. బాధితురాలు తాగునీరు అడగ్గా నిందితుల్లో ఒకడైన కార్తీక్ ఆమెపై మూత్రవిసర్జన చేశాడు. ఈ విషయం నిందితుల విచారణలో తేలిందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఏడుగురు నిందితులు ఊర్కొండపేటకు చెందిన మారుపాకుల ఆంజనేయులు, ఎండీ సాధిక్ బాబా, వాగుల్‌దాస్ మణికంఠ, కార్తీక్, మట్ట మహేష్ గౌడ్, హరీశ్ గౌడ్, ఊర్కొండకు చెందిన మట్ట ఆంజనేయులు గౌడ్‌ను అరెస్టు చేసి బుధవారం కొల్లాపూర్ కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారని చెప్పారు. ఎస్పీ రఘునాథ్ కేసు వివరాలను మీడియాకు తెలిపారు. బాధితురాలు గత నెల 29న కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామి గుడికి వచ్చింది. దర్శనం అనంతరం గుడి ఆవరణలోనే నిద్రించారు. మూత్ర విసర్జనకు తన బంధువుతో కలిసి ఖాళీ ప్రదేశంలోని చింతచెట్టు వద్దకు వెళ్లింది. దీన్ని నిందితులు గమనించారు. మొదట నలుగురు, తర్వాత ముగ్గురు వారి వద్దకు వచ్చారు. రాత్రి 11 నుంచి 12 గంటల మధ్యలో గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. రేప్ విషయాన్ని బయటకు చెబితే చంపేస్తామని నిందితులు బాధితురాలిని బెదిరించారు. నిందితులు 20 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్కులని, ఇద్దరికి పెళ్లిళ్లు కాగా.. ఐదుగురు అవివాహితులని ఎస్పీ తెలిపారు.

హెచ్‌సీఏ వ్యవహారంపై కొనసాగుతున్న విచారణ

» రెండో రోజు సోదాలు నిర్వహించిన విజిలెన్స్

» జగన్మోహన్‌రావు అక్రమాలపై ఆరా

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య వివాదం సమసిపోయిందని ఇరు వర్గాలు ప్రకటించినా విజిలెన్స్ అధికారులు మాత్రం తమ విచారణను ఆపలేదు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విజిలెన్స్ అధికారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో పలు ఫైళ్లు పరిశీలించారు. ముఖ్యంగా బీసీసీఐ, హెచ్‌సీఏ, సన్ రైజర్స్ మధ్య జరిగిన ఒప్పందం వివరాలు, ఆ తర్వాత స్టేడియంలో జరిగిన అభివృద్ధి పనులు, అంతర్జాతీయ మ్యాచుల సమయంలో ఆహారం, రవాణాకు సంబంధించి ఇచ్చిన కాంట్రాక్టుల వివరాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారని తెలుస్తోంది. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన చేపట్టిన పనులు, ఖర్చులను అధికారులు పరిశీలించారని సమాచారం. హైదరాబాద్ రూరల్ విభాగానికి చెందిన విజిలెన్స్ బృందం సభ్యులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. హెచ్‌సీఏ సిబ్బందిని విచారించి కొన్ని కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. జగన్మోహన్ రావు హయాంలో అక్రమాలు జరిగాయని ఇప్పటికే ఎంపీ చామల కిరణ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో ఆ ఫిర్యాదులోని అంశాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారని తెలుస్తోంది.

మూసీ బఫర్ జోన్‌లో నిర్మాణాలపై నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదిస్తే తప్ప 50 నుంచి 100 మీటర్ల పరిధిలో కొత్త నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేసింది. బఫర్ జోన్ సహా 100 మీటర్లలోపు ప్రజల సదుపాయం కోసం రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించాలన్నా కూడా ఈ కమిటీ అనుమతి తప్పనిసరి అని పేర్కొంది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో మూసీ పరీవాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే నదీ తీరంలో, బఫర్ జోన్‌లో కూడా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో వివిధ విభాగాలకు చెందిన సీనియర్ అధికారుల కమిటీ పరిశీలించి.. మూసీ, ఈసా నదుల వెంబడి నిర్మాణాలపై నియంత్రణ అవసరమని సూచించింది. దీంతో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని మూసీ రివర్ ఫ్రంట్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీని ఆదేశించారు. కాగా, 55 కి.మీ మేర మూసీ పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించేలా మూసీ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. సుమారు రూ.4 వేల కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో గాంధీ సరోవర్ పేరుతో బాపూఘాట్ అభివృద్ధి పనులు చేపట్టనుంది. మూసీ నది మీద 17 కొత్త వంతెనల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. నదీ తీరం వెంట మెట్రో రైల్ మార్గాన్ని కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

కుంట్లూరులో అ'క్రమబద్ధీకరణ' పై కదలిన 'రెవెన్యూ'

» ప్రభుత్వ భూమి పరిశీలన.. అక్రమ నిర్మాణాలపై యంత్రాంగం ఆరా

» నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్న తహసీల్దార్




కుంట్లూర్‌లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు కుంట్లూర్‌లో జీవో 59 పేరుతో జరిగిన భూబాగోతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా సర్వే నంబర్ 24లో భూమి అక్రమ క్రమబద్ధీకరణపై రెవెన్యూ యంత్రాంగం కదలింది. పేదల కోసం తెచ్చిన జీవో 59ను అడ్డుపెట్టుకుని కొందరు ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకున్న వ్యవహారంపై "అక్రమబద్ధీకరణకు రెక్కలు" శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఆర్ఐ నిజాముద్దీన్, సర్వేయర్‌తో కలిసి కుంట్లూరు సర్వే నంబర్ 24లోని ప్రభుత్వ భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా రెండెకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన హద్దులను పరిశీలించారు. 2015 సంవత్సరంలో 59జీవో ద్వారా క్రమబద్ధీకరించుకున్న 600 గజాల స్థలంతో పాటు 2022 సంవత్సరంలో 59 జీవో కింద మరోసారి దరఖాస్తు చేసుకున్న 3,635 గజాల స్థలాన్ని పరిశీలించారు. క్రమబద్ధీకరణ కోసం ఫీజులు చెల్లించిన 3,635 గజాల్లో ఎలాంటి నిర్మాణాలు లేవని అధికారులు గుర్తించారు. 2015లో క్రమబద్ధీకరించుకున్న స్థలంలో పాత నిర్మాణాలతోపాటు కొత్త నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. జీవోలో క్రమబద్ధీకరించుకున్న స్థలంలో కాకుండా మరో చోట ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని కూడా పరిశీలించారు. కాగా కుంట్లూరు సర్వే నంబర్ 24లోని ప్రభుత్వ భూమిలో జీవో 59 ద్వారా జరిగిన అక్రమబద్ధీకరణపై పూర్తి విచారణ చేస్తున్నామని తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. గతంలో కూడా ఈ అంశంపై పలు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. అప్పుడూ విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు ఇచ్చామన్నారు. అక్రమబద్ధీకరణపై మరోసారి పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎగతాళి చేయడమే



(మొదటి పేజీ తరువాయి)

గురించి కాదన్నారు. దీనికి జస్టిస్ గవాయ్.. "ఎక్కడో రామ్‌లీలా మైదానంలో అన్నమాటలకు, చట్టసభలో మాట్లాడే మాటలకు తేడా ఉంది. అసెంబ్లీలో ఒక రాజకీయ నాయకుడు మాట్లాడుతున్నాడంటే దానికి ఒక పవిత్రత ఉంటుంది. సభలో ఒక మంత్రి ఏదైనా ప్రకటన చేస్తే.. చట్టాన్ని నిర్వచించడానికి ఆ ప్రకటనను ఆధారంగా చేసుకోవచ్చంటూ గతంలో కొన్ని తీర్పులు కూడా వచ్చాయి" అన్నారు. దీనికి రోహత్గీ.. తాను ముఖ్యమంత్రి తరఫున వాదనలు వినిపించడానికి రాలేదని చెప్పగా.. "మిస్టర్ రోహత్గీ గతంలో మీరు మరోకేసులో ఇదే సీఎం తరఫున వాదనలు వినిపించారు. ఆ విషయాన్ని మర్చిపోవద్దు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయనకు చెప్పండి." అని జస్టిస్ గవాయ్ అన్నారు. తాము ధిక్కరణ నోటీసులు ఇవ్వడానికి ఆలోచిస్తాం తప్ప ఆ అధికారాలు లేనివాళ్లమైతే కాదని ఆయన వ్యాఖ్యానించారు.

జాప్యానికి కారణమేంటి?

పిరాయింపు ఎమ్మెల్యేలకు సంబంధించిన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ ఎందుకింత జాప్యం చేశారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. "అనర్హత పిటిషన్లపై నోటీసులు జారీచేయడానికి మీకు 10 నెలల సమయం ఎందుకు పట్టింది? సహేతుకమైన సమయం అంటే ఎంత కాలం? మీరు రెండేళ్లు, మూడేళ్లు, నాలుగేళ్లపాటు చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చేతులు కట్టుకు కూర్చోవాల్సిందేనా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించిన పిటిషన్లపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారో చెప్పాలని, అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను నాలుగు వారాల్లోగా విడుదల చేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను కొట్టేస్తూ నిరుడు నవంబరులో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సైతం సుప్రీం తప్పుబట్టింది. విచారణ షెడ్యూలును నాలుగు వారాల్లోగా విడుదల చేయాలని సింగిల్ బెంచ్ జడ్జి ఆదేశించారే తప్ప.. నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పలేదని గుర్తుచేసింది. ఆ తీర్పును కొట్టేసిన హైకోర్ట్ డివిజన్ బెంచ్ 'సహేతుకమైన సమయం'లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిందని.. సహేతుకమైన సమయం అంటే ఎంత అని అడిగింది. దీనికి ముకుల్ రోహత్గీ.. స్పీకర్ ముందు మొదటి అనర్హత పిటిషన్ 2024 మార్చి 18న దాఖలైందని, అదే ఏడాది ఏప్రిల్ 2, 8 తేదీల్లో మరో రెండు పిటిషన్లు దాఖలయ్యాయని.. హైకోర్టు ముందు మొదటి పిటిషన్ దాఖలైంది ఏప్రిల్ 10న అని గుర్తుచేశారు. "మరి పిటిషనర్లు సహేతుక సమయంపాటు వేచిచూశారా?" అని ప్రశ్నించారు. వారి పిటిషన్లపై స్పీకర్ ఎప్పుడు నోటీసులు జారీ చేశారని ధర్మాసనం ప్రశ్నించగా.. 2025 జనవరి 16న అని ముకుల్ రోహత్గీ తెలిపారు. దీనికి ధర్మాసనం.. నోటీసులు ఇవ్వడానికి స్పీకర్‌కు 10 నెలల సమయం ఎందుకు పట్టిందని ప్రశ్నించింది. "హైకోర్టులో అనర్హత పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున ఆయన నోటీసులు ఇవ్వలేద"ని ముకుల్ రోహత్గీ చెప్పగా.. 'మరి ఇప్పుడీ అంశం మా పరిధిలో ఉంది. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పుడు నోటీసులు జారీచేయడం సముచితం కాదని మీకు అనిపించింది. అదే కేసు సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నప్పుడు మాత్రం నోటీసులు జారీ చేయడం సముచితం అనిపించిందా? దీనిపై మేం ధిక్కరణ నోటీసులు జారీచేయాలా?' అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీనికి రోహత్గీ.. స్పీకర్ స్వతంత్రుడని, కోర్టులు స్పీకర్‌కు ఆదేశాలివ్వలేవని.. సభాపతికి రాజ్యాంగం కల్పించిన విశేష అధికారాలను హరించలేవని పేర్కొన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై న్యాయసమీక్ష చేసే అధికారం కోర్టులకు ఉంటుందని.. కానీ, ఈ కేసులో స్పీకర్ అసలు ఏ నిర్ణయమూ తీసుకోలేదని రోహత్గీ గుర్తుచేశారు. దీనికి తీవ్రంగా స్పందించిన ధర్మాసనం.. 'అంటే ఈ విషయంలో మా చేతులు కట్టేసుకుని కూర్చోవాలా? సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు మేం సూచించలేమా? ప్రజాస్వామ్య నగ్న నృత్యాన్ని చూస్తూ కూర్చోవాలా?' అని సుప్రీం ధర్మాసనం నిలదీసింది. దీనికి రోహత్గీ.. 'కోర్టు స్పీకర్‌కు కేవలం అభ్యర్థన మాత్రమే చేయగలదని చెప్పారు. అందుకు ధర్మాసనం.. (వ్యవస్థల మధ్య) అధికారాల విభజన సూత్రాన్ని తాము గౌరవిస్తామని, దాన్ని అమలుచేస్తామని స్పష్టం చేసింది. అందుకే 'సహేతుక సమయం' అంటే ఎంతకాలమో స్పీకర్‌ను అడిగి కనుక్కుని తమకు చెప్పాలని రోహత్గీకి సూచించామని.. కానీ ఆప్రశ్నకు ఎలాంటి సమాధానమూ రాలేదని గుర్తుచేసింది. సభాపతి లెక్క ప్రకారం సహేతుక సమయం అంటే ఎంతకాలమో చెప్పాలని ఈ సందర్భంగా జస్టిస్ మాసిహ్ మరోసారి అడిగారు. దీనికి రోహత్గీ.. అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగుతోందని చెప్పారు. అందుకు ధర్మాసనం.. 'మీరు చెప్పలేకపోతే, ఆ విషయాన్ని మాకు వదిలేయండి' అని వ్యాఖ్యానించింది. "ఒకవేళ స్పీకర్ అసలు ఏ నిర్ణయమూ తీసుకోకుంటే.. రాజ్యాంగ సంరక్షకులుగా ఉన్న ఈ దేశ కోర్టులు నిస్సహాయంగా ఉండిపోవాల్సిందేనా?" అని ప్రశ్నించింది. ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టేనని వ్యాఖ్యానించింది. "స్పీకర్ సహా ఇతరులు స్పందించకుంటే ఆర్టికల్ 142 ప్రకారం చర్యలకు ఉపక్రమించే అధికారం కోర్టులకు ఉంటుంది. గతంలో ఒక స్పీకర్‌ను కోర్టుకు పిలిపించామని మరిచిపోవద్దు' అని ధర్మాసనం హెచ్చరించింది.

నిర్ణయించడం చాలా కష్టం..

ముకుల్ రోహత్గీ వాదనలు ముగిసిన అనంతరం నలుగురు ప్రతివాదులైన ఎమ్మెల్యేల తరఫున గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. 'సహేతుక సమయం' అనేది.. ఆరోపణల స్వభావంపై ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. "అది మూణ్నెల్లా? ఆర్నెల్లా? తొమ్మిది నెలలా? ఎంత సమయమైతే సహేతుకం? అనే విషయాన్ని నిర్ణయించడం చాలా కష్టం" అని పేర్కొన్నారు. ఒకవేళ నిజంగానే సభాపతి అలా ఒక నిర్ణీత సమయంలోగానే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం వస్తే మన ప్రజాస్వామ్యమే ఆ విషయాన్ని చూసుకుంటుందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ఒక సవరణ ద్వారా 1985లో వచ్చిందని.. అవసరాలను బట్టి పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించిన సందర్భాలు చాలా ఉన్నాయని గుర్తుచేశారు. దీనికి జస్టిస్ గవాయ్.. రాజకీయాల్లో స్వచ్ఛతను కాపాడడానికి కోర్టుల ఆదేశాలు కూడా ఉపకరించాయని, కోర్టు ఆదేశాల వల్లే ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులు తమపై ఉన్న నేరాలు, ఆస్తులు, అప్పుల వివరాలతో ప్రమాణపత్రాలను దాఖలు చేస్తున్నారని గుర్తుచేశారు. ఒక నిర్ణీత లక్ష్యంతో రూపొందించిన రాజ్యాంగ నిబంధన నిష్ఫలమైతే కోర్టు చూస్తూ కూర్చోవాలా? దాన్ని అనుమతించాలా? అని ప్రశ్నించారు. దీంతో ఈ కేసులో బుధవారం వాదనలు ముగిశాయి. గురువారం దీనిపై సీనియర్ అడ్వొకేట్లు అభిషేక్ మను సింఘ్వీ, ఆర్యామ సుందరం వాదనలు వినిపించనున్నారు.



స్ట్రెచర్‌పై వచ్చి.. టెన్త్ పరీక్ష రాసి!

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ టెన్త్ విద్యార్థి.. ఆస్పత్రి నుంచి స్ట్రెచర్‌పైనే వచ్చి పట్టుదలతో పరీక్ష రాశాడు. హైదరాబాద్ కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాప్ సమీపంలోని భాష్యం హైస్కూల్ కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. విశ్వతేజ (15) ట్యూషన్‌కు వెళ్తుండగా శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అయితే బుధవారం చివరి పరీక్ష ఉండటంతో ఎలాగైనా రాస్తానని తండ్రి నాగరాజుతో చెప్పడంతో.. ఆయన భాష్యం ప్రిన్సిపాల్ శ్రీదేవిని సంప్రదించారు. ఆమె మానవతా దృక్పథంతో ఆలోచించి డీఈవోతో మాట్లాడి అనుమతి తీసుకున్నారు. దీంతో ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రత్యేక గదిలో ఓ ఇన్విజిలేటర్‌ను ఏర్పాటు చేయడంతో విశ్వతేజ పరీక్ష రాశాడు.

వరంగల్ చపాట మిర్చికి జీఐ ట్యాగ్



హైదరాబాద్, హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ చపాట రకం మిర్చికి భౌగోళిక గుర్తింపు (జీఐ) ట్యాగ్ సర్టిఫికెట్ జారీ అయింది. దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామంలోని తిమ్మంపేట చిల్లీ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ పేర కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీకి ఈ సర్టిఫికెట్‌ను అందించారు. ఈమేరకు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇది తెలంగాణలో నమోదైన 18వ భౌగోళిక గుర్తింపు అని, అలాగే జీఐ ట్యాగ్ పొందిన తొలి ఉద్యాన పంట చపాటా మిర్చియేనని పేర్కొన్నారు. వరంగల్, హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో రైతులు ప్రత్యేకంగా సాగుచేసే ఈ మిర్చిని స్థానికులు టమోటా మిరపకాయ అని పిలుస్తారన్నారు. 80 ఏళ్లుగా ఈ వెరైటీ మిర్చి సాగులో ఉందని, జీఐ వచ్చిన నేపథ్యంలో వరంగల్ రైతులు కిలోకు రూ.300 నుంచి రూ.500 వరకు అమ్ముకోవచ్చని తెలిపారు. జీఐ ట్యాగ్ వల్ల భవిష్యత్తులో చపాట మిర్చికి మంచి ధర లభించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్‌కు అవకాశం లభిస్తుంది.



ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్, చిత్రంలో కేటీఆర్, హరీశ్

రాబోయే రోజులు బీఆర్ఎస్‌వే

» ప్రజలకు కాంగ్రెస్ మోసం అర్థమైంది

» రజతోత్సవ సభను జయప్రదం చేయాలి: కేసీఆర్

హైదరాబాద్/గజ్వేల్/మర్కుక్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని ఆ పార్టీ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు తిరుగుండదని, ప్రజలు కాంగ్రెస్ మోసాన్ని అర్థం చేసుకున్నారని చెప్పారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా సమన్వయకర్తగా హరీశ్‌రావు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమన్వయకర్తగా వేముల ప్రశాంత్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ప్రత్యేక చొరవ తీసుకొని సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించాలని పిలుపునిచ్చారు. పది లక్షల మంది తరలివచ్చే సభకు సరైన వాహనాలను ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేను కేసీఆర్‌కు విధేయుడిని

» ప్రజాప్రతినిధిగా సీఎంను గౌరవిస్తా

» నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలపడంలో తప్పేముంది?

» దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

» 2 రోజుల క్రితం ఎమ్మెల్యే వ్యాఖ్యలు వైరల్

» మా ప్రభుత్వంలోనూ దుబ్బాకకు నిధులు రాలేదు

» కాంగ్రెస్ పాలనలో వేగంగా అభివృద్ధి

» గత పాలకులు నిర్లక్ష్యం చూపారంటూ విమర్శ



దుబ్బాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): "నాకు రాజకీయ భిక్ష పెట్టిందే కేసీఆర్. నేను ఎక్కడా ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడలేదు' అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలకు సమాధానమిచ్చుకుంటూ పోలేనని, తాను కేసీఆర్‌కు విధేయుడనని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజాప్రతినిధిగా తాను సీఎంను గౌరవిస్తానని, రేవంత్‌రెడ్డి తనపై గౌరవంతో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని అన్నారు. దుబ్బాకలో స్కిల్ వర్సిటీ ఏర్పాటుకు సీఎం సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో రెండు రోజుల క్రితం ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం ఎన్నో సంవత్సరాల నుంచి వెనుకబడింది. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, గతంలో మా ప్రభుత్వంలో కూడా సరైన నిధులు రాలేదు. ఇది జగమెరిగిన సత్యం" అని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కన్నా కాంగ్రెస్ పాలనలో దుబ్బాక అభివృద్ధి వేగంగా జరుగుతోందని అభిప్రాయపడ్డారు. దుబ్బాకపై గత పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చూపారని విమర్శించారు. తనకు సీఎంను కలిసే హక్కుందని, అభివృద్ధి కోసం ఎంతదూరమైనా వెళ్తానని వ్యాఖ్యానించారు. ఈ విషయం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తాను సంస్కారవంతమైన వ్యక్తినని, నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలపడంలో తప్పులేదన్నారు. ఇందులో రాజకీయ దురుద్దేశం లేదని తెలిపారు. కాగా, ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై కేసీఆర్ ఎలా స్పందిస్తారోనన్న చర్చ జరిగినా.. ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో జరిగిన సమావేశంలో ఆ అంశమేమీ చర్చకు రాలేదు. ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి హాజరైన ప్రభాకర్‌రెడ్డిని కేసీఆరే పలకరించారు. "ఏం ప్రభాకర్.. దుబ్బాక ఎలా ఉంది? దుబ్బాకలోని నా బాల్యమిత్రులు ఎలా ఉన్నారు? వారందరినీ అడిగినట్టు చెప్పు... దుబ్బాకకు ఒక్కసారి రావాలని ఉంది" అని వ్యాఖ్యానించారు. వరంగల్ సభకు దుబ్బాక నుంచి స్వచ్ఛందంగా కార్యకర్తలు తరలివస్తారని, వీలైనంత ఎక్కువ మందిని తీసుకురావాలని ప్రభాకర్‌రెడ్డికి సూచించారు. ఈ మేరకు ప్రభాకర్‌రెడ్డి బదులిస్తూ.. 15వేలమందికి తగ్గకుండా వస్తామని తెలిపారు.



భారతీయ రిజర్వ్ బ్యాంకు 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం. - హైదరాబాద్ సిటీ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.